అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక


బుధవారం 13-3-2024

సంపుటి : 10 సంచిక : 72 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు వెల : 6.50

సీఏఏ నిబంధనల్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం : సీపీఐ(ఎం)

- మతపరమైన గుర్తింపునకు పౌరసత్వాన్ని ముడిపెట్టడం తగదు
- ముస్లిం పౌరులను లక్ష్యంగా చేసుకుంటారనే భయాందోళనలు

వివరాలు 3లో



మాట్లాడుతున్న అమిత్‌షా

కాంగ్రెస్, బీఆర్ఎస్ అవినీతి పార్టీలు

అధికారం ఎవరికుంటే వారికే మజ్లిస్ వత్తాసు

- తెలంగాణలో కనీసం 12 ఎంపీ సీట్లు గెలవాలి : బూత్ లెవల్ అధ్యక్షుల సభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు అవినీతి పార్టీలని బీజేపీ అగ్రనేత, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం ఒక్కటేననీ, రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే దానికి వత్తాసు పలకటం మజ్లీస్ నైజమని విమర్శించారు. తెలంగాణలో కనీసం 12 ఎంపీ సీట్లను గెలిపించాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళ వారం సికింద్రాబాద్‌లో జరిగిన బీజేపీ సోషల్ మీడియా వారియర్స్ సభలోనూ, ఆతర్వాత నాంపల్లిలోని ఎల్బీ స్టేడియంలో జరిగిన బీజేపీ బూత్ లెవల్ అధ్యక్షులు, మండల, జిల్లా పదాధికారుల సభలోనూ ...13లో

అమిత్ షా వచ్చింది దోచుకోవడానికే..

ఒక్క హామీ అమలు చేయలేదు
బీజేపీ తెలంగాణ వ్యతిరేక పార్టీ

ఐదేండ్లలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తా..: మహాశక్తి పథకం ప్రారంభ సభలో సీఎం రేవంత్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా దోచుకునేందుకే ఇక్కడకు వచ్చారని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. మంగళవారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన స్వయం సహాయక సంఘాల రాష్ట్ర స్థాయి మహిళా సదస్సులో ఆయన మహిళాశక్తి పథకాన్ని ప్రారంభించారు. మహిళా శక్తి పాలసీ డాక్యుమెంట్‌ను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ బీజేపీకి తెలంగాణ ప్రజలు ఎందుకు ఓటు వేయాలని ప్రశ్నించారు. రాష్ట్రంలో పండించిన పంటలను కొన్నారా? అని అడిగారు. రైతుల ఆదాయాన్ని రెండు రెట్లు పెంచుతామనీ హామీ ఇచ్చి, అది అమలు చేయకపోగా ఢిల్లీలో నిలదీసిన రైతులపై కాల్పులు జరిపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు వ్యతిరేక నల్ల చట్టాలతో అదానీ, అంబానీలకు మేలు చేసే చర్యలే తీసుకున్నారని ఎద్దేవా చేశారు. అందరికీ ఇండ్లు ఇస్తామని అధికారంలోకి వచ్చిన బీజేపీ మోసం చేసిందనీ, పేదలు ఇంకా గుడిసెల్లోనే బతకాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. స్విస్ బ్యాంకు నుంచి నల్ల డబ్బును వెనక్కి తెప్పించి ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామంటూ ...13లో



బహిరంగసభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

త్వరలో అర్హులందరికీ తెల్లరేషన్ కార్డు

క్యాబినెట్ నిర్ణయాలు

- 4.5లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి రూ.22,500కోట్లు
- ఇరిగేషన్ అక్రమాలపై విచారణకు జస్టిస్ పిసి ఘోష్ నేతృత్వంలో కమిటీ

వివరాలు 13లో

నేనే గెలిచుంటే దేశాన్ని చైతన్యం చేసేటోన్ని

కాంగ్రెస్ పాలన చూస్తే.. సమైక్య పాలకులే నయమనిపిస్తోంది

- 420హామీలు అమలు అటకెక్కించి.. ఢిల్లీకి మూటలు జారేస్తున్రు
- పండబెట్టి తొక్కుత.. పేగులు మెడల వేసుకుంటనంటూ బెదిరిస్తున్రు
- ముఖ్యమంత్రిస్థాయి నేత మానవబాంబు అవుతానంటరా?



అభివాదం చేస్తున్న మాజీ సీఎం కేసీఆర్

- క్లీన్ క్యారెక్టర్ ఉన్న వినోద్‌ను పార్లమెంట్‌కు పంపాలి : మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్
- కరీంనగర్ కదనభేరితో పార్లమెంట్ ఎన్నికల శంఖారావం

వివరాలు 3లో

గుట్టలో నన్నెవరూ అవమానించలేదు..



- సోషల్ మీడియా ట్రోల్స్ అవాస్తవం..: డిప్యూటీ సీఎం భట్టి

వివరాలు 13లో

43 మందితో రెండో జాబితా

- ఐదు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతం నుంచి కాంగ్రెస్ అభ్యర్థుల ప్రకటన
- పేదల కోసం లోక్‌సభ ఎన్నికల్లో పోటీ : కేసీ వేణుగోపాల్

వివరాలు 13లో

ఎట్టకేలకు...

- ఎన్నికల బాండ్ల వివరాలు అందించిన ఎస్‌బీఐ
- ధ్రువీకరించిన ఈసీ
- బీజేపీకి చేరిన వాస్తవ వివరాలు బహిర్గతమవుతాయా..!



వివరాలు 13లో

టీజీకి కేంద్రం ఓకే

- గెజిట్ విడుదల



నవతెలంగాణ–హైదరాబాద్‌బ్యూరో

వాహన రిజిస్ట్రేషన్లను 'టీఎస్' నుంచి 'టీజీ'గా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. ఈ మేరకు కేంద్ర ఉపరితల, రవాణా మంత్రిత్వ శాఖ మంగళవారం గెజిట్ విడుదల చేసింది. ఈ మార్పును కోరుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసిన విషయం తెలిసిందే. ఇకపై రాష్ట్రంలోని వాహనాల రిజిస్ట్రేషన్లు 'టీజీ' పేరుతో జరగనున్నాయి.

ఆర్టీసీ సంరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిదీ..

- సంస్థ నష్టాల్లో నుంచి లాభాల్లోకి రావడం గర్వకారణం
- మహాలక్ష్మి పథకంతో వందశాతం పెరిగిన ఆక్యుపెన్సీ : డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- ఆర్టీసీ బలోపేతం, అభ్యున్నతికి సహకారమందిస్తాం : మంత్రులు పొన్నం, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- 22 ఎలక్ట్రిక్ నాన్ ఏసీ బస్సులను ప్రారంభించిన మంత్రులు



నవతెలంగాణ–సిటీబ్యూరో/బంజారాహిల్స్

తెలంగాణకు తలమానికమైన ఆర్టీసీని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ప్రభుత్వం ప్రజా రవాణా వ్యవస్థ ప్రాముఖ్యతను గుర్తించి.. 90 రోజుల్లో అనేక కార్యక్రమాలు తీసుకొచ్చిందని వివరించారు. హైదరాబాద్ ఎన్టీఆర్ మార్గ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద తెలంగాణ ఆర్టీసీకి చెందిన గ్రీన్ మెట్రో ఎక్స్‌ప్రెస్ నాన్ ఏసీ బస్సుల ప్రారంభోత్సవానికి మంగళవారం ఉప ముఖ్యమంత్రితోపాటు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరయ్యారు. పర్యావరణహితమైన 22 ఎలక్ట్రిక్ నాన్ ఏసీ బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం అక్కడి నుంచి మంత్రులు ఎలక్ట్రిక్ బస్సులో సచివాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. గతంలో నష్టాల్లో ఉన్న టీఎస్‌ఆర్టీసీ మహాలక్ష్మి పథకం ద్వారా లాభాల్లోకి వెళ్లడమనేది




తెలంగాణకే గర్వకారణమని తెలిపారు. మహిళల టికెట్ డబ్బును టీఎస్‌ఆర్టీసీకి ప్రభుత్వం ఎప్పటికప్పుడూ చెల్లిస్తోందన్నారు. ఆర్టీసీ సిబ్బంది కష్టాన్ని, శ్రమను గుర్తించే వేతన సవరణ చేసి.. 21 శాతం ఫిట్‌మెంట్‌ను ఇటీవల ప్రకటించామని గుర్తు చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. మహాలక్ష్మి పథకం వల్ల టీఎస్‌ఆర్టీసీ కళకళలాడుతోందని, ప్రతి బస్సు 100 శాతం ఆక్యుపెన్సీ రేషియో(ఓఆర్)

తగ్గకుండా తిరుగుతోందని చెప్పారు. ఆర్టీసీ పరిరక్షణ, సిబ్బంది సంక్షేమానికి ప్రభుత్వం ప్రాముఖ్యత ఇస్తోందన్నారు. తొలిసారిగా ఎలక్ట్రిక్ నాన్ ఏసీ బస్సులను సంస్థ అందుబాటులోకి తీసుకొచ్చిందని తెలిపారు. మహాలక్ష్మి పథకాన్ని ఈ బస్సుల్లో కూడా అమలు చేస్తామని చెప్పారు. పెరిగిన రద్దీకి అనుగుణంగా భవిష్యత్‌లో మరిన్ని కొత్త బస్సులు వాడకంలోకి వస్తాయని, వాటి కొనుగోలుకు సంస్థకు ప్రభుత్వం సహాయసహకారాలు అందిస్తుందని వివరించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీఎస్‌ఆర్టీసీ అభ్యున్నతికి పాటుపడు తోందన్నారు. టీఎస్‌ఆర్టీసీ సిబ్బంది నిబద్ధత, అంకితభావం క్రమశిక్షణతో పనిచేస్తూ ప్రతి రోజూ లక్షలాది మందిని క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చుతున్నారని కొనియాడారు. భవిష్యత్‌లోనూ ఇలాగే పనిచేస్తూ దేశంలోనే టీఎస్‌ఆర్టీసీకి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

టీఎస్‌ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ మాట్లాడుతూ.. ఇటీవల తమ ఉద్యోగులకు 21 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించిన ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. రానున్న ఐదారు నెలల్లో ప్రభుత్వ సహకారంతో 2515 బస్సులను వినియోగంలోకి తెచ్చేలా సంస్థ ప్రణాళిక చేసిందని తెలిపారు. ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన బాండ్లకు సంబంధించిన చెక్కులను టీఎస్ ఆర్టీసీ ఉద్యోగులు సరిత, సంజీవ్‌కు మంత్రుల చేతులమీదుగా అందజేశారు. ఈ ప్రారంభోత్సవంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, రవాణా శాఖ కమిషనర్ జ్యోతి బుద్దా ప్రకాశ్, ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి, టీఎస్ ఆర్టీసీ సీవోవో డాక్టర్ రవీందర్, జాయింట్ డైరెక్టర్ అపూర్వరావు, ఈడీలు మునిశేఖర్, కృష్ణకాంత్, వెంకటేశ్వర్లు, సీఎంఈ రఘునాథరావు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో సీనియర్ల పోటీపై ఖర్గే క్లారిటీ!

నవతెలంగాణ–న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ఆ పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఈసారి ఎన్నికల బరి నుంచి దూరం జరిగారు. 2009 ఎన్నికల్లో కర్నాటకలోని గుల్బర్గా నుంచి లోక్‌సభకు ఎన్నికైన ఆయన గత ఎన్నికల్లో అదే స్థానం నుంచి ఓటమి పాలయ్యారు. ఢిల్లీలోని తన నివాసంలో నిన్న మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో తాను పోటీచేయడం లేదని తెలిపారు. ఎందుకలా? అన్న ప్రశ్నకు తన వయసును ప్రస్తావించారు. తన వయసు ఇప్పుడు 83 సంవత్సరాలని, అందుకనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. అయితే, కార్యకర్తలు కనుక పోటీచేయాల్సిందేనని పట్టుబడితే మాత్రం చెయ్యక తప్పదని పేర్కొన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేతలు ఈసారి ఎన్నికల బరి నుంచి తప్పుకుంటున్నారట కదా? అన్న మీడియా ప్రశ్నకు ఖర్గే బదులిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. సీనియర్లు పోటీ నుంచి తప్పుకుంటున్నారన్న వార్తల్లో నిజం లేదని, ఇప్పుడు తన వయసు 83 సంవత్సరాలని, అందుకనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. మీరు (జర్నలిస్టులు) 65 ఏళ్లకే రిటైర్ అవుతారు కదా.. అలాగే తాను 83 ఏళ్ల వయసులో ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. అయితే, పార్టీ కార్యకర్తలు ఒత్తిడి చేస్తే మాత్రం బరిలోకి దిగక తప్పదని స్పష్టం చేశారు. కొన్నిసార్లు ముందుండి నడిపిస్తే, మరికొన్నిసార్లు వెనక ఉండి నడిపించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. తమకు అందిన జాబితాలో ఒకే స్థానం నుంచి పోటీకి పదేసిమంది రెడీగా ఉన్నారని




వివరించారు. బీజేపీ గ్యారెంటీలపై అడిగిన ప్రశ్నకు ఖర్గే బదులిస్తూ.. బీజేపీ తమ గ్యారెంటీలను చోరీ చేసిందని విమర్శించారు. కర్నాటక ఎన్నికల్లో గ్యారెంటీలు ప్రారంభించి గెలిచామని, ఆ తర్వాత అవే గ్యారెంటీలతో తెలంగాణలోనూ విజయం సాధించామని గుర్తుచేశారు. ఇప్పుడు మా ఈ గ్యారెంటీలను మోడీజీ చోరీ చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

సిరిసిల్ల పవర్‌లూం
పరిశ్రమను తెరిపించండి

- చేనేత కార్మికుల ఆత్మహత్యలను నివారించండి : సీఎం రేవంత్‌రెడ్డికి తమ్మినేని లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



సిరిసిల్ల పవర్‌లూం పరిశ్రమను తెరిపించాలనీ, తద్వారా చేనేత కార్మికుల ఆత్మహత్యలను నివారించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారికి ఉపాధి అవకాశాలను కల్పించాలని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన మంగళవారం లేఖ రాశారు. రాష్ట్రంలో రెండు లక్షలకు పైగా చేనేత, పవర్‌లూం కార్మికులు వస్త్ర పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారని వివరించారు. సిరిసిల్లలో గత మూణ్నెల్లుగా వస్త్ర పరిశ్రమ పూర్తిగా సంక్షోభంలోకి కూరుకుపోయి మూతపడిందని తెలిపారు. దీంతో ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులతో కుటుంబ పోషణ భారమై ఈనెల 11న తడుక శ్రీనివాస్ (42) అనే పవర్‌లూం కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడ్డారని గుర్తు చేశారు. మరోవైపు ఆ పరిశ్రమ కార్మికులు గత 15 రోజులుగా ఆందోళన చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్మికులకు ఉపాధి కల్పన కోసం బతుకమ్మ చీరలతోపాటు గిరిజన, బీసీ సంక్షేమ గురుకులాలు, ఆర్వీఎం, కేజీబీవీ తదితరాలకు వస్త్రాలను టెస్కో ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రాథమిక చేనేత సహకార సంఘాల కార్మికులతో ఉత్పత్తి చేయించారని తెలిపారు. కానీ వివిధ శాఖలు టెస్కోకు, ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు రూ.485.89 కోట్లు చెల్లించలేదని వివరించారు. ఈ బకాయిలను చెల్లించకపోవడంతో యాజమాన్యాలు వస్త్ర పరిశ్రమలను నిలిపేశాయని పేర్కొన్నారు. రాష్ట్రంలోని చేనేత కార్మికులకు ఉపాధి కల్పించడానికి ప్రభుత్వ సంస్థలైన గ్రామపంచాయతీ, మున్సిపల్, ఆశ, అంగన్‌వాడీ, సింగరేణి, ఆర్టీసీ, పోలీస్, ప్రభుత్వ ఆస్పత్రులు, కార్యాలయాలు, గురుకుల పాఠశాలలు తదితర సంస్థలకు అవసరమయ్యే వస్త్రాలను చేనేత కార్మికులతో ఉత్పత్తి చేయించాలని సూచించారు. ఫలితంగా చేనేత, పవర్‌లూం కార్మికుల కుటుంబాలకు ఉపాధి దొరుకుతుందని తమ్మినేని ఈ సందర్భంగా తెలిపారు. వారి ఆకలి చావులు, ఆత్మహత్యలను నివారించొచ్చని కోరారు. తక్షణమే పై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి ...
సమగ్ర భూసర్వే నిర్వహించాలి

- కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలి
- 7.5 లక్షల మంది పోడు రైతులకు పట్టాలివ్వాలి
- కృష్ణా పరివాహక ప్రాంతంలో సాగు నీరందించి పంటలను కాపాడాలి
- పంటనష్టంపై సర్వే జరిపి రూ.10 వేల పరిహారమందించాలి : భూ సదస్సులో వక్తల డిమాండ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సమగ్ర భూ సర్వే నిర్వహించి పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కనుగొనాలని తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం అధ్వర్యంలో మంగళ వారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన భూ సదస్సులో వక్తలు డిమాండ్ చేశారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలనీ, పంట నష్టంపై సర్వే జరిపి పరిహారం అందించాలనీ వారు కోరారు. డంపింగ్ యార్డులు, రైతు వేదికలు, ఇతర ప్రభుత్వ అవసరాల కోసం రైతుల నుంచి తీసుకున్న భూములకు పరిహారం చెల్లించాలనే పలు తీర్మానాలను ఆమోదించారు.

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ మాట్లాడుతూ 1940లో నిర్వహించిన సమగ్ర భూ సర్వే తర్వాత ఇప్పటి వరకు ఎలాంటి సర్వే జరగలేదని అన్నారు. నిజామాబాద్ జిల్లాను పైలట్ ప్రాజెక్ట్‌గా తీసుకుని సర్వే చేపట్టినా దాన్ని పూర్తి చేయలేదని గుర్తు చేశారు. 1971 పాసుపుస్తకాల చట్టాన్ని మార్చి బీఆర్ఎస్ ప్రభుత్వం 2020లో ఆర్వోఆర్ చట్టాన్ని ధరణి పేరుతో తెచ్చారని చెప్పారు. ఆ పోర్టల్ వచ్చిన తర్వాత రైతుల సమస్యలు పరిష్కారం కాకపోగా, మరిన్ని పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థలను పురరుద్ధరించాలనీ, కాస్తుకాలాన్ని తిరిగి ఏర్పాటు చేయాలని కోరారు. 2011 కౌల్దారి చట్టం ప్రకారం కౌలు రైతులకు గుర్తింపు కార్డులిచ్చి అన్ని ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాని డిమాండ్ చేశారు. 2006 అటవీ హక్కుల చట్టం ప్రకారం 11.5 లక్షల ఎకరాలకు పట్టాలిస్తామని చెప్పిన బీఆర్ఎస్ సర్కార్ కేవలం 4.2 లక్షల ఎకరాలకు మాత్రమే ఇచ్చిందన్నారు. పెండింగ్‌లో ఉన్న 7.5 లక్షల ఎకరాల పోడు భూములకు కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డులు, రైతు వేదికలు, ఇతర ప్రభుత్వ అవసరాల కోసం రైతుల నుంచి తీసుకున్న భూములకు పరిహారం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. కృష్ణా పరివాహక ప్రాంతంలో సాగు నీరందించి పంటలను కాపాడాలనీ, పంటనష్టంపై రాష్ట్ర ప్రభుత్వం సర్వే జరిపి రూ.10 వేల పరిహారమందించాలని కోరారు. సదస్సుకు అధ్యక్షత వహించిన తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ రావు మాట్లాడుతూ ధరణి తర్వాత 16,57,407 భూ సమస్యలపై దరఖాస్తులు రాగా గత సర్కార్ 5,37,282 దరఖాస్తులను పరిష్కరించి, 5,37,984 దరఖాస్తులను తిరస్కరించిందని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న 2.45 లక్షల దరఖాస్తుల పరిష్కారం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్ చేపట్టిందన్నారు. మొదటి విడతలో 1.10 లక్షల దరఖాస్తులను పరిష్కరించామనీ, పెండింగ్ అర్జీల పరిష్కారానికి రెండవ విడత స్పెషల్ డ్రైవ్ చేపట్టిందని పేర్కొన్నారు. గత సర్కార్ హయాంలో నిజమైన సమస్యలను సైతం టార్గెట్ కోసం అధికారులు తిరస్కరించారనీ, వాటిని సమీక్షించి పరిష్కరించాలని కోరారు. కొత్త దరఖాస్తుల ఆన్‌లైన్‌ను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం భూ సమస్యలపై రాష్ట్రంలోని రైతు సంఘాలతో చర్చించాలని సూచించారు.

ఏఐకేఎస్ జాతీయ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి మాట్లాడుతూ పాసుపుస్తకాల చట్టం 26ను వెంటనే పునరుద్ధరించి పట్టాదారు, సాగుదారు, కౌలుదారు, తాకట్టుదారు అనే కాలాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి సూచించారు. వీటిని పునరుద్ధరించకుండా ఎన్ని సంస్కరణలు చేసినా భూ వివాదాలు పరిష్కారం కావని చెప్పారు. ట్రస్టులు, వ్యవసాయేతర, కాఫీ, రబ్బరు తోటల పేరుతో సీలింగ్‌కు తూట్లు పొడిచి వందల ఎకరాలను భూ స్వాములు కబ్జా చేశారని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రైతు సంఘం ఉపాధ్యక్షులు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ వీర తెలంగాణ సాయుధ పోరాటంలో వామపక్షాల నేతృత్వంలో 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచామని గుర్తు చేశారు. రాష్ట్రంలో భూ సమస్యల పరిష్కారం కోసం కమ్యునిష్టులు మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. భూ సదస్సులో అమోదించిన తీర్మానాలను మెమోరాండం ద్వారా ముఖ్యమంత్రిని కలిసి అందించనున్నట్టు తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు మాట్లాడుతూ ధరణి వల్ల భూ స్వాములకు లాభం జరిగిందే తప్ప పేదరైతులకు కాదన్నారు. కొడంగల్, చౌటుప్పల్ తదితర ప్రాంతాల్లో వందల ఎకరాల భూములు వారి వశమయ్యాయని గుర్తు చేశారు. లోప భూయిష్టమైన ఈ పోర్టల్‌ను సమూలంగా ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు బి. ప్రసాద్ మాట్లాడుతూ కేరళ తరహాలో ఉపాధి హామి పథకాన్ని పట్టణ పేదలకు అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో
భట్టి, కొండా సురేఖపై కులవివక్ష

- ఈ ఘటనపై విచారణ జరిపించాలి
- బాధ్యులను చట్ట ప్రకారం శిక్షించాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

యాదాద్రి ఆలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పట్ల ఆలయ నిర్వాహకులు కులవివక్షను ప్రదర్శించారని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ విమర్శించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రితోపాటు సందర్శించిన మంత్రుల్లో వారిద్దరినీ మాత్రమే వేరుగా చూశారని తెలిపారు. సీఎం దంపతులకు, అగ్రవర్ణాలకు చెందిన ఇతర మంత్రులకు కుర్చీలు వేసి, వారిద్దరిని మాత్రం చిన్న పీటలమీద కూర్చోబెట్టి కులవివక్షను ప్రదర్శించారని పేర్కొన్నారు. సీఎం సమక్షంలో వివక్ష ప్రదర్శించడం మరింత ఆందోళనకరమని తెలిపారు. ఇతర మంత్రులు కూడా కనీసం ప్రొటోకాల్ పాటించలేదని పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ శాఖ మంత్రి కూర్చున్న తర్వాత మిగిలిన స్థానాల్లో వారు కూర్చుని ఉంటే హుందాగా ఉండేదని వివరించారు. ఈ ఘటనపై విచారణ జరిపించాలనీ, కులవివక్షకు బాధ్యులైన వారిని చట్ట ప్రకారం శిక్షించాలని డిమాండ్ చేశారు.

317 జీవో సమస్యలను పరిష్కరిస్తాం

- 14న ఉద్యోగ సంఘాలతో సమావేశం
- గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు : మంత్రివర్గ ఉపసంఘం చైర్మెన్ దామోదర రాజనర్సింహ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 317 జీవో ద్వారా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రివర్గ ఉపసంఘం చైర్మెన్ దామోదర రాజనర్సింహ చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో 317 జీవోపై ఏర్పడిన మంత్రివర్గ ఉపసంఘం సమావేశాన్ని రాజనర్సింహ అధ్యక్షతన నిర్వహించారు. ఉపసంఘం సభ్యులు మంత్రులు డి శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. 317, 46 జీవోల వల్ల ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులను అడిగి వారు తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారులకు రాజనర్సింహ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. 317 జీవోలోని లోటుపాట్లు, పలు అంశాలపై లోతుగా అధ్యయనం చేయాలని నిర్ణయించామని తెలిపారు.

ప్రధాని ప్రసంగాన్ని ప్రసారం చేయండి

- వికసిత్ భారత్ పోస్టర్లను ఏర్పాటు చేయండి
- ఉన్నత విద్యా సంస్థలకు ఆదేశాలు
- ఇది ప్రచారం కోసమేనంటున్న విద్యావేత్తలు

న్యూఢిల్లీ : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నాయి. మరో రెండు మూడు రోజులలో ఎన్నికల షెడ్యూలు కూడా విడుదల కాబోతోంది. ఆ వెంటనే ప్రవర్తనా నియమావళి అమలులోకి వస్తుంది. కోడ్ అమలులోకి వచ్చేలోగా ఓటర్లను ఆకర్షించేందుకు అధికారిక కార్యక్రమాలను ఉపయోగించుకోవాలని నరేంద్ర మోడీ ప్రభుత్వం భావిస్తోంది. ప్రధాని మోడీ బుధవారం గుజరాత్, అసోం రాష్ట్రాలలో సెమీకండక్టర్ ఫ్యాబ్‌ల ఏర్పాటుకు శంకుస్థాపన చేయబోతున్నారు. ఆ సందర్భంగా ఏర్పాటు చేసే అధికారిక కార్యక్రమాలలో ప్రసంగిస్తారు. స్క్రీన్లు ఏర్పాటు చేసి ప్రధాని ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయాల్సిందిగా దేశంలోని ఉన్నత విద్యా సంస్థలకు (హెచ్‌ఈఐలు) కేంద్రం హుకుం జారీ చేసింది. తొలిసారి ఓటు హక్కు వినియోగించుకోబోతున్న యువతను బీజేపీ వైపు ఆకర్షించేందుకు అధికార కార్యక్రమాన్ని ఉపయోగించుకుంటున్నారని 'టెలిగ్రాఫ్' పత్రిక తెలిపింది.

గుజరాత్‌లోని ధొలేరా, సనంద్, అసోంలోని మోరిగాన్‌లో సెమీకండక్టర్ ఫ్యాబ్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. వీటికి ప్రధాని భూమిపూజ చేయడం తప్పేమీ కాదు కానీ ఆయన ప్రసంగాన్ని దేశవ్యాప్తంగా ఉన్నత విద్యా సంస్థల్లో ప్రసారం చేయాలని అనుకోవడం 'ప్రచార కార్యక్రమం' మినహా మరొకటి కాదని విద్యావేత్తలు అంటున్నారు. ఇది ఉన్నత విద్యా సంస్థల వ్యవహారాలలో జోక్యం చేసుకోవడమే అవుతుందని విమర్శిస్తున్నారు. కార్యక్రమాలు జరిగే ప్రదేశాలలో మోడీ చిత్రాలతో కూడిన వికసిత్ భారత్ పోస్టర్లను ఏర్పాటు చేయాలని విద్యా శాఖ హెచ్‌ఈఐలను ఆదేశించింది. తన ఆదేశాలను పాటించిందీ లేనిదీ కార్యక్రమం పూర్తయిన తర్వాత నివేదిక రూపంలో తెలియజేయాలని కూడా సూచించింది. దేశంలోని రాష్ట్ర స్థాయి యూనివర్సిటీలు, ప్రైవేటు వర్సిటీలు సహా అన్ని



యూనివర్సిటీలలో ఈ కార్యక్రమాన్ని ఏ విధంగా ప్రసారం చేయాలో కూడా మంత్రిత్వ శాఖ, యూజీసీ సూచించాయి. 'కార్యక్రమ నిర్వహణకు సంబంధించి ఐదు పోస్టర్ల డిజైన్లను పంపుతున్నాం. విద్యార్థులకు ఈ కార్యక్రమానికి సంబంధించిన సమాచారాన్ని అందించండి. వికసిత్ భారత్ విజన్ దిశగా ఈ కార్యక్రమంలో విద్యార్థులు భాగస్వాములయ్యేలా చూడండి' అని హెచ్‌ఈఐలకు రాసిన లేఖలో యూజీసీ కార్యదర్శి మనీష్ జోషీ వివరించారు.

విద్యావేత్తల విమర్శ

ఇది లోక్‌సభ ఎన్నికలకు ముందు నిర్వహించే ప్రచార కార్యక్రమం మాత్రమేనని మిరండా హౌస్ కళాశాల ఉపాధ్యాయుడు అబా దేవ్ హబీబ్ వ్యాఖ్యానించారు. రాజకీయ ఉద్దేశంతో ఇలాంటి ఆదేశాలు జారీ చేయడం సరికాదని ఢిల్లీ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు అశోక్ అగర్వాల్ చెప్పారు. రాజకీయ ఉద్దేశాలతో ఏర్పాటు చేసిన కార్యక్రమం కోసం సమయాన్ని వెచ్చించాలని విద్యా సంస్థలను బలవంతం చేయడం తప్పుడు చర్య అని అన్నారు. ఉన్నత విద్యా సంస్థలు స్వయం ప్రతిపత్తి కలిగినవని, ఇలాంటి ఆదేశాలను బేఖాతరు చేసే అధికారం వాటికి ఉన్నదని, అయితే తమపై వేధింపులకు పాల్పడతారన్న భయంతో ఆ సంస్థలు అలా చేయడానికి సాహసించవని ఆయన తెలిపారు.

ఇది మొదటిసారి కాదు

ప్రభుత్వ ప్రచార కార్యక్రమాలకు విద్యా సంస్థలను వాడుకోవడం ఇది మొదటిసారి కాదు. యూనివర్సిటీలు, కాలేజీల ఆవరణల్లో మోడీ ప్రభుత్వ 'బేటీ బచావ్ బేటీ పఢావ్' లోగోలను ఏర్పాటు చేయాలని గతంలో యూజీసీ ఆదేశించింది. మోడీ నేపథ్యంలో సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేయాలని గత సంవత్సరం డిసెంబరులో హుకుం జారీ చేసింది. ఆర్ఎస్ఎస్ నేత దత్తాజీ దిదోల్కర్ జయంతి ఉత్సవాలలో విద్యార్థులు పాల్గొనేలా చూడాలని కొద్ది రోజుల క్రితం మహారాష్ట్రలోని ఉన్నత విద్యా సంస్థలన్నింటికి సూచనలు చేసింది.

పవర్‌లూమ్ కార్మికుడి ఆత్మహత్య

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్


ఆర్థిక ఇబ్బందులతో సిరిసిల్ల జిల్లా కేంద్రంలో పవర్ లూమ్ కార్మికుడు మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా చేశారు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణం లోని బీవైనగర్‌కు చెందిన తడక శ్రీనివాస్ పవర్‌లూమ్ కార్మికుడుగా పనిచేస్తూ జీవనాన్ని కొనసాగిస్తున్నాడు. అతనికి భార్య లావణ్య, ఇద్దరు కూతుర్లు ఉండగా, కుటుంబ కలహాలతో ఏడేండ్లుగా భార్య పిల్లలతో వేరుగా ఉంటోంది. ఇటు కుటుంబ సమస్యలు.. మరోవైపు మూడు నెలలుగా ఉపాధి లేక, ఆర్థిక ఇబ్బందులు ఎక్కువయ్యాయి. దీంతో శ్రీనివాస్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి : మూషం రమేష్, పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు

ఆత్మహత్య చేసుకున్న పవర్‌లూమ్ కార్మికుడు తడక శ్రీనివాస్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్, జిల్లా అధ్యక్షుడు కోడం రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం అంబేద్కర్ చౌక్ వద్ద వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో రోడ్డుపై బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడు నెలల నుంచి వస్త్ర పరిశ్రమ బంద్‌తో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పలుమార్లు ఆందోళన చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈసీ పని తీరుపై నీలి నీడలు

ప్రశ్నార్థకం అవుతున్న పారదర్శకత



లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ఎన్నికల కమిషనర్ అరుణ్ గోయల్ తన పదవికి రాజీనామా చేయడంతో ఎన్నికల కమిషన్ పనితీరుపై నీలినీడలు అలముకున్నాయి. దాని పారదర్శకత రానురానూ ప్రశ్నార్థకం అవుతోంది. గోయల్ రాజీనామాతో ఇప్పుడు ఈసీలో కేవలం ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ మాత్రమే ఉన్నారు. గత నెలలో పదవీ విరమణ చేసిన అనూప్ పాండే స్థానంలో ఇప్పటి వరకూ ఎవరినీ నియమించలేదు. ఈ వారంలోనే ప్రధాని నేతృత్వంలోని ఎంపిక కమిటీ సమావేశమై ఖాళీగా ఉన్న రెండు పదవులను భర్తీ చేసే అవకాశం ఉంది.

న్యూఢిల్లీ : ప్రజాస్వామిక వ్యవస్థలో ఎన్నికల కమిషన్ నిర్వహించే పాత్రకు ఎంతో ప్రాధాన్యత ఉంది. లోక్‌సభ, రాజ్యసభ, రాష్ట్రాల శాసనసభలకు ఈ సంస్థ ఆధ్వర్యంలోనే ఎన్నికలు జరుగుతాయి. రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి పదవులకు కూడా ఎన్నికల కమిషనే ఎన్నికలు నిర్వహిస్తుంది. వివిధ రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రవర్తనా నియమావళికి కట్టుబడి ఉండేలా ఈసీ చర్యలు తీసుకుంటుంది. అయితే ఇటీవలి కాలంలో దేశంలో స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహిం చడం అసాధ్యంగా మారింది. ప్రజాస్వా మ్యానికి తావే లేకుండా పోతోంది. నియంతృత్వం రాజ్యమేలుతోంది. ఈ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ స్వతంత్రత, పారదర్శకత, పనితీరు ప్రశ్నార్థకంగా మారింది.

ప్రధాని నిర్ణయం మేరకే...

అరుణ్ గోయల్ రాజీనామా అనేక ప్రశ్నలు లేవనెత్తింది. అయితే ఆయన నియామకం వివాదరహితమైనదేమీ కాదు. ఐఏఎస్ పదవికి రాజీనామా చేసిన మరునాడే 2022 నవంబర్ 10న ఆయన ఈసీగా నియమితులయ్యారు. ఈ హడావిడి ప్రక్రియను సుప్రీంకోర్టు తప్పు పట్టింది కూడా. ఈసీలో ఇప్పుడు ఖాళీగా ఉన్న ఎన్నికల కమిషనర్ల పదవులను నూతన చట్టం ప్రకారం భర్తీ చేస్తారు. ఈసీలు, సీఈసీల నియామక ప్రక్రియ నుండి ప్రధాన న్యాయమూర్తిని తప్పించిన విషయం తెలిసిందే. దీంతో ప్రధాని అభీష్టం మేరకే నియామకాలు జరిగి పోతాయి. ఎంపిక కమిటీలో ప్రతిపక్ష నేత సభ్యుడుగా ఉన్నప్పటికీ ఆయన మాట చెల్లుబాటు కాదు.

ఈబీలపై పిల్లిమొగ్గలు

ఎన్నికల బాండ్ల పథకంపై సుప్రీంకోర్టు గత నెలలో సంచలన తీర్పు ఇచ్చిన తర్వాత మూడు రోజుల వరకూ ఈసీ పెదవి విప్పలేదు. ఆ తర్వాత కోర్టు ఆదేశాలను అమలు చేస్తామని సీఈసీ రాజీవ్ కుమార్ ముక్తసరిగా చెప్పారు. సుప్రీంకోర్టు తాజా ఆదేశాల మేరకు ఈసీ ఈ నెల 15వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోగా ఎన్నికల బాండ్ల వివరాలను తన వెబ్‌సైట్‌లో పెట్టాల్సి ఉంటుంది. వాస్తవానికి ఎన్నికల బాండ్ల పథకంపై ఈసీ మొదటి నుండి పిల్లిమొగ్గలు వేస్తోంది. ఈ పథకం ప్రారంభం కావడానికి ముందు దానిని వ్యతిరేకిస్తూ న్యాయ శాఖకు లేఖ రాసింది. అయితే 2021లో హఠాత్తుగా తన వైఖరిని మార్చుకుంది. ఎన్నికల బాండ్ల జారీపై స్టే విధించాలన్న అభ్యర్థనను సుప్రీంకోర్టులో వ్యతిరేకించింది.

ఈవీఎంలు, వీవీపాట్లపై...

ఎన్నికల్లో ఈవీఎంలు, వీవీపాట్లను ఉపయోగిం చడంపై పలు అనుమానాలు, సందేహాలు వ్యక్తమవుతున్నాయి. 2019 ఎన్నికల్లో ఈవీఎంలు, వీవీపాట్ల మధ్య వచ్చిన వ్యత్యాసాలకు సంబంధించి ఎన్నికల కమిషన్ కేంద్రానికి ఎలాంటి వివరణలు ఇవ్వలేదు. గత నాలుగు సంవత్సరాలుగా ఈసీ నుండి సమాధానం కోసం ఎదురు చూస్తున్నామని కేంద్ర ప్రభుత్వం గత జూలైలో పార్లమెంటుకు తెలియజేసింది. ఈవీఎంలను నూటికి నూరు శాతం పరిశీలించడం తిరోగమనమే అవుతుందని, అది తిరిగి పేపర్ బ్యాలెట్ పద్ధతికి దారితీస్తుందని గత సెప్టెంబరులో సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో ఈసీ తెలిపింది.

అసమ్మతి తెలిపితే అంతే

ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా నియమితులు కావడానికి కొద్ది నెలల ముందు అంటే 2020 ఆగస్టులో ఎన్నికల కమిషనర్ అశోక్ లవాసా తన పదవికి రాజీనామా చేశారు. 2019 లోక్‌సభ ఎన్ని కల ప్రచారం సందర్భంగా మోడీ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారని లవాసా అభిప్రాయ పడ్డారు. ఈసీలో మిగిలిన ఇద్దరు సభ్యులు దీనితో ఏకీభవించకపోవడంతో కమిషన్ ఆదేశాలలో తన అసమ్మతిని నమోదు చేయాలని లవాసా పట్టు బట్టారు.

ఈ ఉదంతం జరిగిన తర్వాత కొన్ని వారా లకు లవాసా మొబైల్ ఫోన్ పెగాసస్ స్పైవేర్‌కు లక్ష్యంగా మారింది. 2019లో లవాసా భార్య, కుమా రుడు, సోదరిపై కూడా దర్యాప్తు సంస్థలు నిఘా పెట్టాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్ అయ్యే అవకా శాలు ఉన్నప్పటికీ లవాసా 2020లో కమిషన్‌కు రాజీనామా చేసి ఆసియన్ అభివృద్ధి బ్యాంక్‌లో ఉపాధ్యక్షుడుగా చేరారు. ప్రస్తుతం ఆయన అక్కడే పనిచేస్తున్నారు. తన రాజీనామాకు ముందు ఆయన ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రికలో ఓ వ్యాసం రాస్తూ 'ఇది హుందాగా వ్యవహరించినందుకు లభించిన మూల్యం' అని వ్యాఖ్యానించారు.

అర్థం చేసుకోవడం కష్టం

మోడీ ప్రభుత్వ నిర్ణయంపై మాజీ ఈసీ లవాసా

న్యూఢిల్లీ : ఎన్నికల కమిషనర్ల ఎంపిక కమిటీ నుండి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని తప్పిస్తూ నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అర్థం చేసుకోవడం కష్టమేనని మాజీ ఎన్నికల కమిషనర్ అశోక్ లవాసా వ్యాఖ్యానించారు. ఎన్నికల కమిషనర్ల నియామకం విషయంలో సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఈసీలో ఖాళీల భర్తీ కోసం ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని ఆయన తప్పుపట్టారు. గతంలో ఎన్నికల కమిషనర్ల నియామకం జరిపినప్పుడు ప్రధానితో ప్రధాన న్యాయమూర్తి ఏ సందర్భంలోనూ విభేదిం చలేదని గుర్తు చేశారు. 'ప్రభుత్వం మొదట్లో ఎన్నికల కమిషనర్లకు, ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు క్యాబి నెట్ కార్యదర్శి హోదా ఇచ్చింది. ఆ తర్వాత వారికి సుప్రీంకోర్టు న్యాయమూర్తి హోదాను పునరుద్ధరిం చింది. అయితే వారి తొలగింపు ప్రక్రియలో తేడా చూపించింది. ఇలా ఎందుకు చేస్తోందో అర్థం కావడం లేదు' అని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రికకు రాసిన వ్యాసంలో లవాసా వ్యాఖ్యానించారు.

నేనే గెలిచుంటే దేశాన్ని చైతన్యం చేసేటోన్ని

- మేడిగడ్డలో రెండు పిల్లర్లు కుంగితే దేశమే మునిగిపోయిందా?
- ఒకట్రెండ్రోజుల్లో టీవీలకొస్త.. కాళేశ్వరంపై వివరిస్తా
- పార్లమెంట్‌లో గులాబీ జెండాను ఎగరవేయాలి : కేసీఆర్



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనను చూస్తే.. నాటి సమైక్య పాలకులే నయమనిపిస్తోంది. 420 హామీలు ఇచ్చి.. ప్రజలను ఏమార్చి అధికారంలోకి వచ్చి.. నేడు ఢిల్లీకి మూటలు జారేస్తున్నారు. ఆరు గ్యారంటీలు, కరెంటు సంగతి అడిగితే పండబెట్టి తొక్కుత.. పేగులు మెడకేసుకుంటా నంటూ బెదిరిస్తున్నారు.. అసలు ముఖ్యమంత్రి స్థాయి నేత మానవబాంబు అవుతా అంటూ మాట్లాడొచ్చునా?. ఇసుక జారి రెండు పిల్లర్లు కుంగిన మేడిగడ్డ బరాజ్‌తో దేశమే మునిగిపోయినట్టు రచ్చ చేస్తున్నారు.. దాన్ని సరిచేసి ఎండాకాలంలో రైతులకు నీళ్లు ఇవ్వకుండా కడుపు మాడ్చుతున్నరు. ఒకట్రెండు రోజుల్లో టీవీలకొస్త.. కాళేశ్వరం విలువను వివరిస్తా. పార్లమెంట్‌లో గులాబీ జెండాను ఎగవేయాలి' అంటూ మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రజలకు పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నిక పోరు నేపథ్యంలో కదనభేరి పేరుతో బీఆర్ఎస్ పార్టీ కరీంనగర్ వేదికగా ఎస్సారఆర్ మైదానంలో మంగళవారం సాయంత్రం బహిరంగ సభ నిర్వహించి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టింది. ఈ సందర్భంగా కేసీఆర్ ప్రసంగించారు.

ప్రస్తుతం రాష్ట్రంలో రైతుల దయనీయ పరిస్థితి చూస్తే కన్నీళ్లు వస్తున్నాయని, పంటలు ఎండిపోతున్నా పాలకులకు దయ రావట్లేదని అన్నారు. మూడు నెలల్లోనే కాంగ్రెస్ పాలకులు తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఢిల్లీకి తాకట్టు పెడుతూ రాష్ట్రాన్ని ఆగం చేశారని, ఇదంతా చూస్తుంటే సమైక్య పాలకులే నయమనిపిస్తోందని తెలిపారు. తెలంగాణలో మొన్న తాను గెలిచి ఉంటే.. దేశాన్ని చైతన్యం చేసేవాన్ని, తాను దిగిపోగానే కరెంట్, రైతుబంధు కట్ అయ్యాయని అన్నారు.

'ఒక పన్ను వదులైతే మొత్తం పళ్లను రాలగొట్టుకుంటామా? కాళేశ్వరంలో ఇసుక జారి రెండు పిల్లర్లు కుంగితే దేశమే మునిగిపోతోంది' అని రచ్చ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకటి, రెండు రోజుల్లో టీవీల్లోకి వస్తానని, కాళేశ్వరంపై వివరిస్తానని చెప్పారు. మంచినీటి, సాగునీటి సరఫరాలో, కరెంటు సప్లయ్‌లో, ప్రజా సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. 'మేం ఎంతో శ్రమించి ఇంటింటికీ మంచి నీళ్లు ఇవ్వడం కోసం మిషన్ భగీరథ పథకం తీసుకొచ్చినం. ఆదిలాబాద్ గోండు గూడెం నుంచి నల్లగొండ లంబాడీతండా దాకా అందరికీ మంచినీళ్లు అందేలా చూసినం. బ్రహ్మాండంగా మంచినీటి సరఫరా చేసినం. ఇప్పుడున్న ప్రభుత్వానికి ఆ పథకాన్ని నడిపే తెలివి లేదా..? ఎందుకు మిషన్ భగీరథలో సమస్యలు వస్తున్నయ్..?' అంటూ ప్రశ్నించారు.

నీచంగా ముఖ్యమంత్రి భాష...

ముఖ్యమంత్రిని ఆరు గ్యారంటీలు అడిగితే.. పండబెట్టి తొక్కుతా, పేగులు మెడలో వేసుకుంటా, చీరుతా, నరుకుతా, మానవ బాంబు అవుతా అంటున్నారని కేసీఆర్ అన్నారు. ఉద్యమ సమయంలో తానూ పరుషంగా మాట్లాడాగానీ, సీఎం అయ్యాక ఏనాడూ అలా మాట్లాడలేదం టూ చెప్పుకొచ్చారు. 'ఇయ్యాల మళ్ల మీరు ఆళ్లకే ఓటేస్తే నష్టపోతరు. మేం రైతుబంధు ఇయ్యకపోయినా.. కరెంటు సక్కగ ఇయ్యకున్నా.. తాగు, సాగునీటి సరఫరా లేకున్నా.. మోటర్లు కాలబెట్టినా.. పొలాలు ఎండబెట్టినా.. జనం మళ్లీ తమకే ఓటేసింద్రని ఆరు గ్యారంటీలకు ఎగనామం పెడ్తరు' అంటూ హెచ్చరించారు.

తమాషాకు ఓటేయొద్దు.. ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి

ఈ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి కర్రు కాల్చి వాత పెట్టకపోతే వాళ్లలో నిర్లక్ష్యం, అహంకారం మరింత పెరుగుతుందని ఓటర్లను హెచ్చరించారు. ఈ ఎన్నికల్లో గులాబీ జెండా ఎంత బలంగా ఎగిరితే.. బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన అంత బలంగా, కాపలాదారుగా కొట్లాడుతుందని భరోసా ఇచ్చారు. తమాషాకు ఓటేయొద్దని, ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. తెలంగాణ సమాజం బాగా ఆలోచించి గులాబీ జెండా ఎగరేసి మన ఎంపీలను గెలిపించుకోవాలని అన్నారు. ఈ కదనభేరి సభాధ్యక్షునిగా కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల వ్యవహరించగా.. ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కడియం శ్రీహరి, కౌశిక్‌రెడ్డి సహా పార్టీ సీనియర్ నాయకులు, శ్రేణులు, ప్రజలు పెద్దఎత్తున హాజరయ్యారు.

సింగరేణిలో సిరులు కురిపిస్తాం

- 800 మెగావాట్ల రామగుండం ప్లాంట్ జెన్‌కో నుంచి బదిలీ...
- జైపూర్‌లో మరో 800 మెగావాట్ల పవర్ స్టేషన్ ఏర్పాటు
- 'తాడిచెర్ల'ను సింగరేణికి ఇచ్చేందుకు కేంద్రం సానుకూలం
- నైనీ బ్లాక్ పర్యావరణ అనుమతులకూ ఓకే

హైదరాబాద్‌లో సింగరేణి గెస్ట్ హౌజ్ శంకుస్థాపనలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సింగరేణి కాలరీస్ ద్వారా రాష్ట్రానికి సిరుల పంట కురిపిస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. ఇక్కడి సొమ్మును ఇక్కడి కార్మికులు, రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసమే ఖర్చు చేస్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో ప్రభుత్వం కేటాయించిన వెయ్యిగజాల భూమిలో సింగరేణి కాలరీస్ గెస్ట్‌హౌజ్ భవన నిర్మాణానికి మంగళవారంనాడాయన శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీఎస్‌జెన్‌కో ఆధీనంలో మూతపడి ఉన్న 800 మెగావాట్ల రామగుండం థర్మల్ పవర్ స్టేషన్ పునర్నిర్మాణాన్ని సింగరేణికి అప్పగిస్తామని చెప్పారు. జైపూర్‌లో ప్రస్తుతం ఉన్న 1,600 మెగావాట్ల థర్మల్ కేంద్రాల వద్దే మరో 800 మెగావాట్ల థర్మల్ కేంద్రాన్ని నిర్మించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. నైనీ బ్లాక్ బొగ్గుగనుల పర్యావరణ అనుమతులు, తాడిచెర్ల బొగ్గుగనుల్ని సింగరేణికి కేటాయించేందుకు కేంద్ర బొగ్గు మంత్రిత్వశాఖ సూచనప్రాయ అంగీకారం తెలిపిందనీ, త్వరలో ఈ రెండూ అందుబాటులోకి వస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం సింగరేణి కార్మికులకు, నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయ లేదని విమర్శించారు. సింగరేణిలో బీసీ లైజినింగ్ ఆఫీసర్ పోస్టుకు అనుమతి ఇస్తున్నామనీ, అలాగే 1,352 ఉద్యో గాలకు నోటిఫికేషన్ విడుదల చేశామనీ, జీవో 76 ప్రకా రం నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 90 రోజుల్లో 30వేల ఉద్యోగాలకు నియామకపత్రాలు అందచేశామని గుర్తుచేశారు.

సీఏఏ నిబంధనల్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం : సీపీఐ(ఎం)

న్యూఢిల్లీ : పౌరసత్వ (సవరణ) చట్టం-సీఏఏ నిబంధనలను ప్రకటించడాన్ని సీపీఐ(ఎం) తీవ్రంగా వ్యతిరేకించింది. మతపరమైన గుర్తింపునకు పౌరసత్వాన్ని ముడిపెట్టడం ద్వారా రాజ్యాంగంలో పొందుపరిచిన పౌరసత్వ లౌకిక సూత్రాన్ని సీఏఏ ఉల్లంఘించిందని పేర్కొంది. ఈ మేరకు సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో ఒక ప్రకటన జారీ చేసింది. ఈ చట్టం కింద నోటిపై చేసిన నిబంధనలు పొరుగు దేశాల నుంచి వచ్చిన ముస్లింల పట్ల వివక్షపూరిత దృక్పథాన్ని అమలు చేస్తున్నాయని పొలిట్‌బ్యూరో విమర్శించింది. పైగా ఈ చట్టం అమలును కూడా జాతీయ పౌర పట్టిక ఏర్పాటుతో ముడిపెట్టడం చూస్తుంటే ముస్లిం పౌరులను లక్ష్యంగా చేసుకుంటారనే భయాందోళనలు తలెత్తుతున్నాయని పేర్కొంది. తమ రాష్ట్రాల్లో పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకునే వ్యక్తులను గుర్తించడం, వారు పేర్లను నమోదు చేసుకునే క్రమం నుండి రాష్ట్ర ప్రభుత్వాలను మినహాయించేలా ఈ నిబంధనలను రూపొందించారు. సీఏఏ ను తీవ్రంగా వ్యతిరేకించిన రాష్ట్ర ప్రభుత్వాలను మినహాయించేందుకే ఇదంతా జరిగిందని పొలిట్‌బ్యూరో పేర్కొంది. సీఏఏ ను ఆమోదించి నాలుగేండ్లకు పైగా గడిచిన తర్వాత, పైగా లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్‌కు కొద్ది రోజులు ముందుగా ఈ నిబంధనలను ప్రకటించడం చూస్తుంటే సీఏఏ అమలును విచ్ఛిన్నకర, ధ్రువీకరణ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవాలని బీజేపీ భావిస్తోందని స్పష్టమవుతోంది. సీఏఏ ను, దాని అమలును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు పొలిట్‌బ్యూరో పునరుద్ఘాటించింది. ఈ ప్రమాదకరమైన చట్టాన్ని రద్దు చేసేందుకు తమ ప్రయత్నాలు కొనసాగుతాయని ప్రకటించింది.



స్కూల్ యూనిఫారాల 'కుట్టు'పని స్వయం సహాయక సంఘాలకే : సర్కారు జీవో జారీ

నవతెలంగాణ-హైదరాబాద్

రాష్ట్రంలోని పాఠశాల విద్యార్థులు, ఇతరులకు ప్రభుత్వం సరఫరా చేసే యూనిఫారాల కుట్టుపని స్వయం సహాయక సంఘాలకు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈమేరకు మంగళవారం జీవో నెంబరు 14ను ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానీయా ఉత్తర్వులు ఇచ్చారు. మహిళల ఆధ్వర్యంలో నడిచే గ్రామీణ ప్రాంతాల్లో ఎస్‌హెచ్‌జీలకు, పట్టణాల్లో పట్టణ స్థానిక సంస్థలకు కుట్టుపని అప్పగించారు.రాష్ట్ర వ్యాప్తంగా 63,44,965 జతలు అవసర మవుతాయని ప్రభుత్వం అంచనా వేసింది. విద్యాశాఖతోపాటు రెసిడెన్సియల్, హాస్టల్ విద్యార్థులకు ఈ యూనిఫారాలను ప్రభుత్వం అందించ నుంది. సర్కారు నిర్ణయంతో ఏర్పాట్లు చేయాలని ఆయా జిల్లాల కలెక్టర్లు, జీహెచ్ఎంసీ అధికారులకు ప్రభుత్వం జీవో ద్వారా మార్గ దర్శకాలు ఇచ్చింది. బట్ట అందజేసిన 45 రోజుల్లో కుట్టు పనిపూర్తి యూని ఫారాలను సిద్ధం చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

యాదాద్రి అదనపు కలెక్టర్‌పై సస్పెన్షన్ ఎత్తివేత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

యాదాద్రి భువనగిరి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎ.భాస్కర్‌రావు సస్పెన్షన్‌ను ప్రభుత్వం ఎత్తివేసింది. ఈ మేరకు మంగళవారం రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఒకే పార్లమెంట్ పరిధిలో మూడేండ్ల సర్వీసు పూర్తయినా, కానట్లుగా ఎన్నికల సంఘానికి తప్పుడు సమాచారం ఇచ్చారనే ఆరోపణపై ఆయనను సస్పెండ్ చేశారు. ఫిబ్రవరి 26 నుంచి మార్చి 2 వరకు హైదరాబాద్‌లో ఎన్నికల శిక్షణలో ఉన్నట్టు సర్వీస్ రిజిస్టర్‌లో నమోదైంది. ఇందుకు సంబంధించి భాస్కర్ రావు ఇచ్చిన వివరణ సహేతుకంగా ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది.

పెద్దన్న పాత్రతోనే తంటా

విడిపోతున్న మిత్రపక్షాలు

- కొత్త పొత్తుల కోసం కమలదళం వెంపర్లాట
- బీజేడీ, టీడీపీతో చెలిమి
- 'వైనాట్ 400' కోసం శత్రువులే మిత్రులవుతున్న వైనం



లోక్‌సభ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటుకు సంబంధించి భాగస్వామ్య పక్షాలతో బీజేపీ జరుపుతున్న చర్చలు ఓ అడుగు ముందుకు... రెండు అడుగులు వెనక్కి అనే తరహాలో సాగుతున్నాయి. తాజాగా హర్యానాలో మిత్రపక్షమైన జన్‌నాయక్ జనతా పార్టీ (జేజేపీ)తో చర్చలు విఫలం కావడంతో ఖట్టర్ ప్రభుత్వం రాజీనామా చేయాల్సి వచ్చింది. స్వతంత్ర సభ్యుల మద్దతుతో ప్రస్తుతానికి బీజేపీ తన ప్రభుత్వాన్ని నిలబెట్టుకో గలిగింది. అధికార కూటమిలో పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నప్పటికీ బీజేపీ నేతలు ప్రతిపక్ష ఇండియా కూటమిని వేలెత్తి చూపుతున్నారు. ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల మధ్య లుకలుకలు తలెత్తాయని చెప్పుకుంటూ సంబరపడిపోతున్నారు.

న్యూఢిల్లీ : బీజేపీ కొత్త పొత్తుల కోసం వెంపర్లాడుతోంది. తాజాగా హర్యానాలో అధికార బీజేపీ, జేజేపీ సంకీర్ణ ప్రభుత్వంలో విభేదాలు తలెత్తడంతో మనోహర్ లాల్ ఖట్టర్ సర్కారు పతనమైంది. లోక్‌సభ ఎన్నికల్లో తనకు ప్రతిష్టాత్మక రోహతక్ సహా రెండు స్థానాలు కేటాయించాలని జేజేపీ కోరగా బీజేపీ అందుకు అంగీకరించలేదు. దీంతో కూటమి విచ్ఛిన్నమైంది. ఇలాంటి పరిస్థితులు మరెక్కడ ఏర్పడతాయోనన్న భయం పెద్దలను వెంటాడుతోంది. లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏకి 400 స్థానాలు లభిస్తాయని బీరాలు పలుకుతున్న ప్రధాని మోడీకి ఈ పరిణామం ఎదురు దెబ్బేనని చెప్పాలి.

విపక్షాలతో చేతులు కలిపి...

లక్ష్య సాధన కోసం ఇప్పటి వరకూ విపక్షాలుగా ఉన్న బిజూ జనతాదళ్ (ఒడిషా), తెలుగుదేశం (ఆంధ్రప్రదేశ్) పార్టీలకు కమలదళం స్నేహహస్తం అందించింది. ఒడిషాలో నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని బిజూ జనతాదళ్ పార్టీ ప్రభుత్వాన్ని బీజేపీ ఎప్పటి నుండో విమర్శిస్తూ వస్తోంది. ఆ రాష్ట్రంలో ఎలాగైనా ప్రతిపక్ష స్థానాన్ని సొంతం చేసుకోవాలని పావులు కదుపుతోంది. అయితే ఇప్పుడు పార్టీ రాష్ట్ర నేతల అభిప్రాయాలను బేఖాతరు చేస్తూ ఒడిషాలో ప్రధాన ప్రత్యర్థిగా ఉన్న బీజేడీతో చేతులు కలిపేందుకు మోడీ-షా ద్వయం ప్రయత్నిస్తోంది.

ఆంధ్రప్రదేశ్‌లో 2018లో తెలుగుదేశం పార్టీ బీజేపీతో తెగతెంపులు చేసుకుంది. అప్పటి నుండీ టీడీపీ అధినేత చంద్రబాబును విమర్శించే ఏ అవకాశాన్నీ బీజేపీ రాష్ట్ర నేతలు వదులుకోలేదు. ఆయనను అవినీతిపరుడని, నైతికత లేని వ్యక్తి అని, అవకాశవాది అని నిందించారు. అవినీతి ఆరోపణలపై చంద్రబాబును జగన్మోహన రెడ్డి ప్రభుత్వం అరెస్ట్ చేసినప్పుడు బీజేపీ సహకరించిందన్న ఊహాగానాలు కూడా వినవచ్చాయి. అయితే తాజాగా ఆ రాష్ట్రంలో సీను మారిపోయింది. జగన్మోహన రెడ్డిని వదిలేసి చంద్రబాబును భాగస్వామిగా బీజేపీ ఎంచుకుంది. లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో టీడీపీతో సీట్ల సర్దుబాటు కుదుర్చుకుంది.

అక్కున చేరిన నితీష్

బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌పై రెండు సంవత్సరాల పాటు తీవ్ర విమర్శలు గుప్పించిన బీజేపీ పెద్దలు ఇటీవలే ఆయనను అక్కున చేర్చుకున్నారు. ఇండియా కూటమి ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన నితీష్‌తో చేయి కలిపేందుకు ఏ మాత్రం వెనుకాడలేదు. నితీష్ నేతృత్వంలోని ఐక్య జనతాదళ్‌ను చీల్చి, ఆయన ప్రభుత్వాన్ని కూలదోసిన విషయాన్ని మరిచిపోయారు. బీహార్‌లో ఆటవిక రాజ్యం నడుస్తోందంటూ చేసిన ఆరోపణలనూ విస్మరించారు. ఏ మాత్రం రెండో ఆలోచన లేకుండా నితీష్‌ను ఎన్డీఏలో చేర్చుకుంది.

నాడు వదిలేసిన వారికే స్నేహహస్తం

నిజం చెప్పాలంటే ప్రతిపక్ష పార్టీల కంటే బీజేపీయే నూతన భాగస్వాముల ఎంపికలో ముందు నిలిచింది. అయితే వాటిని గౌరవించే విషయంలో మాత్రం దారుణంగా వ్యవహరించింది. 2017లో జరిగిన ఉత్తరప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన తర్వాత తన ఓబీసీ భాగస్వాములైన ఓం ప్రకాష్ రాజ్‌భర్, స్వామి ప్రసాద్ మౌర్యలను కరివేపాకులా తీసిపారేసింది. ఇప్పుడు మళ్లీ ఎన్నికలు వచ్చే సరికి రాజ్‌భర్‌తో మరోసారి చేయి కలిపింది. మౌర్యను ప్రసన్నం చేసుకునే ప్రయత్నం చేస్తోంది.

దూరమవుతున్న మిత్రపక్షాలు

ఎన్డీఏలో బీజేపీ పోషిస్తున్న పెద్దన్న పాత్ర కారణంగా మిత్రపక్షాలు ఒక్కొక్కటిగా ఆ పార్టీకి దూరమవుతున్నాయి. శివసేన, శిరోమణి అకాలీదళ్ (బాదల్), ఒకప్పుడు ఐక్య జనతాదళ్ ఈ కోవలోకే వస్తాయి. మిత్రులు దూరమవుతున్నప్పటికీ బీజేపీ తన నిరంకుశ పోకడలు విడనాడడం లేదు. పైగా వాటిని భయపెట్టేందుకు కేంద్ర దర్యాప్తు సంస్థలను ప్రయోగిస్తోంది. ఆయా పార్టీలను చీల్చే ప్రయత్నం చేస్తోంది. రాజకీయంగా సంక్షోభాలు ఏర్పడినప్పటికీ ధనబలం, మందబలంతో వాటిని ఎదుర్కోగలనని ధీమాగా ఉంది.

మోడీ నేతృత్వంలోని బీజేపీ కార్యకలాపాలలో సిద్ధాంతాలు, విలువలకు చోటే ఉండదు. చిన్న చిన్న పార్టీలే అయినప్పటికీ కీలక రాష్ట్రాల్లో ప్రముఖ పాత్ర పోషిస్తున్న పక్షాలను కమలదళం దువ్వుతుంటుంది. ఆ తర్వాత ఆయా పార్టీలతో బీజేపీ వ్యవహరించే తీరుకు హర్యానా ఉదంతమే తాజా ఉదాహరణ. మహారాష్ట్రలో సైతం బీజేపీ, మిత్రపక్షాల మధ్య సీట్ల సర్దుబాటుపై జరుగుతున్న చర్చలు ఓ కొలిక్కి రావడం లేదు. బీజేపీ 30-32 స్థానాలలో పోటీకి దిగుతోందని, షిండే వర్గానికి 11-12 సీట్లు, అజిత్ పవార్ వర్గానికి 4-5 సీట్లు ఇవ్వబోతోందని వార్తలు వస్తున్నాయి. ఆరు స్థానాలపై మాత్రం మూడు పార్టీల మధ్య అంగీకారం కుదరడం లేదు.

బీజేపీ తనకున్న వనరుల కారణంగా భాగస్వామ్య పక్షాలను సమకూర్చుకోగలుగుతోంది. అయితే వాటి స్వతంత్ర డిమాండ్ల విషయంలో అలసత్వాన్ని ప్రదర్శి స్తోంది. దీంతో కొన్ని రాష్ట్రాల్లో సంబంధాలు పుటుక్కు మని తెగిపోతున్నాయి. భాగస్వామ్య పక్షానికే వెన్నుపోటు పొడిచిన ఉదంతాలు బీజేపీ చరిత్రలో మనకు కన్పిస్తాయి.

ప్రమాదంలో రాజ్యాంగం

సంపాదకీయం

పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్నకొద్దీ ఓట్ల కోసం బీజేపీ నాయకులు తమ మతోన్మాద ఆటను తీవ్రతరం చేస్తున్నారు. హిందూ ఓటర్లను దగ్గర చేసుకునేందుకు వారి భాష మార్చారు. 'వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో 400 సీట్లిస్తే రాజ్యాంగాన్ని హిందువులకు అనుకూలంగా మార్చేస్తాం' అంటూ కర్నాటకకు చెందిన బీజేపీ ఎంపీ, కేంద్ర మాజీ మంత్రి అనంత్‌కుమార్ హెగ్డే సంచలన వ్యాఖ్యలే దీనికి తాజా ఉదాహరణ. గతంలో ఈయనగారే ఒకానొక సందర్భంలో 'రాజ్యాంగ పీఠిక నుంచి 'లౌకిక' అనే పదాన్ని తొలగిస్తాం' అని కూడా అన్నాడు. అంటే దేశంలోని అణగారిన మతాలు, కులాలు, ప్రజలకు భద్రతను, సమాన హక్కులను ప్రసాదిస్తున్న భారత రాజ్యాంగమంటే బీజేపీకి ఎంతటి కసి ఉందో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు.

> ఏనాటికైనా తనకు అక్కరకొస్తుందనే మొదటి నుండి ఒకే దేశం, ఒకే ఎన్నిక, ఒకే పన్ను అంటూ ఇలా అన్నింటా ఒకే.. ఒకే అనే పాట మొదలుపెట్టాడు. ఇప్పుడు రాజ్యాంగాన్నే హిందువులకు అనుకూలంగా మార్చేస్తానంటూ తన మనసులోని మాట బయటపెట్టించాడు. భిన్నత్వంలో ఏకత్వంగా విలసిల్లుతున్న మన విశాలమైన భారతావనిని ఒక మతదేశంగా మార్చడం సరైనదా? ఇప్పుడు ప్రతి పౌరుడూ వేసుకోవాల్సిన ప్రశ్నిది. మోడీ అనుకున్నట్టు ఆయన అధికారం పదిలంగా ఉండాలంటే భారతదేశం హిందూ దేశంగా అవతరించడం అత్యవసరం. దీనికి అడ్డుగా ఉన్నది రాజ్యాంగం.

వాస్తవానికి భారత రాజ్యాంగాన్ని తిరగ రాయాలనేది బీజేపీ మాతృసంస్థ అయిన ఆర్ఎస్ఎస్‌కు దశాబ్దాల నాటి కల. గోల్వాల్కర్ అసలు రాజ్యాంగం అమల్లోకి రావడాన్నే ఆనాడు జీర్ణించుకోలేక పోయాడు. అందుకే రాజ్యాంగాన్ని తిరగ రాయాల్సిందే అంటూ ఆయన శిష్య బృందం అవకాశం చిక్కినప్పుడల్లా ప్రస్తావిస్తూనే ఉంది. అంటే ఆర్ఎస్ఎస్ మతోన్మాద విధానాల్లో భాగమే భారత రాజ్యాంగ మార్పు. ఆ కలను నిజం చేసుకునేందుకు నేడు అధికారంలో ఉన్న బీజేపీ తన రోడ్ మ్యాప్ రూపొందించుకుంటోంది. ఇటు స్వామికార్యం, అటు స్వకార్యం పూర్తవుతుందని మోడీ ఆరాటం. అందుకే ముస్లింలు, క్రైస్తవులు ఈ దేశంలో ఉండాలంటే హిందువులుగానైనా మారాలి, లేదంటే ద్వితియ శ్రేణి పౌరులుగా ఉండిపోవాలని బీజేపీ నాయకులతో అప్పుడప్పుడు హెచ్చరికలు జారీ చేయిస్తున్నాడు.

ఎన్నికలప్పుడు ఓట్లు రాల్చుకోడానికి మోడీకి ఒక ఆయుధం కావాలి. 2014లో గుజరాత్ నమోనాను చూపించి అభివృద్ధికి తానే ప్రత్యామ్నాయం అన్నాడు. అలాగే రెండు కోట్ల ఉద్యోగాలు, రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానంటూ తన మాటల గారడీతో అధికారం చేజిక్కించు కున్నాడు. కానీ ఏడాదిలోనే గుజరాత్ అభివృద్ధి ఏంటో



బట్టబయలైంది. రెండు కోట్లు కాదు కదా ఉన్న ఉద్యోగాలు కూడా ఊడి పోయి దేశ ప్రజలు నిత్యావసరాలు కూడా తీర్చుకోలేని స్థితిలో ఉన్నారనేది నేటి పచ్చినిజం. దేశ ఆర్థిక పరిస్థితి అత్యంత దారుణంగా దిగజారిపోతుందని అధికారిక లెక్కలే చెబుతున్నాయి. ఇక తమ ఆదాయం రెట్టింపు అవుతుందనుకున్న రైతులు నేటికీ రోడ్డెక్కి నిరసనలు తెలుపుతూనే ఉన్నారు. అంటే వారి ఆదాయం ఎంతగా అభివృద్ధి చెందిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనే లేదు. ఇక 2019లో పూల్వామా ఘటన అడ్డుపెట్టుకొని సర్జికల్ స్ట్రైక్ చేశానంటూ గొప్పలు చెప్పుకుంటూ అందలమెక్కాడు. దీనిబట్టి మోడీకి తన కుర్చీ కాపాడుకోవడం తప్ప ప్రజల సమస్యలు పట్టవనేది మళ్లీ మళ్లీ రుజువవుతూనే ఉంది.

ఇక ఓట్లడిగేందుకు ఆయన వద్ద ఉన్న అన్ని అస్త్రాలు అరిగిపోయాయి. ఏ దిక్కూ లేనోడికి దేవుడే దిక్కు అన్నట్టు ఇప్పుడు 2024 ఎన్నికల కోసం రామ జన్మభూమి, కాశీ విశ్వనాథుని చుట్టూ తిరుగుతున్నాడు. దేశ ప్రధాని ఓ మత ప్రచారకుడిగా మారి ఇంటింటికి అక్షింతలు పంపించారు. మైనార్టీలను పక్కన పెట్టి 80శాతానికి పైగా ఉన్న హిందువులను తనవైపుకు తిప్పుకుంటే ఈసారి తన పబ్బం గడిచిపోతుందని మోడీకి, గోడీ మీడియాకు బాగా తెలుసు. ఎప్పుడు ఏం చేయాలో కూడా తెలుసు. అందుకే ప్రతిపక్షాలు గగ్గోలు పెట్టినా, ఎంత మంది నిరసనలు తెలిపినా నిన్నటికి నిన్న సీఏఏను మొండిగా అమలు చేయడం కూడా ఇందులో భాగమే. దేశంలో మత విద్వేషాలు రెచ్చగొట్టి మళ్లీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా పెట్టుకున్నాడు.

అలాగే ఏనాటికైనా తనకు అక్కరకొస్తుందనే మొదటి నుండి ఒకే దేశం, ఒకే ఎన్నిక, ఒకే పన్ను అంటూ ఇలా అన్నింటా ఒకే.. ఒకే అనే పాట మొదలుపెట్టాడు. ఇప్పుడు రాజ్యాంగాన్నే హిందువులకు అనుకూలంగా మార్చేస్తానంటూ తన మనసులోని మాట బయట పెట్టించాడు. భిన్నత్వంలో ఏకత్వంగా విలసిల్లుతున్న మన విశాలమైన భారతావనిని ఒక మతదేశంగా మార్చడం సరైనదా? ఇప్పుడు ప్రతి పౌరుడూ వేసుకోవాల్సిన ప్రశ్నిది. మోడీ అనుకున్నట్టు ఆయన అధికారం పదిలంగా ఉండాలంటే భారతదేశం హిందూ దేశంగా అవతరించడం అత్యవసరం. దీనికి అడ్డుగా ఉన్నది రాజ్యాంగం. అందుకే బీజేపీ నాయకులు సందు దొరికినప్పుడల్లా రాజ్యాంగాన్ని మార్చేస్తామంటున్నారు.

రాజ్యాంగం అంటే నూట ముప్పై కోట్ల మంది ప్రజలు స్వేచ్ఛగా బతికేందుకు రూపొందించుకున్న హక్కు పత్రం. భిన్న జాతులు, మతాలు, కులాలు, ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు, సంస్కృతులు, ఆహారపు అలవాట్లు కలగలిపిన మహోన్నత దేశం మనది.

కనుకనే సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా నిర్మించుకున్నాం. అలాంటి రాజ్యాంగాన్ని మార్చేస్తామంటే ప్రజలు చూస్తూ ఊరుకోరు. హిందువు లను తన ఓటు బ్యాంకుగా మార్చుకునేందుకు మోడీ పన్నుతున్న ఈ పన్నాగాలతో దేశం ప్రమాదంలో పడటం ఖాయం. వీటన్నింటినీ అర్థం చేసుకుని ప్రజలు అప్రమత్తగా ఉండాల్సిన సమయమిది.



చావుపైన ఒక చావుదెబ్బ

అజ్ఞానంలో కాదు
జ్ఞానాహంలోనే,
విజ్ఞాన కాంతి వేగం శూన్య
సమానమనీ
అసంపూర్ణతల అంగీకారమే
సంపూర్ణ మూర్తిమత్వ
మూలసూత్రమనీ
విశ్వమంతటికి వినిపించేలా....
నినదించిన మూగస్వరం
వినూత్న పరిశోధక విశాల హృదయం
వ్యక్తిత్వ వికాస పుస్తకమస్తిష్కం
సమాజ హితమే సమస్త శాస్త్ర
సమ్మతమన్న
సామూహికశక్తి సమ్మిళిత స్వరూపం
సకల జీవుల సౌఖ్యం కోరిన
సానుకూల జీవన పయనం
సకల శాస్త్ర గ్రహాలకు
మానవుడే కేంద్ర బిందువన్న
మనిషితనం
భూగ్రహం బూడిదగాక ముందరే
గ్రహాంతరవాసం వెళ్లిన మేధోగ్రహకం
రోగపు రోదనలో
తడిసి నిలిచిన ఆశల సౌధం
మృత్యువు కౌగిలిలోనూ,
మురిసిన బతుకు చిద్విలాసం
భౌతికంగా దూరమనే భావాన్ని
భౌతిక శాస్త్రమై గెలిచిన
మృత్యుంజయం
సమస్యల పిట్టగోడల మీదినుండి
చావు సముద్రంలోకి దూకే వాళ్లకి
ఆవలి తీరమున కనిపించే ఆశాదీపం
సమస్యకు, చావుకు మధ్య
కాలం కాంక్రీట్‌తో
అనుభూతుల అనుసంధానం
స్టీఫెన్ హాకింగ్-
చావుపైన ఒక చావుదెబ్బ
బతుకు ఫలంలోని బతుకుతీపి
కలమై కాలంతో కలకాలం
కలబడే, తలపడే, నిలబడే
కలల సాకారం.

- డాక్టర్ చందా అప్పారావు,
9951017565

చిలీలో మరోసారి కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారం!

ప్రజాస్వామ్యాన్ని, ప్రజాభిప్రాయాన్ని ఏడు నిలువుల లోతున పాతిపెట్టిన చిలీ నియంత పినోచెట్ చచ్చి పద్దెనిమిదేండ్లు అవుతున్నా వాడి వారసులు వచ్చే ఏడాది జరగనున్న ఎన్నికల పూర్వరంగంలో మరోసారి కమ్యూనిస్టుల మీద విరుచుకుపడుతున్నారు. చిలీలో ఆశ్రయం పొందిన వెనెజులా సోషలిస్టు వ్యతిరేక మిలిటరీ అధికారి ఒకడు ఇటీవల హతుడయ్యాడు. కమ్యూనిస్టులే చంపారంటూ చిలీ మీడియా, పినోచెట్ వారసులైన ప్రతిపక్ష పార్టీ కూటమి తప్పుడు ప్రచారం ప్రారంభించింది. కమ్యూనిస్టుల విశ్వసనీయత ప్రశ్నించరానిదని చిలీ అధ్యక్షుడు గాబ్రియెల్ బోరిక్ బహిరంగంగా సమర్థించాడు. వామపక్ష సంఘటన ప్రభుత్వంలో కమ్యూనిస్టు పార్టీ ఒక ప్రధాన భాగస్వామిగా ఉంది. పార్లమెంటులోని 155 స్థానాలకుగాను అధికార కూటమికి 37, దానికి మద్దతు ఇస్తున్న కూటమికి మరో 37 ఉన్నాయి. వాటిలో సోషలిస్టులకు 13, కమ్యూనిస్టు పార్టీ 12సీట్లతో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో ఉన్నాయి. లాటిన్ అమెరికాలో ఉన్న సామాజిక, రాజకీయ పరిస్థితుల్లో మితవాద శక్తుల ప్రధాన ఆయుధం కమ్యూనిస్టు వ్యతిరేకతను రెచ్చగొట్టటం ఒకటన్నది తెలిసిందే. అనేక దేశాల్లో నిరంకుశ, మితవాద శక్తులకు ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. సోషలిస్టులు, కమ్యూనిస్టులు అధికారానికి వస్తే క్రైస్తవమతానికి, ధనికుల ఉనికి ప్రశ్నార్థకం అవుతుందనే ప్రచారం ఎప్పటి నుంచో చేస్తున్నారు. నాజీ గోబెల్స్‌ను మించి అవాస్తవాలను ప్రచారంలో పెడుతున్నారు.



ఎం. కోటేశ్వరరావు
83331013288

2017లో వెనెజులా నుంచి పారిపోయి వచ్చి చిలీలో ఆశ్రయం పొందిన మిలిటరీ మాజీ అధికారి రోలాండ్ జెడాను కొద్ది రోజుల క్రితం కొందరు అపహరించి హత్యచేశారు. దీని వెనుక కమ్యూనిస్టులు ఉన్నారని, దేశంలో హింసాకాండ సృష్టికి కుట్రలు పన్నుతున్నారంటూ అనేక పత్రికలు, ప్రతిపక్ష మితవాద పక్షాలు ఎలాంటి ఆధారం లేకుండా ధ్వజమెత్తుతున్నాయి. జనంలో అనుమానాలు కలిగించే రీతిలో కథనాలు అల్లుతున్నాయి. ఈ శక్తులన్నీ నియంత పినోచెట్ హయాంలో కమ్యూనిస్టులు, సోషలిస్టులు, ఇతర ప్రజాస్వామికవాదుల అణచివేత, అపహరణలను సమర్థించినవే. మార్క్సిస్టు కాన్సర్‌ను అంతమొందించాలనే పేరుతో పినోచెట్ మిలిటరీ పాలకులు వేలాది మంది కమ్యూనిస్టులు, అభ్యుదయవాదులను హతమార్చారు, అనేక మంది జాడలేకుండా చేశారు. చిత్రహింసలు, జైళ్లపాలు సరేసరి. 1983లో కేవలం రెండు నెలల వ్యవధిలోనే 20 మంది కమ్యూనిస్టు నేతలను హత్యచేశారు. తరువాత ముగ్గురు నేతల నాలుకలను చీల్చి చిత్రహింసలకు గురిచేశారు. పినోచెట్ పాలనలో నాలుగువేల మంది అపహరణలకు గురయ్యారు. కనీసం ఇరవై వేల మంది పిల్లలను అపహరించి విదేశాల్లో చట్టవిరుద్ధ దత్తతకు సహకరించారనే విమర్శలున్నాయి. వాటి గురించి దర్యాప్తు జరపాలని, నిజాల నిగ్గుతేల్చాలని కమ్యూనిస్టులు కోరుతున్నారు.

చిలీలో నియంతృత్వం ఉన్నకాలంలో కమ్యూనిస్టు పార్టీ అజ్ఞాతవాసంలోకి వెళ్లింది. ప్రజల తరఫున పోరాడేందుకు సాయుధ దళాలను ఏర్పాటు చేసింది. నియంతల పాలన అంతరించిన తరువాత కమ్యూనిస్టులు తిరిగి బహిరంగంగా పనిచేయటం ప్రారంభించారు. ప్రస్తుతం 46,023 మంది సభ్యులతో దేశంలో అతిపెద్ద పార్టీగా ఉంది. గత ఎన్నికల్లో కమ్యూనిస్టు అభ్యర్థి బరిలో ఉంటారని అందరూ భావించారు. అయితే వామపక్ష కూటమిలోని పార్టీల అభిప్రాయం మేరకు గాబ్రియెల్ బోరిక్ పోటీ చేసి 2021 ఎన్నికల్లో గెలిచారు. హతుడైన వెనెజులా మాజీ మిలిటరీ అధికారికి వెనెజులాలో అనేక మందిని హతమార్చిన చరిత్ర ఉంది. హత్యవెనుక వెనెజులా హస్తం ఉందని, దేశ అధ్యక్షుడు నికోలస్ మదురోను ఖండించటంలో గొంతుకలపాలని చిలీ మితవాద పార్టీలు చేసిన డిమాండ్‌ను కమ్యూనిస్టు పార్టీ తిరస్కరించింది. కమ్యూనిస్టుల మీద విషం చిమ్మటానికి ఇదొక కారణమని చిలీ మంత్రి, కమ్యూనిస్టు నేత గామిలా వలేజో చెప్పారు. పార్లమెంటులో ఉన్న బలంతో గాబ్రియెల్ బోరిక్ ప్రభుత్వానికి అనేక ఆటంకాలు కలిగిస్తున్న ప్రతిపక్షాలు కమ్యూనిస్టు పార్టీ మీద విషం చిమ్మటంలో ఆశ్చర్యం ఏముందని కమ్యూనిస్టు పార్టీ ఎంపీ, విద్యార్థి సంఘమాజీ నాయకురాలు కరోల్ కారియోలా చెప్పారు. భాగస్వామ్య పక్షాల అవగాహన మేరకు పార్లమెంటు సభాధ్యక్ష స్థానాన్ని కమ్యూనిస్టులు చేపట్టనున్న పూర్వరంగంలో పార్టీ మీద దాడికి దిగినట్లు చెప్పారు.

అంతరంగంలో గూడు కట్టుకున్న కమ్యూనిస్టు వ్యతిరేకతను ప్రతిపక్షాలు వెల్లడిస్తున్నాయి. ఎలాంటి ఆధారాలు, సాక్ష్యాలు లేకుండా వ్యక్తులు, సంస్థలు ఎవరిమీదనైనా భయంకరమైన ఆరోపణలు చేయగల సమర్థత కలిగినవి.వాటి పర్యవసానాలు వాటికి పట్టదు. ఊహాజనితమైన ఆరోపణలు చేస్తున్నాయి. చరిత్రలో చిలీ కమ్యూనిస్టు పార్టీ ప్రజాస్వామిక నిబద్ధతను ఎవరూ సందేహిం చాల్సిన అవసరం లేదు. అది ప్రారంభమైనప్పటి నుంచి అందరికీ తెలుసు. ప్రజాస్వామిక పోరాటాల్లో తమదైన ముద్రను వారు ఎప్పుడూ ప్రదర్శిస్తూనే ఉన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణను వారెన్నడూ వీడలేదు. ఆ క్రమంలో నిరంతరం భాగస్వాములుగానే ఉన్నారు. వ్యవస్థా పరమైన చట్రానికి అనుగు ణంగా వారు సర్దుబాటు చేసుకొని నడుచుకుం టున్నారు. అందువల్లనే కమ్యూనిస్టుల మీద జరుపుతున్నదాడిని కాకమ్మ కథలుగా చూస్తున్నాను అని చిలీ అధ్యక్షుడు గాబ్రియెల్ బోరిక్ చెప్పాడు. కమ్యూనిస్టులు న్యాయం, సమానత్వం, హక్కులకు అంకితమయ్యారు. కార్మికుల హక్కులను కాపాడేందుకు, ఆదర్శ సమాజాన్ని ఏర్పాటు చేసేందుకు దేశంలో ఒక ప్రజాస్వామిక వ్యవస్థ ఉండాలని కోరుకుంటున్నారు. అన్ని రకాల వివక్ష, అణచివేతను నిర్మూలించాలన్నదే తమ లక్ష్యమని కూడా చెప్పారు.జనం, సమాజ కేంద్రంగా ఉండాలని, జీవితాలు మెరుగుపడాలని మేం కోరుతుండగా నయా ఉదారవాదం ప్రజలు, వారి హక్కుల కంటే పెట్టుబడికి పెద్ద పీటవేస్తున్నదని బోరిక్ చెప్పాడు. ప్రభుత్వ ఏర్పాటు ఒప్పందంలో భాగంగా ప్రజాప్రతినిధుల సభ అధ్యక్ష పదవిని కమ్యూనిస్టులకు అప్పగించాల్సి ఉంది. దానికి అనుగుణంగా నిర్ణయించా మని, గౌరవిస్తామని అన్నాడు. ఆ పదవిలో ఎవరు అన్నది సమస్యే కాదు, పార్లమెంటులోని సహచరులందరూ సమర్థులే, వ్యక్తులు దొరుకుతారా లేదా అన్నది కాదు, సమిష్టి నిర్ణయాలు ఉంటాయి గనుక ఎవరున్నా ఇబ్బంది ఉండదన్నాడు.

> చరిత్రలో చిలీ కమ్యూనిస్టు పార్టీ ప్రజాస్వామిక నిబద్ధతను ఎవరూ సందేహించాల్సిన అవసరం లేదు. అది ప్రారంభమైనప్పటి నుంచి అందరికీ తెలుసు. ప్రజాస్వామిక పోరాటాల్లో తమదైన ముద్రను వారు ఎప్పుడూ ప్రదర్శిస్తూనే ఉన్నారు.ప్రజాస్వామ్య పరిరక్షణను వారెన్నడూ వీడలేదు. ఆ క్రమంలో నిరంతరం భాగస్వాములుగానే ఉన్నారు. వ్యవస్థాపరమైన చట్రానికి అనుగుణంగా వారు సర్దుబాటు చేసుకొని నడుచుకుంటున్నారు.అందువల్లనే కమ్యూనిస్టుల మీద జరుపుతున్నదాడిని కాకమ్మ కథలుగా చూస్తున్నాను అని చిలీ అధ్యక్షుడు గాబ్రియెల్ బోరిక్ చెప్పాడు. కమ్యూనిస్టులు న్యాయం, సమానత్వం, హక్కులకు అంకితమయ్యారు. కార్మికుల హక్కులను కాపాడేందుకు, ఆదర్శసమాజాన్ని ఏర్పాటు చేసేందుకు దేశంలో ఒక ప్రజాస్వామిక వ్యవస్థ ఉండాలని కోరుకుంటున్నారు.

ప్రభుత్వం తలపెట్టిన సంస్కరణలకు సామాజిక ఉద్యమాల ద్వారా మద్దతు కూడగట్టాలని కమ్యూనిస్టు పార్టీ పిలుపు ఇవ్వటం పార్లమెంటులోని మితవాద శక్తులకు కంటగింపుగా మారింది. చిలీ పార్లమెంటులో ఇప్పుడున్న బలాబలాల ప్రకారం అధికారంలో ఉన్న కూటమి ప్రతిపాదించే విధానాలు ఓటింగ్‌లో వీగిపోయే అవకాశం ఉంది. చట్టాలు, విధానాలను రూపొందించాల్సిన బాధ్యత చట్టసభలది తప్ప సామాజిక మద్దతు పేరుతో ఒత్తిడి తేవటం ఏమిటని మితవాదశక్తులు, వాటికి మద్దతుగా ఉన్న మీడియా,వాదిస్తున్నాయి. అందులో తప్పేం ఉందని అధ్యక్షుడు బోరిక్ ప్రశ్నించాడు. ఆ ఉద్యమాలు ప్రజా ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించినట్లయితే ఆహ్వానించాల్సిందే అన్నాడు. అబార్షన్ మీద చేసిన చట్టం వెనుక మహిళా ఉద్యమాల సమీకరణ లేదా అని ప్రశ్నించాడు. విద్యార్థి ఉద్యమం ఉచిత విద్య కోసం పోరాడిందని, నూతన రాజ్యాంగం సామాజిక ఉద్యమాలను ప్రోత్సహిస్తున్నదని, ప్రజాస్వామిక పద్ధతుల్లో సామాజిక చర్చ జరగాలన్నాడు. వామపక్ష శక్తులు అధికారానికి వచ్చిన తరువాత ప్రతిపాదించిన ప్రజానుకూల సంస్కరణలను ముందుకు తీసుకువెళ్లలేని వాస్తవ పరిస్థితి పార్లమెంటులో ఉంది. దానిలో భాగంగానే ధనికుల నుంచి పన్ను వసూళ్లను పెంచే ప్రతి పాదన పార్లమెంటు ముందుంచగా ప్రతిపక్షాలు అడ్డుకున్నాయి. కార్పొరేట్, ధనికులకు మద్దతుగా నిలిచాయి. పెన్షన్ల పెంపు, పెన్షన్ హామీ, సంరక్షణ వంటి పథకాలకు అవసరమైన నిధులను సేకరించేందుకు కలిగిన వారి మీద పన్ను పెంచాలని వామపక్ష ప్రభుత్వం ప్రతిపాదించింది. దాన్ని అడ్డుకోవటం అంటే పౌరుల సామాజిక హక్కుల మీద దాడి చేయటమే. అందుకే అలాంటి పార్టీల మీద ఒత్తిడి తేవాలంటే పార్లమెంటుతో పాటు వెలుపల ప్రజా ఉద్యమాలను నడపాలని కమ్యూనిస్టు పార్టీ కోరింది. దీని మీద ఆగ్రహిస్తున్న మీడియా వెనెజులా మిలిటరీ మాజీ అధికారి హత్యను సాకుగా తీసుకొని కమ్యూనిస్టుల మీద తప్పుడు ఆరోపణలతో దాడికి దిగింది.




గతంలో ఎన్నడూ లేనంత భయం, విపరీత కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచార నేపథ్యంలో 2021 డిసెంబరు 19న జరిగిన చిలీ మలివిడత అధ్యక్ష ఎన్నికలలో వామపక్ష కూటమి అభ్యర్థి గాబ్రియెల్ బోరిక్ ఘనవిజయం సాధించాడు. నవంబరు 21న జరిగిన ఎన్నికలలో క్రిస్టియన్ సోషల్ ఫ్రంట్ అభ్యర్థి జోస్ ఆంటోనియో కాస్ట్ 27.92 శాతం ఓట్లతో ప్రథమ స్థానంలో ఉండగా బోరిక్ 25.82శాతం ఓట్లు తెచ్చుకున్నాడు. డిసెంబరు 19న తుది పోటీ జరిగింది. బోరిక్ 55.87శాతం, కాస్ట్ 44.13శాతం ఓట్లు తెచ్చుకున్నాడు. నయా ఉదారవాద తొలి ప్రయోగశాల లాటిన్ అమెరికా కాగా, దానిలో చిలీకి ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. అందుకే అక్కడి యువత 'నయా ఉదార వాదం పుట్టింది ఇక్కడే దానికి గోరీ కట్టేది ఇక్కడే' అనే నినాదంతో ఉద్యమించింది, దానికి బోరిక్ రూపంలో విజయం లభించింది. పదేండ్ల క్రితం విద్యార్థి ఉద్యమం ముందుకు తెచ్చిన నేతలలో బోరిక్ ఒకడు, 2014 నుంచి పార్లమెంటు సభ్యుడిగా ఉన్నాడు.

1973లో సోషలిస్టు పార్టీ నేత (మార్క్సిజం-లెనినిజానికి కట్టుబడిన) సాల్వెడార్ అలెండీ ప్రభుత్వంపై జరిగిన కుట్రలో భాగంగా మిలిటరీ, పోలీసు తిరుగుబాటు చేసింది. దాన్ని ప్రతిఘటించేందుకు ఆయుధం పట్టిన అలెండీని కుట్రదారులు కాల్చి చంపారు. అయితే ప్రాణాలతో మిలిటరీకి పట్టుబడటం ఇష్టం లేక ఆత్మహత్య చేసుకున్నట్లు 2011లో కోర్టు ప్రకటించింది. ఈ కథను ఎవరూ నమ్మకపోయినా తాము విశ్వసిస్తున్నట్లు కుటుంబ సభ్యులు చెప్పటంతో ఆ కేసు విచారణ ముగించారు. అలెండీ మీద తిరుగుబాటు చేసిన జనరల్ పినోచెట్ తరువాత పగ్గాలు చేపట్టి నయా ఉదారవాద విధానాలను జనం మీద రుద్దాడు.1973 నుంచి 1990వరకు నియంతగా పాలించాడు. తరువాత పౌరపాలన పునరుద్ధరణ జరిగింది. మధ్యలో రెండు సార్లు గతంలో అలెండీ నాయకత్వం వహించిన సోషలిస్టు పార్టీకి చెందిన మిచెల్లీ బాచలెట్ అధికారానికి వచ్చినప్పటికి మిగతావారి మాదిరే మొత్తం మీద నయా ఉదారవాద విధానాలనే కొనసాగించారు. సాధారణంగా తొలిదఫా ఎన్నికల్లో సంపూర్ణ మెజారిటీ రాకున్నప్పటికీ ఎక్కువ ఓట్లు తెచ్చుకున్న పార్టీ అంతిమ పోటీలో గెలుస్తుంది. చిలీలో దానికి భిన్నంగా రెండవ స్థానంలో వచ్చిన బోరిక్ ఘనవిజయం సాధించాడు. మితవాద శక్తులన్నీ ఒకవైపు, వారిని ప్రతిఘటించే పురోగామి, ఉదారవాదులందరూ మరోవైపు సమీకరణయ్యారు. ఈ క్రమంలో బోరిక్‌ను ఎన్నుకుంటే కమ్యూనిస్టు ప్రమాదం వస్తుందని, దేశం మరొక వెనెజులాగా మారిపోతుందనే ప్రచారం పెద్ద ఎత్తున చేశారు. సామాజిక, మతపరమైన అంశాలను కూడా ముందుకు తెచ్చారు. భయం మీద ఆశ విజయం సాధించిందని, ఒక పద్ధతి ప్రకారం కమ్యూనిస్టు వ్యతిరేక విష ప్రయోగాన్ని కూడా జనం అధిగమించారని బోరిక్ తన విజయ సందేశంలో చెప్పాడు. పార్లమెంటు దిగువ సభ డిప్యూటీల ఛాంబర్‌లో దామాషా ప్రాతిపదికన 155 స్థానాలకు గాను వామపక్ష కూటమి పార్టీలకు వచ్చింది 37 మాత్రమే. ఎగువ సభలోని 50 స్థానాలకు గాను వామపక్షాలకు ఐదు, స్వతంత్రులు ఇద్దరు, మిగిలిన 43మితవాద పార్టీలకే వచ్చాయి. వామపక్షాలలో ప్రధాన పార్టీగా ఉన్న కమ్యూనిస్టులు గతంలో ఉన్న ఎనిమిదింటిని 12కు పెంచుకున్నారు, ఎగువ సభలో కొత్తగా రెండు స్థానాలను గెలుచుకున్నారు. నూతన రాజ్యాంగ ప్రతిపాదనపై 2022లో జరిగిన ఓటింగ్ తిరస్కరణకు గురైంది. దాన్ని వామపక్ష వాదులు ప్రతిపాదించినట్లు ప్రచారం చేశారు. తరువాత 2023 డిసెంబరులో రెండవ రాజ్యాంగం గురించి జరిగిన ఓటింగ్‌లో మరోసారి తిరస్కరణకు గురైంది. దానిలో మితవాద ముద్ర ఉండటంతో వామపక్ష శక్తులు వ్యతిరేకించాయి. వచ్చే ఏడాది జరగనున్న ఎన్నికలు, నూతన రాజ్యాంగం వంటి అంశాలలో మితవాద శక్తులు ఇప్పటి నుంచే వామపక్షాలను దెబ్బతీసేందుకు పూనుకున్నాయి. దానిలో భాగంగానే పెద్ద పార్టీగా ఉన్న కమ్యూనిస్టులపై తప్పుడు ప్రచారం ప్రారంభించినట్లు కనిపిస్తోంది. వాటిని వామపక్షాలు ఎలా ఎదుర్కొంటాయన్నది ఆసక్తిగా మారింది. ■

లింగవివక్ష - పురుషుల్లో చైతన్యం

ఐద్వా నాయకురాలు వాసుకి రాసిన "మహిళల చైతన్యం గురించి చర్చించుకుందాం" అన్న చిన్న పుస్తకం ఇప్పుడు ఇంగ్లీషులో వచ్చింది. కానీ దీనికో ప్రత్యేకత ఉన్నది. రచయిత్రి తమిళనాడు నాయకురాలు. రాసింది తమిళంలో. చిత్తూరు జిల్లాకు చెందిన ప్రభుత్వోపాధ్యాయుడు యతిరాజులు తెలుగులోకి అనువదించారు. దీనిని ఆంగ్లానువాదం చేసినవారు ఉష. హైదరాబాద్‌లో ఉన్న ఇద్దరు మహిళలు జనీలా, రమాదేవి పూనుకుని ఆంగ్లానువాదం చేయించారు. రైతు ఉద్యమ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి ఆవిష్కరించారు. వీటివరకు పెద్దగా ప్రత్యేకత ఉన్నట్టు అనిపించదు. కానీ చెట్టుమీద కాయ, సముద్రంలో ఉప్పు కలిసి రుచికరంగా మారినట్టుగానే తమిళ పుస్తకం, ఆంగ్లంలో హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ప్రభుత్వ ముద్రణాలయంలో కార్మిక నాయకుడుగా పనిచేసిన పి వెంకటేశ్వరరావు గారి 90వ జన్మదిన సందర్భంగా జరగడమే ప్రత్యేకత.



ఎస్. వీరయ్య

మహిళల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంతో పోరాటానికి పెద్దగా అభ్యంతరాలు ఉండవు. భూస్వామ్య సమాజపు లక్షణాలు, వాటి భావజాలం మీద, సంప్రదాయాల పేరుతో అమలు జరిగే వివక్ష మీద పోరాటానికి కూడా కొంచెం కష్టపడితే కలిసొచ్చేవారు బాగానే ఉంటారు. కానీ తన ఇంట్లోనే పురుషాధిక్యత మీద పోరాటం అంత సులభం కాదు. దీనికి మద్దతు, సహకారం లభించటం కూడా అంత సులభం కాదు. అందుకే, ఈ పుస్తకం ఆంగ్లానువాదానికీ, హైదరాబాద్‌లో ఆవిష్కరణకు ప్రాధాన్యత ఏర్పడింది. సరిగ్గా అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున గ్యాసు సిలిండర్ ధర వందరూపాయలు తగ్గిస్తూ ప్రధాని మోడీ ప్రకటించారు. మహిళలకు ఇది ప్రత్యేక కానుక అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవానికీ, గ్యాస్ సిలిండర్ ధర తగ్గింపుకు సంబంధం ఏమిటి? మహిళలకే ఇది కానుక ఎట్లా అయ్యింది? ఆ సిలిండర్ల గ్యాసుతో చేసిన వంటలు మహిళలు మాత్రమే తింటారా? అందరూ తింటారని మనకు తెలుసు. 'మహిళలకు కానుక' అంటే మహిళలను వంట ఇంటికి పరిమితం చేసే ఆలోచనే కదా! అంతర్జాతీయ మహిళా దినోత్సవ స్ఫూర్తికి కూడా ఇది వ్యతిరేకం. కానీ కేంద్రంలో బీజేపీ సర్కారు, మోడీ నాయకత్వం చేయదల్చుకున్నదే చేస్తారు కదా! మనుస్మృతి ప్రకారం మహిళ వంటింటికే పరిమితం కావాలి. అందుకే ప్రధాని మోడీ ప్రకటన కూడా ఆ దిశలోనే ఉన్నది. 'నస్త్రీ స్వాతంత్ర్యమర్హతి' (స్త్రీకి స్వాతంత్ర్యం అనుభవించే అర్హత లేదు) అని చెప్పేది మనుస్మృతి. భూస్వామ్య వ్యవస్థే అన్నీ నిర్ణయించిన కాలంలో, రాచరిక వ్యవస్థలో ఈ విధానం బలపడింది. భావజాలం విస్తరించింది. తిట్లు కూడా మహిళలను, కొన్ని సామాజిక తరగతులను కించపరిచే విధంగా ఏర్పడ్డాయి. 'ఛండాలం', 'కసాయి' లాంటి తిట్టు పదాలు ఇలాంటివే. లం.....కొడుకు, ముం.....కొడుకు లాంటి తిట్లు మహిళను కించపరిచేవి. అమ్మ, అక్క, చెల్లిని ఉద్దేశించిన బూతులు అనేకం చూస్తున్నాం. తిట్టదల్చుకున్న వ్యక్తిని కాకుండా, ఆ వ్యక్తికి సంబంధించిన మహిళలను కించపరచటం. 'ఆడంగలోడు', 'మగతనం ఉన్నదా?', 'వీడురా మగాడంటే', 'గాజులు తొడుక్కోలేదిక్కడ ఎవరూ', 'నిర్వీర్యం' లాంటి మాటలన్నీ మహిళ లను తక్కువచేసి చూపించేవే. ప్రభుత్వం మీద పోరాటం అయినా, భూస్వామ్య సంబంధాలు, భావజాలం మీద అయినా పోరాడినపుడు మద్దతు కూడగట్టటం సులభమే! రాజకీయ పోరాటం, సైద్ధాంతిక పోరాటం, ఆర్థిక పోరాటం బాగానే ఉంటాయి. కానీ పురుషాధిక్యత మీద పోరాటం మాత్రం పెద్ద పరీక్ష. ఇది ఇంట్లో కూడా ప్రతిబింబిస్తుంది. అక్కడే అసలు సమస్య మొదలవుతుంది.



వాసుకి రాసిన పుస్తకం మహిళల చైతన్యం గురించి. మహిళా చైతన్యం అంటే.... తన భార్య, అక్క, చెల్లి కూడా కదా! ఇంటి పనీ-బయటి పని, కుటుంబంలో నిర్ణయాలలో మహిళల భాగస్వామ్యం, ఆస్తిలో వాటా, చదువులో ప్రాధాన్యతలు, ఆస్తి ఎవరిపేరు మీద రిజిస్టర్ చేయాలి... ఇలాంటి సమస్యలన్నీ ముందుకొస్తాయి. భార్యాభర్తలు ఉద్యోగులుగా ఉన్న కుటుంబాలలో కొంతమేరకు ఇంటిపనిలో పరస్పర సహకారం కనిపిస్తుంది. అవసరంకొద్దీ చేయటమే తప్ప అక్కడ కూడా మహిళల హక్కుగా అంగీకరించడం కష్టం. పురుషులలో అంత చైతన్యం అరుదు. అందుకే మహిళా చైతన్యం గురించి మాట్లాడేటపుడు, ఉద్యమ సంబంధాలున్న పురుషులలో కూడా ఈ చైతన్యం అవసరం. అందుకే పుస్తకం చిన్నదే అయినా సందేశం పెద్దది. కుటుంబంలో భార్యాభర్తలు జీవిత భాగస్వాములు. ఒకరికొకరు శత్రువులు కాదు. కానీ జీవిత భాగస్వామి మీద పురుషాధిక్యత మాత్రం 'పిల్లికి చెలగాటం - ఎలుకకు ప్రాణసంకటం' లాంటిదే. ఇది వికటిస్తే భయానకం కూడా. అన్యోన్య దాంపత్య సంబంధాలలో కూడా పురుషాధిక్యత స్పష్టంగానే ఉంటుంది. మహిళ అణగి ఉండటంలోనే "అన్యోన్యత" వికసిస్తుంది. అలాంటి స్త్రీని ఆదర్శ మహిళగా కీర్తిస్తారు.

> వాసుకి రాసిన పుస్తకం మహిళల చైతన్యం గురించి. మహిళా చైతన్యం అంటే.... తన భార్య, అక్క, చెల్లి కూడా కదా! ఇంటి పనీ-బయటి పని, కుటుంబంలో నిర్ణయాలలో మహిళల భాగస్వామ్యం, ఆస్తిలో వాటా, చదువులో ప్రాధాన్యతలు, ఆస్తి ఎవరిపేరు మీద రిజిస్టర్ చేయాలి... ఇలాంటి సమస్యలన్నీ ముందుకొస్తాయి. భార్యాభర్తలు ఉద్యోగులుగా ఉన్న కుటుంబాలలో కొంతమేరకు ఇంటిపనిలో పరస్పర సహకారం కనిపిస్తుంది. అవసరంకొద్దీ చేయటమే తప్ప అక్కడ కూడా మహిళల హక్కుగా అంగీకరించడం కష్టం. పురుషులలో అంత చైతన్యం అరుదు. అందుకే మహిళా చైతన్యం గురించి మాట్లాడేటపుడు, ఉద్యమ సంబంధాలున్న పురుషులలో కూడా ఈ చైతన్యం అవసరం. అందుకే పుస్తకం చిన్నదే అయినా సందేశం పెద్దది.

మనువాద భావజాలం ప్రభావం సమాజంలో నరనరాన జీర్ణించు కున్నది. పెట్టుబడిదారీ సమాజంలో కార్మికులు పెట్టుబడిదారుల కోసం బానిస చాకిరీ చేస్తున్నారు. ఈ బానిస చాకిరీని కార్మికులు వ్యతిరేకిస్తారు. కానీ ఇంటికి రాగానే, అదే కార్మికుడు భార్యతో బానిస చాకిరీ చేయించు కుంటాడు. ఇక్కడ స్త్రీ బానిసకు బానిస అయ్యింది. అగ్రవర్ణ పెత్తందారీ దురహంకారాన్ని అణగారిన తరగతులు వ్యతిరేకిస్తాయి. మనువాదం అంతం కావాలని నినదిస్తారు. కానీ అదే అణగారిన తరగతుల కుటుంబాలలో పురుషులు తమ స్త్రీల మీద కూడా ఆధిపత్యం చెలాయిస్తారు. ఇది కూడా మనువాదం ఫలితమేనన్న విషయం గుర్తించరు. ఇంట్లో మాత్రం తాను కుటుంబ పెద్దననీ, భార్యమీద తనకు సర్వాధికారాలున్నాయనీ భావిస్తారు. కుల వ్యవస్థలో మహిళలు ఎదుర్కొంటున్న ఈ దుస్థితికి ఏ కులమూ మినహాయింపు కాదు. ఏ మతమూ స్త్రీ పురుష సమానత్వాన్ని ఒప్పుకోదు. సతీసహగమనం మీద పోరాటానికి ఎంతటి ఎదురుగాలి నెదుర్కోవల్సి వచ్చిందో తెల్సిందే. జ్యోతిబా పూలె, సావిత్రిబాయి పూలె ఎదుర్కొన్న ఎదురుగాలీ తెలిసిందే. ఆధునిక భారతదేశంలో కూడా బీజేపీ పార్లమెంటు సభ్యుడు చంద్ర ప్రకాశ్ జోషి బహిరంగంగానే 'సతి'ని కీర్తించాడు. మేవార్ రాణి పద్మావతి "తన ఆత్మగౌరవం కాపాడుకోడానికి సతీ సహగమనం పాటించింది" అన్నాడు. బీజేపీకి చెందిన మరో ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ మహిళా రెజ్లర్ల (మల్లయోధులు) మీద లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని తీవ్రమైన ఆరోపణలు న్నాయి. వాటికి తగిన ఆధారాలు న్నాయని ఢిల్లీ పోలీసులు ప్రకటించారు. అయినా బీజేపీ చర్య తీసుకోడానికి సిద్ధంగా లేదు. ప్రభుత్వం కూడా నేరస్తులను రక్షించేందుకే ప్రయత్నించింది. జమ్ము-కాశ్మీర్‌లో బీజేపీ అధికారంలో ఉండగా ఒక మైనరు బాలికమీద గుడిలో సామూహిక లైంగిక దాడి జరిగింది. పోలీసు అధికారుల చొరవతో నేరస్తులు జైలుకు పోయారు. కానీ, వారిని విడుదల చేయాలని హిందూ మహాసభ ప్రదర్శన నిర్వహించింది. ప్రదర్శనలో ఇద్దరు రాష్ట్ర బీజేపీ మంత్రులు కూడా పాల్గొన్నారు. హత్రాస్‌లో కూడా దళిత మహిళ లైంగిక దాడికి గురైనపుడు, నిందితులను విడుదల చేయాలని సాక్షాత్తూ బీజేపీకి చెందిన స్థానిక పార్లమెంటు సభ్యుడు డిమాండ్ చేసాడు. పదిన్నర మాసాలుగా మణిపూర్‌లో ఆదివాసీ మహిళల మీద జరుగుతున్న దాడుల మీద ప్రధాని స్పందించడానికి సిద్ధంగా లేరు. కులవ్యవస్థ భారతదేశ అభివృద్ధికి మూలమని భావించే రాజకీయ పార్టీలు ఇంతకన్నా భిన్నంగా స్పందిస్తాయని ఆశించలేము. మతాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకునే రాజకీయ పార్టీ, ఆ పార్టీ పాలనలో ప్రభుత్వాధినేతలు ఇంతకన్నా భిన్నంగా ప్రవర్తిస్తారా? బాల్యంలో తండ్రి సంరక్షణలో, యవ్వనంలో భర్త, వృద్ధాప్యంలో కొడుకుల సంరక్షణలో ఉండటం తప్ప మహిళకు ప్రత్యేక స్థానాన్ని మనువాదం ఒప్పుకోదు. ఇలాంటి బలమైన సామాజిక బంధనాల మధ్య మనం మహిళల చైతన్యం గురించి మాట్లాడుతున్నాం. అందుకే పి.వెంకటేశ్వర రావు గారి పుట్టినరోజు పేరుతో ఈ పుస్తకం విడుదల ప్రత్యేకతను సంతరించుకున్నది.

ఈ పుస్తకం తెలుగులో వచ్చినపుడు వెంకటేశ్వరరావు గారు చదివారు. "ఈ తరం పిల్లలు ఇంగ్లీషు చదువులు కదా! ఈ పుస్తకం ఇంగ్లీషులో వస్తే బాగుండును" అన్నారట. ఆయన బిడ్డ జెన్నీ (జెనీలా), తమ్ముడు చలపతిరావు బిడ్డ రమాదేవి చొరవ చేసి ఆంగ్లానువాదం చేయించారు. దానిని ఎడిట్ చేసినవారు రాఘవయ్య, రమాదేవి భర్త. ముందుమాట రాసింది ఎం కృపేందర్.., రమాదేవి అక్క విమల భర్త. పుస్తకావిష్కరణ సభ సమన్వయకర్త అశోక్... జెనీలా భర్త. మహిళా చైతన్యం గురించి చర్చించుకుందామన్న పుస్తకం ఆంగ్లంలో రావటంలో వెంకటేశ్వరరావు గారి కుటుంబంలోని పురుషుల పాత్ర ఇది.

మహిళా చైతన్యాన్ని ప్రోత్సహించటంలో స్త్రీ, పురుషుల సమిష్టి కృషి ఈ కుటుంబంలో చూడొచ్చు. ఉద్యమ సంబంధాలున్న పురుషులలో ఈ చైతన్యం పెరిగితే, సమాజంలో మార్పు కోసం జరిగే కృషి ఎంతటి అనుభూతినిస్తుందో కూడా గమనించవచ్చు. సుమారు అరవై సంవత్సరాల వెంకటేశ్వరరావు గారి ఉద్యమ జీవితం తన కుటుంబసభ్యుల ఆలోచనలను కూడా మలిచింది. తన కుటుంబంతో పాటు తన తమ్ముడి కుటుంబాన్ని కూడా మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా తీర్చిదిద్దారు. ఈ పుస్తకావిష్కరణ సందర్భంగానే ఆయనతో పాటు, తన బిడ్డలు జెనీలా, సుశీల తమ మరణానంతరం మెడికల్ కాలేజీలకు శరీరదానం చేస్తూ సంతకాలు చేసారు. స్ఫూర్తిదాయకమైన జీవితం గడిపిన వెంకటేశ్వరరావు గారికి పుట్టినరోజు వంటి వేడుకలు ఇష్టం ఉండదు. ఎప్పుడూ చేసుకోలేదు. కానీ ఇప్పుడా యన అల్జీమర్స్ వ్యాధితో బాధపడుతున్నారు. ఎప్పుడో ఒకసారి తప్ప ఎవరినీ గుర్తుపట్టడంలేదు. అందుకే పుట్టినరోజు పేరుతో పుస్తకం విడుదల చేసారు. ఈ కృషి నేటి తరానికి ఆదర్శప్రాయం. ■

నవతెలంగాణ
ఖమ్మం
బుధవారం | మార్చి 13, 2024 | www.navatelangana.com

పరిశోధన, ప్రాజెక్టులపై ఒక రోజు వర్క్ షాప్

నవతెలంగాణ-ఖమ్మం

విద్యార్థులు భవిష్యత్తులో చేయబోయే పరిశోధన, ప్రాజెక్టుల తీరు తెన్నులు, అధ్యయన పద్ధతులపై మంగళవారం ఎస్ఆర్‌బిజిఎన్ఆర్ కళాశాల ఐక్యూఏసి విభాగం ఆధ్వర్యంలో ఒక రోజు వర్క్ షాప్‌ని నిర్వహించారు. పరిశోధనకు ఎంచుకున్న అంశంపై సమాచార సేకరణ, క్షేత్ర పర్యటన, డేటా సేకరణ, క్రోడీకరణతో పాటు, ఇంతకు ముందు సంబంధిత అంశాలపై ఏమైనా పరిశోధనలు జరిగాయా, వాటి నమూనాల పరిశీలన, అనుశీలన చేయాలని, వక్తలు విద్యార్థులకు సూచించారు. అదేవిధంగా ప్రాజెక్టు రిపోర్టు తయారీ లోని దశలను, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారని, కళాశాల ఐ.క్యూ.ఏ.సి కోఆర్డినేటర్ డా.ఏ.ఆర్ సత్యవతి తెలిపారు. స్టూడెంట్ డెవలప్ మెంట్ ప్రోగ్రాం లో భాగంగా ఒక రోజు కార్యశాల నిర్వహించామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.వీరబ్రహ్మం, డాక్టర్ ఎస్.నారాయణస్వామి, డాక్టర్ ఎస్.రమేష్, డాక్టర్ డి.శ్రీనివాస్ తెలిపారు. కామర్స్ విభాగం అధ్యాపకులు డి.సుజాత, శ్యామల, దివ్య, రాం ప్రసాద్ , విద్యార్థులు పాల్గొన్నారు.

ఈటెలతో భట్టు నాగేశ్వరరావు భేటీ

నవతెలంగాణ-కామేపల్లి

మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి, తెలంగాణ ఉద్యమ నేత, మాజీ మంత్రి ఈటెల రాజేందర్‌ని ఎస్టీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి భట్టు నాగేశ్వరరావు మంగళవారం కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా భట్టు నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమ నేతగా ఉన్న ఈటల రాజేందర్ ని మల్కాజ్గిరి ప్రజలందరూ ఆశీర్వదించి పార్లమెంటుకు పంపించి తీరుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు సుధాకర్ నాయక్, ఎస్టీ మోర్చా జిల్లా వైస్ ప్రెసిడెంట్ వెంకట్ నాయక్ ,ఎస్టి మోర్చా మండల నాయకులు గోపి నాయక్, పాల్గొన్నారు.

వియం బంజర్ బస్టాండ్‌లో దుర్గంధం

నవతెలంగాణ-పెనుబల్లి

ప్రయాణికుల బస్టాండ్ ప్రాంగణంలో ఆరు బయట మూత్ర విసర్జన చేస్తుండటంతో దుర్గంధం వెదజల్లుతుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆంధ్ర తెలంగాణ బోర్డర్‌కు మధ్య ఉన్న వియం బంజర బస్టాండ్ నిత్యం ప్రయాణికుల రద్దీతో 24 గంటలు కిక్కిరిసి ఉంటుంది. ఖమ్మం రాష్ట్రీయ, జాతీయ రహదారి మధ్యస్థంలో బస్టాండ్ ఉండటం వలన, ఆంధ్ర తెలంగాణ బస్సులకు కేంద్ర బిందు. నిత్యం 500 కు పైగా బస్సులు ఈ పాయింట్ ని తాకుతూ వెళతాయి. బస్టాండ్ ఆవరణలో పురుషులకు మరుగుదొడ్ల సౌకర్యం లేక పోవడంతో బస్టాండ్ ఆవరణలోని మూత్ర విసర్జన చేస్తుండడం వల్ల దుర్గంధ వాసనతో ప్రయాణికులు బస్టాండ్ ఆవరణలో నిలబడాలంటే ప్రాణ సంకటంగా మారింది. పంచాయతీ ఆవరణలో పారిశుధ్య పనులు చేపట్టకుండా ఉండటంతో ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యంగా మారింది. బస్టాండ్ ఆవరణలో లయన్స్ క్లబ్‌తో పాటు అనేక స్వచ్ఛంద సంస్థలు టాయిలెట్ నిర్మాణం కోసం ముందుకు వచ్చిన ఆర్టీసీ అధికారులు అవకాశం కల్పించకపోవడంతో వారు నిరుత్సాహానికి గురయ్యారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు బస్టాండ్ ఆవరణలో మూత్ర విసర్జన జరగకుండా మూత్ర శాలలు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

డ్రైవర్ల పోరాటాన్ని ఉధృతం చేస్తాం...

- జిల్లా రవాణా శాఖ అధికారికి వినతి
- ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి జిల్లా ఉపేందర్

నవతెలంగాణ-ఖమ్మం



రోడ్డు రవాణా రంగంపై డ్రైవర్లు జాతీయ స్థాయిలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ- ఎఆర్టీ డబ్ల్యూఎఫ్) జిల్లా కార్యదర్శి జిల్లా ఉపేందర్ హెచ్చరించారు. మంగళవారం ఖమ్మంలోని జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో డిటివో అఫ్రిన్ సిద్ధిఖ్ కి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతీయ న్యాయ సన్నిహిత 2023 సెక్షన్ 104(1) అండ్ (2)ని ఉపసంహరించుకోవడానికి తక్షణ ప్రభావంగా, ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే రోడ్డు రవాణా రంగం డ్రైవర్లు జాతీయ స్థాయిలో పోరాటాన్ని ఉధృతం చేయవలసి వస్తుందని చెప్పారు. ఫెడరేషన్ దాని అనుబంధ సంఘాలన్నింటికీ అన్ని రాష్ట్ర యూనిట్లు నిర్వహించవలసిందిగా విజ్ఞప్తి చేశారు. రోడ్డు రవాణా రంగం , అన్ని ఇతర వాటాదారులు సాధారణ స్థితికి రావాలని, చట్టంలోని క్రూరమైన నిబంధనలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని, ప్రాణాంతకమైన ప్రమాదాలలో డ్రైవర్లకు 10 సంవత్సరాల జైలు శిక్ష , జరిమానా విధించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నాయకులు నారపోగు నాగేశ్వరావు, బొట్ల సాగర్, పడిగల నాగేశ్వరరావు, మాచర్ల సైదులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

నవతెలంగాణ-కల్లూరు

మండలంలో పలు గ్రామాల్లో చేపట్టనున్న పనులకు బుధవారం ఎమ్మెల్యే ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన చేయనున్నట్లు పార్టీ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణయ్య బంజర్ గ్రామంలో ఉదయం 10:00 గంటలకు, లింగాల గ్రామంలో ఉదయం 11:00 గంటలకు, యర్రబోయినపల్లి గ్రామంలో ఉదయం 11:30 గంటలకు, పెద్దకోరుకోండి గ్రామంలో మధ్యాహ్నం 12:30 గంటలకు, తాళ్లూరు గ్రామంలో మధ్యాహ్నం 01:30 గంటలకు, తెలగారం గ్రామంలో మధ్యాహ్నం 02:30 గంటలకు, మర్లపాడు మధ్యాహ్నం 03:00 గంటలకు, చిన్నకోరుకోండి గ్రామంలో మధ్యాహ్నం 03:40 గంటలకు పాల్గొంటారు.

ఆరుగురిపై బైండోవర్ కేసు నమోదు

నవతెలంగాణ-కల్లూరు

మండలంలో పలు గ్రామాలకు చెందిన ఆరుగురు వ్యక్తులు సారాయి కాస్తుండగా పట్టుకొని తహసీల్దార్ పులి సాంబశివుడు ఎదుట హాజరు పరిచి కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ శాఖ ఎస్సై కృష్ణ ఆధ్వర్యంలో లక్ష్మీపురం పంచాయతీలో సారాయి కాస్తున్న కొత్త బోడి మల్లె గ్రామానికి చెందిన బానోత్ సీతారాములు, బానోత్ శైలజ, అజ్మీర రుక్మిణి, హనుమాతాండ గ్రామానికి చెందిన గుగులోత్ జానికి, పెద్ద కోరుకొండ గ్రామానికి చెందిన బూరుగు ఝాన్సీ, ఎర్ర బంజర గ్రామానికి చెందిన గుగులోత్ జయరాంలను పట్టుకొని తహసీల్దార్ ముందు హాజరు పరిచారు. భవిష్యత్తులో మళ్లీ సారాయి కాస్తే చట్టపరంగా చర్య తీసుకుంటామని హెచ్చరించారు.

గోవిందాపురం ఏ లో పశువైద్య శిబిరం

నవతెలంగాణ-బోనకల్

మండల పరిధిలోని గోవిందపురం ఏ లో మంగళవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా పశుగణాభివృద్ధి, వైరా వారి ఆధ్వర్యంలో గోపాలమిత్ర పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గేదెలు, ఆవులకు సూడు పరీక్షలు, కట్టని గేదెలకు ఉచిత మందుల పంపిణీ చేశారు. గేదె, ఆవు దూడలకు నట్టల మందులు తాగించారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి ఎర్రగుంట్ల అన్వేష్ తాజా మాజీ సర్పంచ్ భాగం శ్రీనివాసరావు, కావూరి జనార్ధన్ రావు, మోటమర్రి సొసైటీ వైస్ ప్రెసిడెంట్ కావూరి శంకర్రావు, కావూరి అశోక్, కావూరి మధుసూదన్ రావు, వడ్డే బోయిన మంగమ్మ, కావూరి వెంకట్రావు, షేక్ రంజాన్ సాహెబ్ పశువైద్యులు గరేపల్లి నాగేంద్ర, పశుగణాభివృద్ధి సంస్థ సూపర్వైజర్ మోతుకూరి వెంకటేశ్వర్లు గ్రామ గోపాల మిత్రులు పాల్గొన్నారు.

కల్లూరులో ఫ్లాగ్ మార్చ్

నవతెలంగాణ-కల్లూరు

కల్లూరు డివిజన్ పరిధిలో శాంతి భద్రతల దృష్ట్యా సీఐఎస్ఎఫ్ 90 మంది పోలీస్ బలగాలతో టీటీడీ కళ్యాణం మండపం నుండి ఎన్ఎస్పి క్రాస్ రోడ్డు వరకు మంగళవారం రాత్రి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు కల్లూరు ఎస్సై షాకీర్, పెనుబల్లి ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. వారు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో దృష్ట్యా గ్రామాలలో ఎవరు ఎటువంటి చట్ట వ్యతిరేక పనులకు పాల్పడకుండా మండల ప్రజల ఆత్మస్థైర్యం కోసం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది సిఐఎస్ఎఫ్ బలగాలు పాల్గొన్నారు.

వైరాలో మిలటరీ బలగాలతో పోలీస్ కవాతు



నవతెలంగాణ-వైరా

వైరా నియోజకవర్గ కేంద్రంలో కేంద్ర పారా మిలిటరీ బలగాలతో కలిసి మంగళ వారం సాయంత్రం పోలీసులు కవాతు నిర్వహించారు. పట్టణంలో శాంతినగర్ నుంచి పాత బస్టాండ్ మీదగా మధిర రోడ్డు వరకు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా వైరా ఎస్సై వంశీకృష్ణ భాగ్యరాజు మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో రాబోయే పార్లమెంటు ఎన్నికల సందర్భంగా శాంతి భద్రతలకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు పారా మిలటరీ బలగాలు పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసేందుకు మేమున్నామంటూ కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించడం జరిగిందని తెలిపారు. సహకరించాలని కోరారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం

వైరా ప్రాజెక్ట్‌కు సీతారామ ప్రాజెక్ట్ అనుసంధానం

- నేడు మంత్రులచే శంకుస్థాపన
- ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్



నవతెలంగాణ-వైరా

సీఎం రేవంత్ రెడ్డి రైతుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నారని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. వైరా రిజర్వాయర్ సాగునీరు, తాగునీరు అనుసంధానం కోసం సీతారామ ప్రాజెక్టు కాలువకు 100 కోట్లు నిధులు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని ఎమ్మెల్యే రాందాస్ నాయక్ తెలిపారు. ఈ పనులను ప్రారంభించేందుకు వైరా రిజర్వాయర్ ఆనకట్ట వద్ద 13వ తేదీ బుధవారం రోజు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేస్తారని ఎమ్మెల్యే తెలిపారు. వైరా రిజర్వాయర్‌కు సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను నింపడం వలన ఆయకట్టు రైతులకు సాగునీరు, 12 మండలాల ప్రజలకు తాగునీరు అందుతుందని తెలిపారు. రిజర్వాయర్ ఆనకట్ట వద్ద శంకుస్థాపన సభ స్థలాన్ని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ పరిశీలించి, యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని కోరారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా వైరా రిజర్వాయర్ అనుసంధానం చేయడంతో నిత్యం రిజర్వాయర్‌లో పూర్తిస్థాయి నీటిమట్టం ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో వైరా ప్రాంత రైతుల కల సాకారం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, జిల్లా నాయకులు దాసరి దానియల్, వెంకట నర్సిరెడ్డి, బొర్రా రాజశేఖర్, మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, కట్ల రంగారావు, కట్ల సంతోష్, పమ్మి అశోక్, మచ్చా బుజ్జి, ఎదునూరి సీతరాములు, దొడ్డ పుల్లయ్య, ఇరిగేషన్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాలలో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ పెట్టాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తుమ్మ విష్ణువర్ధన్, కళ్యాణం వెంకటేశ్వరరావు

నవతెలంగాణ-ఖమ్మం



అంగన్వాడీ ఉద్యోగులను దొంగలుగా చిత్రీకరిస్తూ, అంగన్వాడీ కేంద్రాలలో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ పెట్టాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తుమ్మ విష్ణువర్ధన్, కళ్యాణం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం అంగన్వాడీ కేంద్రాలకు ఒకపూట బడితో పాటు మే నెలంతా టీచర్స్, హెల్పర్లకు సెలవులివ్వాలని, పనిచేయని సెల్‌ఫోన్లు తిరిగి అప్పగిస్తున్నామని, 24 రోజుల సమ్మె హామీలు అమలు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తుమ్మ విష్ణువర్ధన్, కళ్యాణం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల 2న సీఎం ఎనుమల రేవంత్ రెడ్డి ఐసిడిఎస్ శాఖ సమీక్ష సమావేశం నిర్వహించారని, ఈ సమావేశంలో అంగన్వాడీ కేంద్రాలలో పోషకాహారం దుర్వినియోగం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దీనికోసం అంగన్వాడీ కేంద్రాలలో సిసి కెమెరాలు, బయోమెట్రిక్ విధానాన్ని ప్రవేశ పెట్టాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారని తెలిపారు .అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ ను దొంగలుగా ఆరోపించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఐసిడిఎస్‌కు బడ్జెట్ పెంచి, ఎలా బలోపేతం చేయాలనే అంశాలు సమావేశంలో చర్చించలేదని, 48 సంవత్సరాలుగా పనిచేస్తున్న అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ ఎదుర్కొంటున్న సమస్యలు వాటి పరిష్కారం కోసం తీసుకునే చర్యలు సమావేశంలో చర్చించలేదని, వీటన్నింటిని పక్కన బెట్టి పేద ప్రజల కోసం నిరంతరం సేవలందిస్తున్న అంగన్వాడీ టీచర్స్, హెల్పర్సన్న అవినీతిపరులని ఆరోపించడం అన్యాయమన్నారు.

సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను కేవలం రెండు మాత్రమే మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా అప్గ్రేడ్ చేశారు. ప్రమాద బీమా అమలు చేస్తున్నామని చెప్పారు. మిగిలిన సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదని, పై సమస్యలను అనేకసార్లు గత ఐసిడిఎస్ రాష్ట్ర అధికారులకు , ఐసిడిఎస్ మంత్రి దృష్టికి తీసుకువచ్చామని, అయినా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో అంగన్వాడీ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు పి.రమ్య, కె.సుధారాధ, రాష్ట్ర నాయకులు బి.కోటేశ్వరి, జిల్లా నాయకులు నాగమణి, విజయలక్ష్మి, పాపారాణి, నిర్మల, నాగమణి, రమా, స్వరాజ్యం, సీఐటీయూ నాయకులు పి.మోహన్ రావు, తిరుమలచారి, తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు మంత్రి పొంగులేటి పర్యటన

నవతెలంగాణ-ఖమ్మం



మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి బుధ, గురువారం ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో పర్యటించనున్నారని ఆయన క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం కూసుమంచి మండలం నాయకన్ గూడెం, గట్టు సింగారం, చేగొమ్మ, చౌటపల్లి గ్రామాల్లో సీసీ రోడ్లకు శంఖుస్థాపన చేస్తారని తెలిపారు. డోర్నకల్ నియోజకవర్గం మరిపెడ బంగ్లాలోని పురుషోత్తమాయగూడెంలో జరిగే గంగాభవాని దేవత విగ్రహ ప్రతిష్టా మహోత్సవంలో పాల్గొంటారని పేర్కొన్నారు. అదేవిధంగా తిరుమలాయపాలెం మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తారని తెలిపారు. ఖమ్మం రూరల్ మండలం జలగంనగర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవంలో, నాయుడుపేట, ఇందిరమ్మ కాలనీల్లో జరిగే పార్టీ కార్యక్రమాల్లో, పల్లెగూడెం, కామంచికల్ గ్రామాల్లో జరిగే ఆర్ అండ్ బీ రోడ్ల శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. అనంతరం ఖమ్మం అర్బన్ బల్లెపల్లిలోని బ్లూమింగ్ మైండ్స్ పాఠశాల వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొంటారని తెలిపారు. గురువారం కూసుమంచి మండలం జీళ్లచెర్వులో సీసీ రోడ్ల ప్రారంభోత్సవంలో పాల్గొంటారన్నారు. అదేవిధంగా కూసుమంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొంటారని వెల్లడించారు. అనంతరం నేలకొండపల్లి మండలం చెన్నారంలో ఆర్ అండ్ బీ రోడ్ల శంఖుస్థాపన, కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఆయా మండలాల్లోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై మంత్రి పొంగులేటి పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

మృతుని కుటుంబానికి తోటి కానిస్టేబుళ్ల ఆర్థిక సాయం

నవతెలంగాణ-ఖమ్మం

2000 బ్యాచ్‌కి చెందిన భూక్య లోక్‌చంద్ ఈ ఏడాది ఈనెల 4న అనారోగ్యంతో మరణించాడు. తోటి బ్యాచ్ కానిస్టేబుళ్లు , పోలీస్ అధికారులు మృతిచెందిన కానిస్టేబుల్ కుటుంబానికి అండగా నిలబడి తమవంతు సహాయంగా రూ.2,27,000 చెక్‌ను మంగళవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ చేతులు మీదగా లోక్‌చంద్ సతీమణి జ్యోతి కి చెక్కును అందజేశారు.

డిప్యూటీ సీఎం పట్ల కులవివక్ష

- సీఎం బహిరంగ క్షమాపణ చెప్పాలి : కేవీపీఎస్

నవతెలంగాణ-ఖమ్మం

యాదాద్రిగుట్టపై బ్రహ్మోత్సవాల ప్రారంభానికి ప్రభుత్వం తరఫున వెళ్ళిన దళిత డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను నేలపై కూర్చోబెట్టి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇతర మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి కుర్చీలలో కూర్చొని మల్లు భట్టి విక్రమార్క పట్ల కులవివక్ష పాటించారని, ఇది వారి అగ్రకుల దురహంకారానికి నిదర్శనమని, తక్షణమే సీఎం బహిరంగ క్షమాపణ చెప్పాలని కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముత్తమాల ప్రసాద్, నందిపాటి మనోహర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఒకవేళ ఈ క్రతువులు వారి కుటుంబ సొంత వ్యవహారం ఐతే, మరిక్కడ ఉప ముఖ్యమంత్రి భట్టి ఎందుకు ఉన్నాడు? ఉన్నవాడు అందరితో సమానంగా కాక కింద ఎందుకు కూర్చున్నాడు? బ్రాహ్మణ్య కుట్రల ప్రకారం, భట్టి హిందువే ఐనా, నిచ్చెనమెట్ల కుల వ్యవస్థలో అతడు దళితుడు పంచముడు కాబట్టే అలా తక్కువ స్థాయిలో నేలపై కూర్చోబెట్టారా? సీఎం వెంటనే సమాధానం చెప్పాలన్నారు. తక్షణమే యాదాద్రి టెంపుల్ ఈవో పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒక డిప్యూటీ సీఎం స్థాయిలోనే కులవివక్ష, అంటరానితనం ఇలా ఉంటే సాధారణ దళితుల పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవాలన్నారు.

అభివృద్ధి చేయడం నా బాధ్యత

- ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్
- అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

నవతెలంగాణ-సత్తుపల్లి



ఎన్నికల సందర్భంగా ఏదైతే మాటిచ్చామో మాపై నమ్మకంతో బాధ్యతగా ఓట్లేసి గెలిపించారని, ఇచ్చిన మాట ప్రకారం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడం ఇక నా బాధ్యతని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ స్పష్టం చేశారు. మంగళవారం సత్తుపల్లి మండలంలోని రామానగరం, యాతాలకుంట, చెరుకుపల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే రాగమయి దయానంద్ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు భట్టి, పొంగులేటి, తుమ్మల, సహచర మంత్రులు అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన 48గంటల్లోనే రెండు గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిందన్నారు. గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, ఆరోగ్యశ్రీ పథకాలన్నీ అమల్లోకి వచ్చాయన్నారు. 100రోజుల్లోనే అమలు చేస్తామని ఇచ్చిన హామీలన్నీ దాదాపుగా పూర్తి దశకు చేరుకున్నాయన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఖజానాను మొత్తం ఖాళీచేసి రూ. 7లక్షల కోట్ల అప్పులను తెలంగాణ సమాజం నెత్తిన పెట్టిందన్నారు. ఈ నేపథ్యంలో ఇచ్చిన హామీ మేరకు గ్యారంటీలను అమలు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో శ్రమించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అయినా మొక్కవోని దీక్షతో హామీలను నెరవేర్చే కార్యక్రమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని అమలు చేస్తోందని ఎమ్మెల్యే రాగమయి దయానంద్ స్పష్టం చేశారు. గూడులేని పేదలు నిశ్చింత పడొద్దని, ఇందిరమ్మ రాజ్యంలో ఇండ్ల పథకం కూడా ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. గూడులేని పేదల సొంతింటి కల ఇక నెరవేరుతుందని ఎమ్మెల్యే రాగమయి దయానంద్ అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శివా వేణు, చల్లగుళ్ల నరసింహారావు, వినుకొండ కృష్ణ, కొప్పుల నరేందర్‌రెడ్డి, సీపీఐ నాయకులు దండు ఆదినారాయణ, ఆయా గ్రామాల నాయకులు ఒంటెద్దు సాయిలు, భూషణం, అప్పన్న, తాటి రామకృష్ణ, మెచ్చా రామకృష్ణ, మడకం ప్రసాద్, బాబూరావు పాల్గొన్నారు.

సఖి కేంద్రానికి మతిస్థిమితం లేని మహిళ తరలింపు

నవతెలంగాణ-తల్లాడ

తల్లాడకు సుబ్బని పల్లవి మతిస్థిమితం లేక గత నాలుగు నెలలుగా పట్టణంలో సంచరిస్తున్నది. ఆమెను సామాజిక కార్యకర్తలు సఖి కేంద్రానికి మంగళవారం అప్పగించారు. కటికి వెంకయ్య నాయుడు, ఎన్జీవో మహారత్నమ్మ స్వచ్ఛంద సేవ సొసైటీ చైర్మన్ శ్రీనివాస్, మండల అధికారులకు సమాచారం ఇచ్చి బాధితురాలని పారామెడికల్ అధికారి పుష్పలతకు అప్పగించారు.

కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్న డీసీసీబీ చైర్మెన్

నవతెలంగాణ-మధిర



ఖమ్మంపాడు సొసైటీ చైర్మెన్, సీనియర్ నాయకులు దొండపాటి వెంకటేశ్వరరావు మంగళ వారం ఖమ్మం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పువాళ్ళ దుర్గాప్రసాద్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా దొండపాటికి కాంగ్రెస్ కండువా కప్పి వారు కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు.

ఆయిల్ పాంను గోద్రెజ్ కు అప్పగించే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

- సత్తుపల్లి, వేంసూరు మండలాల పామాయిల్ రైతుల తీర్మానం

నవతెలంగాణ-సత్తుపల్లి



గోద్రెజ్ కంపెనీకి పామాయిల్ తోటలను అప్పగించే నిర్ణయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణం వెనక్కి తీసుకోవాలని సత్తుపల్లి, వేంసూరు మండలాల పామాయిల్ రైతులు తీర్మానించారు. మంగళవారం సాయంత్రం స్థానిక లక్ష్మీ ప్రసన్న ఫంక్షన్ హాల్ లో ఆ రెండు మండలాల పామాయిల్ రైతులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయిల్ పాం రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు ఆలపాటి ప్రసాద్ మాట్లాడుతూ ఇటీవల దావోస్ లో జరిగిన సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి ఖమ్మం జిల్లాలోని పామాయిల్ తోటలను గోద్రెజ్ కంపెనీకి అప్పగిస్తామని ప్రకటన చేశారన్నారు. జిల్లాలోని ఫామాయిల్ తోటలను గోద్రెజ్ కు కేటాయించాలనే ముఖ్యమంత్రి నిర్ణయాన్ని పామాయిల్ రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని ఆయన అన్నారు. ఆయిల్ ఫెడ్ నుంచి కాకుండా గోద్రెజ్ కంపెనీలో కలపడం వల్ల పామ్ ఆయిల్ ధరలు అమాంతంగా తగ్గే ప్రమాదం ఉందని రైతులు సమావేశంలో ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాకుండా మొక్కలకు రాయితీ వచ్చే అవకాశం కూడా ఉండదన్నారు. మొక్కల కొరత ఏర్పడుతుందని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా ఈ ఏడాది ఆయిల్ ఫామ్ ఫార్ములా ను 19.20 నుంచి 19.17 కు మార్చడం వల్ల తణుకు రూ.500 చొప్పున అదనంగా లాభం చేకూరేలా కృషిచేసిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు సమావేశం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపింది. ఈ సమావేశంలో రాష్ట్ర పామాయిల్ సంఘం డైరెక్టర్లు వేంపాటి లక్ష్మీనారాయణ, చలసాని సాంబశివరావు, బండి గురునాథరెడ్డి, చల్లగుళ్ల నరసింహారావు, ఆళ్ల నాగేశ్వరరావు, పాకపాటి శ్రీనివాసరావు, ప్రసాదరెడ్డి, విష్ణు, చీకటి చిట్టిరావు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మహిళా అభ్యున్నతే కాంగ్రెస్ ధ్యేయం

- జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సౌజన్య

నవతెలంగాణ-ఖమ్మం

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది తమ సొంత కాళ్ళ మీద నిలవాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా శక్తి పేరుతో డ్వాక్ర మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీ లేని రుణాలను అందించేందుకు శ్రీకారం చుట్టడం పట్ల సౌజన్య ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొద్ది రోజుల్లోనే హామీలు అమలు చేయడం శుభపరిణామం అని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేనప్పటికి ప్రభుత్వం హామీలను అమలు చేసేందుకు శ్రమిస్తోందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరా క్రాంతి పథకాలకు, గత ప్రభుత్వాలు మరుగున పడేశాయని, దీంతో మహిళలు ఆర్థికంగా వెనుకబాటుకు లోనయ్యారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సారథ్యంలో మహిళా అభివృద్ధికి ప్రత్యేకంగా మహిళలకు పథకాలను ప్రారంబించడం సంతోషంగా ఉందని అన్నారు.

నిజాయితీ, నిబద్ధత కలిగిన వ్యక్తి మాటూరి

నవతెలంగాణ-ఖమ్మం



ఉన్నత విలువలు నిజాయితీ నిబద్ధతతో కలిగిన వ్యక్తి మాటూరి రామచంద్ర రావు అని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, ఎర్రా శ్రీకాంత్ అన్నారు. మంగళవారం ఖమ్మంలోని మంచికంటి భవన్‌లో మాటూరి రామచంద్ర రావు సంస్మరణ సభ ఎం.సుబ్బారావు అధ్యక్షతన జరిగింది. ఈ సభలో వారు మాట్లాడుతూ రామచంద్రరావు విద్యార్థి, యువజన ఉద్యమాన్ని నిర్మించిన దర్శకుడని కొనియాడారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఉద్యమ నిర్మాతగా ఉన్నారని, విద్యార్థి యువజన ఉద్యమ నిర్మాణానికి విస్తరణకు ఆయన చేసిన కృషి కొనియాడారు. ఆయన కార్యకర్తలకు సైద్ధాంతిక అవగాహన కల్పించారని, అంతేకాకుండా నిరంతర అధ్యయనశీలి చేసేవారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా కార్యదర్శి పి.సోమయ్య, జిల్లా నాయకులు వై విక్రం, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, సిఐటియు పూర్వ నాయకులు జక్కంపూడి నాగేశ్వరరావు, రాజేశ్వరరావు, ఖయ్యాం ఏలూరి భారతి, సంధ్యారాణి, గీత, ఇందిరా ,కొల్లు సత్యనారాయణ, విప్లవ కుమార్, ఏడునూతల శ్రీనివాస్, బోడపట్ల రవీందర్ ,నవీన్ ,వజినేపల్లి శ్రీనివాస్, శ్రీదేవి, సింగు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

రేపు మధిరకు భట్టి రాక..

నవతెలంగాణ-మధిర

మధిర పట్టణంలో పలు అభివృద్ధి పథకాలకు శంకుస్థాపన చేయడానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క బుధవారం మధిర వస్తున్న సందర్భంగా హెలిపాడ్ దిగు స్థలాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, సీఐ మధు, టౌన్ ఎస్ఐ సంధ్య, మున్సిపాలిటీ కమిషనర్ షఫీ ఉల్లా, ఆర్ అండ్ బి అధికారులు, మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సూరం శెట్టి కిషోర్, మున్సిపాలిటీ కౌన్సిలర్లు కోన ధని కుమార్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం
బుధవారం | మార్చి 13, 2024 | www.navatelangana.com

రోడ్డు ప్రమాదంలో ప్రయివేటు ఎలక్ట్రీషియన్ మృతి

నవతెలంగాణ-నేలకొండపల్లి

రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు ప్రమాదవశాత్తు బైక్ నుండి కింద పడి మృతి చెందిన ఘటన మంగళవారం నేలకొండపల్లిలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదురుగా నేలకొండపల్లి కూసుమంచి ప్రధాన రహదారిపై జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అమ్మగూడెం గ్రామానికి చెందిన అడపాల సుధాకర్ (35) నేలకొండపల్లి నుండి అమ్మగూడెం తన బైక్‌పై వెళుతుండగా మండల ప్రజా పరిషత్ కార్యాలయం రోడ్డు వద్దకు రాగానే ప్రమాదవశాత్తు బైక్‌పై నుండి కింద పడి మృతి చెందాడు. మృతునికి భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. సుధాకర్ రాజేశ్వరపురంలోని విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో అన్ మ్యాన్ విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు. సుధాకర్ భౌతికకాయాన్ని విద్యుత్ అధికారులు, సిబ్బంది, పలువురు రాజకీయ పార్టీల నాయకులు, గ్రామస్తులు సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



మొదటి స్థానంలో నిలిచిన త్రివేణి విద్యార్థిని

నవతెలంగాణ-ఖమ్మం

భారతీయ తపాలా శాఖ నిర్వహించిన ధాయ్ ఆకార్ లెటర్ రైటింగ్ కాంపెయిన్‌లో భాగంగా ఎన్వొలెప్ లెటర్ విభాగంలో త్రివేణి పాఠశాలకు చెందిన తొమ్మిదవ తరగతి విద్యార్థిని బి.ఆరాధ్య ఖమ్మం సర్కిల్ స్థాయిలో ప్రథమ బహుమతి గెలుచుకుందని పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి తెలిపారు. విద్యార్థిని 25వేల నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందుకున్నాడని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి ఇంకెన్నో విజయాలను అందుకోవాలని చిన్నారిని ఆశీర్వదించారు. పాఠశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ విజేతలైన విద్యార్థి ముందు ముందు మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, పాఠశాల సిఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, పాఠశాల వైస్ ప్రిన్సిపల్ స్వప్న, ముస్తఫా, అశోక్, క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్, సందీప్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జేఎన్టీయూ ఫలితాల్లో ప్రియదర్శిని విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

జేఎన్టీయూ మొదటి సంవత్సర ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని మండల పరిధిలో సాయి ప్రభాత్ నగర్‌లోని ప్రియదర్శిని మహిళ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ గోపాల్ తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను కళాశాల చైర్మన్ కాటేపల్లి నవీన్ బాబు, అకడమిక్ డైరెక్టర్ అట్లూరి వెంకటరమణ మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా చైర్మన్ నవీన్‌బాబు మాట్లాడారు. ఎవరైతే ఏకాగ్రత, పట్టుదలతో నిలకడగా రాణిస్తారో వారే విజేతలుగా నిలుస్తారని వివరించారు. కష్టతరమైన సబ్జెక్టులను ఆకళింపు చేసుకొని అన్ని అంశాలపై సాధికారత సాధించగలిగితే విజయం దానంతట అదే వస్తుందన్నారు. 9.4 సీజీపీఏతో విశ్వవిద్యాలయ స్థాయిలో అద్భుత ప్రతిభ సాధించిన భార్గవిని ప్రత్యేకంగా మెమెంటోతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ గోపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

నవతెలంగాణ-కారేపల్లి

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందిన కారేపల్లి మండలం పోలంపల్లిలో చోటుచేసుకుంది. కారేపల్లి పోలీసుల కథనం ప్రకారం... పోలంపల్లికి చెందిన తేజావత్ రవికుమార్(35) సోమవారం తన ఇద్దరు కుమారులైన తేజావత్ మోక్షిత్, తేజావత్ భార్గవ్ లను ఖమ్మంలోని ఓ ప్రయివేటు స్కూల్ హాస్టల్‌లో దింపి తిరిగి రాత్రి సమయంలో మోటర్ సైకిల్ పై పోలంపల్లివస్తుండగా ఆల్యాతండా సమీపంలోని మూలమలుపువద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి మోటర్ సైకిల్ అదుపుతప్పి పక్కనే ఉన్న ప్రహరి గోడను ఢీకొట్టాడు. తీవ్రంగా గాయాలైన రవికుమార్‌ను ఖమ్మం అసుపత్రికి తరలించి చికిత్స నిర్వహిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుని భార్య తేజావత్ జ్యోతి పిర్యాదు మేరకు కారేపల్లి ఎస్సై ఎస్.రాజారాం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు రేపాకుల వీరస్వామి మృతి

నవతెలంగాణ-తిరుమలాయపాలెం



పాపాయిగూడెం గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు రేపాకుల వీరస్వామి మంగళవారం మృతి చెందారు. మృతదేహాన్ని పార్టీ మండల కార్యదర్శి కొమ్ము శ్రీను సందర్శించి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరస్వామి పిండిప్రోలు గ్రామపంచాయతీ పరిధిలో ఎర్రజెండా విస్తరణ కోసం ఎనలేని కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు తుళ్లూరు నాగేశ్వరరావు, దొండేటి ఆనందరావు, గోపూజ రవి, పప్పుల ప్రసాద్, పిండిప్రోలు గ్రామ శాఖ కార్యదర్శి దొడ్డ లింగస్వామి, రామనబోయిన రవి, దొండేటి నిర్మల్‌రావు, చల్లా వెంకటేశ్వర్లు, పప్పుల ఉపేందర్, పాపాయిగూడెం పార్టీ సెక్రెటరీ సొంటి వెంకటేశ్వర్లు, రేపాకుల భద్రయ్య, రేపాకుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో దుప్పి మృతి

నవతెలంగాణ-సత్తుపల్లి



సత్తుపల్లి పట్టణంలోని నీలాద్రి అర్బన్ పార్కులో ఊరకుక్కలు చొరబడి అక్కడ ఉన్న ఓ దుప్పిపై దాడిచేయగా ఆ దుప్పి మృతిచెందిన ఘటన మంగళవారం ఉదయం జరిగింది. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ముత్తి వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం... అర్బన్ పార్కు వేంసూరు రోడ్డువైపుగా వీధి కుక్కలు లోపలికి ప్రవేశించి అక్కడ ఉన్న ఓ దుప్పిపై మూకుమ్మడిగా దాడి చేశాయి. సమాచారం తెలిసిన వెంటనే అటవీశాఖ సిబ్బంది పార్కుకు చేరుకొని దుప్పికి వైద్య చికిత్స అందిస్తున్న క్రమంలో మృతిచెందింది. దుప్పి మృతదేహాన్ని పట్టణ శివారులోని అటవీ ప్రాంతంలో దహనం చేసినట్లు ఎఫ్‌బీవో వెంకటేశ్వర్లు తెలిపారు.

బీజేపీ అరాచక ప్రభుత్వాన్ని గద్దె దింపాలి

జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్

నవతెలంగాణ- ఖమ్మం



రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బిజెపి లాంటి మతతత్వ అరాచక ప్రభుత్వాన్ని గద్దె దించాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్ అన్నారు. మంగళవారం ఖమ్మంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయం (సంజీవరెడ్డి భవనం)లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా రంజక పథకాలకు ఆకర్షితులులై కాంగ్రెస్‌లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని అన్నారు. తప్పుడు హామీలు ఇచ్చి పదేళ్లఅధికారనెక్కిన బిఆర్ఎస్‌కు ప్రజలు బుద్ధి చెప్పారని, ప్రజా సంక్షేమాన్ని కోరుకున్న నాయకులు నేడు పార్టీల్లో క్యూ కడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఘోర పరాజయం పొందిన బీఆర్ఎస్ తన ఉనికి చాటుకోవడానికి బిజెపితో కలిసి చీకటి ఒప్పందం చేసుకొని, పార్లమెంట్ ఎన్నికల్లో కలిసి పోటీ చేయాలని ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు. మోడీ కూడా ఎన్నో హామీలు ప్రకటించారని, బయ్యారం ఉక్కు కర్మాగారం, గిరిజన యూనివర్సిటీలు, పసుపు బోర్డు వంటి ఎన్నో హామీలు ఇచ్చారని, పదేండ్లు గడుస్తున్నా ఏ ఒక్క హామీనీ నెరవేర్చలేదని అన్నారు. ఉన్న సంపదను బడా పారిశ్రామికవేత్తలకు దోచిపెడుతూ దేశ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేశారని ఆరోపించారు. బిజెపి, బీఆర్ఎస్ చీకటి ఒప్పందాలను ప్రజలు పసిగట్టి కేంద్రంలో కూడా కాంగ్రెస్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా ప్రతి హామీని నెరవేర్చి మళ్ళీ ఓట్లు అడగాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటి సీఎం మల్లు భట్టి విక్రమార్క ముందుకు పోతున్నారని స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లాలో భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుల సారథ్యంలో పార్లమెంట్ ఎన్నికల్లో, ఇతర స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ భారీ మెజారిటీతో విజయం సాధించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం మాజీ బీఆర్ఎస్ నాయకులు దొండపాటి వెంకటేశ్వర్లు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరడంతో దుర్గా ప్రసాద్ కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ విలేకరుల సమావేశంలో పిసిసి సభ్యులు రాయల నాగేశ్వరరావు, వడ్డే నారాయణరావు, జిల్లా మహిళా, కిసాన్, మైనారిటీ అధ్యక్షులు దొబ్బల సౌజన్య, మొక్కా శేఖర్ గౌడ్, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు చోటా బాబా, కార్పొరేటర్లు చావా నారాయణరావు, కమర్తపు మురళి, మాజీ కౌన్సిలర్ పాలకుర్తి నాగేశ్వరరావు, జిల్లా కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కొంటెముక్కల నాగేశ్వరరావు, మద్ది వీరారెడ్డి, గడ్డం వెంకటయ్య ఏలూరి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు ఆటో బోల్తా...ఒకరు మృతి

9 మందికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-నేలకొండపల్లి





మండలంలోని సుర్దేపల్లి రామచంద్రపురం గ్రామాల మధ్య మంగళవారం ఉదయం ప్రమాదవశాత్తు ఆటోపల్టీ కొట్టడంతో ఒక మహిళ కూలి మృతి చెందగా మరో 9 మంది కూలీలకు తీవ్ర గాయాలైన ఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలంలోని కిష్టాపురం, అనంతగిరి గ్రామాలకు చెందిన 13 మంది వ్యవసాయ కూలీలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్టీఆర్ కృష్ణాజిల్లాలోని పెనుగంచిప్రోలు గ్రామంలో మిర్చి తోట ఏరేందుకు ఆటోలో వెళుతున్నారు. కూలీలతో వెళుతున్న ఆటో నేలకొండపల్లి మండలంలోని సూర్దేపల్లి రామచంద్రపురం గ్రామాల మధ్యకు రాగానే రోడ్డుపై కుక్క అడ్డుగా రావడంతో ఆటో డ్రైవర్ కుక్కను తప్పించబోగా ప్రమాదవశాత్తు ఆటో పల్టీ కొట్టి పక్కనే ఉన్న పొలాల్లో పడిపోయింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న కూలీలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్సలు అందిస్తున్నారు. ఆసుపత్రిలో చికిత్సలు అందిస్తుండగా పెద్దపొంగు పార్వతి(47) అనే మహిళ మృతి చెందగా గాయపడిన వారిని మెరుగైన వైద్యం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. జరిగిన ప్రమాద ఘటనపై నేలకొండపల్లి పోలీసులు సమాచారం సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కూలీల ప్రమాద ఘటనపై కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి వివరాలు అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరినట్లు సమాచారం.

ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌ల నిర్వహణలతో... సుస్థిర భవిష్యత్తు... స్థిరమైన అభివృద్ధికి దోహదం

- ఇథియోపియా ప్రొఫెసర్లు గోపీకృష్ణ, టెక్లు ఉర్గెస్సా
- సాయిస్ఫూర్తిలో ఐసీఆర్‌టీఈఎం సైన్స్‌పై ఇథియోపియా నుంచి వీడియో కాన్ఫరెన్స్

నవతెలంగాణ-సత్తుపల్లి



అంతర్జాతీయస్థాయి కాన్ఫరెన్స్‌ల నిర్వహణల వల్ల సుస్థిర భవిష్యత్తు, స్థిరమైన ఆవిష్కరణలకు ఎంతగానో దోహద పడతాయని ఇథియోపియాకు చెందిన ఆడమా సైన్స్ అండ్ టెక్నాలజీ యూనివర్శిటీ డిపార్టుమెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్లు తిరువీదుల గోపీకృష్ణ, డాక్టర్ టెక్లు ఉర్గెస్సా అన్నారు. మంగళవారం సత్తుపల్లి మండలం గంగారం సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం సైన్స్ అండ్ టెక్నాలజీ యూనివర్శిటీ, ఆడమా ఇథియోపియా వారి ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ రీసెంట్ ట్రెండ్స్ ఇన్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్ (ఐసీఆర్‌టీఈఎం) సైన్స్ అంశంపై అంతర్జాతీయస్థాయి వీడియో కాన్ఫరెన్స్ ప్రత్యక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రొఫెసర్లు గోపీకృష్ణ, టెక్లు ఉర్గెస్సా ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ఐసీఆర్‌టీఈఎం సైన్స్‌లో పరిశోధన పండితులు, అధ్యాపకులు, అకడమిషన్స్, ఇండస్ట్రియల్ ప్రొఫెషనల్స్, విద్యావేత్తలు, పరిశ్రమల నిపుణుల కోసం ఆలోచనలను మార్పిడి చేసుకోవడం, ఒకరికొకరు పంచుకోవడంతో పాటు ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ సైన్స్ రంగాల్లో తాజా పురోగతిని చర్చించడానికి ఒక వేదికను అందించడం లక్ష్యంగా ఈ యేడాది ఈ వీడియో కాన్ఫరెన్స్‌ను ఏర్పాటు చేసుకోవడం జరిగిందని ఇథియోపియా ప్రొఫెసర్లు తెలిపారు. ఈ కాన్ఫరెన్స్‌లో 98 ప్రెజెంటేషన్స్ హైబ్రిడ్ మోడ్‌లో ఇవ్వడం జరిగిందని వివరించారు. సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ దాసరి ప్రభాకరరెడ్డి ఈ కాన్ఫరెన్స్‌ను ప్రారంభించగా ప్రిన్సిపాల్ ఊటుకూరి శేషారత్నకుమారి, అన్ని ఇంజనీరింగ్ విభాగాల హెచ్‌వోడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) నాయకులు అన్నారపు లాలయ్య వర్ధంతి

నవతెలంగాణ-కొణిజర్ల

మండల పరిధిలోని తనికెళ్ల గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకులు అన్నారపు లాలయ్య 24వ వర్ధంతి సభ గ్రామ శాఖ మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా లాలయ్య స్థూపాన్ని పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ వర్ధంతి సభకు యూటిఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ రంజాన్ ముఖ్యఅతిథిగా హాజరై నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల కమిటీ సభ్యులు అన్నారపు వెంకటేశ్వర్లు మాట్లాడారు. లాలయ్య స్తూపం వద్ద పార్టీ పతాకాన్ని సీనియర్ నాయకులు చల్లా నారాయణ ఆవిష్కరించారు. అనంతరం మండల కమిటీ సభ్యులు అన్నారపు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ లాలయ్య గ్రామ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాడని, తన నమ్ముకున్న సిద్ధాంతం కోసం జీవించిన మహనీయడని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు చింతనపు సూర్యం, సీపీఐ నాయకులు పీవీ రావు, యాస వెంకయ్య యాస ప్రభాకర్‌రావు, యాస తిలక్, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు వేముల సాంబశివరావు, ఐలు జిల్లా నాయకులు అన్నారపు వెంకటేశ్వర్లు, లాలయ్య సతీమణి తిరుపమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఎంపీడీవోకి వినతి

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

పోలేపల్లిలోని రెండు పడకగదుల ఇళ్ల సముదాయంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఐఎంఎల్ మాస్ లైన్ ఆధ్వర్యంలో ఎంపీడీవో కుమారికి బాధితులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐఎంఎల్ మాస్ లైన్ ఖమ్మం డివిజన్ కార్యదర్శి టి.ఝాన్సీ మాట్లాడారు. ఇళ్ల సముదాయం వద్ద సెప్టిక్‌ట్యాంక్ నుంచి దుర్వాసనలు వస్తున్నాయని, ఒక్కో ఇంటికి విడివిడిగా ఏర్పాటు చేయకుండా సామూహికంగా సెప్టిక్ ట్యాంక్ ఏర్పాటు చేశారని, దీని వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని వివరించారు. కార్యక్రమంలో నాయకులు జాస్మిన్, ఉపేందర్, వెంకటరమణ, గోపాలకృష్ణ, మమత, శ్రీను, చంద్ పాల్గొన్నారు.



శ్రీ చైతన్య విద్యాలయంలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు

నవతెలంగాణ - బోనకల్

మండల పరిధిలోని చైతన్య విద్యాలయంలో పదో తరగతి విద్యార్థులకు మంగళవారం 9వ తరగతి విద్యార్థులు ఘనంగా వీడ్కోలు నిర్వహించారు. ఈనెల 18వ తేదీ నుంచి 10వ తరగతి పరీక్షలో జరగనున్నాయి దీంతో ప్రతి సంవత్సరంలాగే ఈ సంవత్సరం కూడా శ్రీ చైతన్య విద్యాలయంలో పదో తరగతి విద్యార్థులకు మిగిలిన విద్యార్థులు ఘనంగా వీడ్కోలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక పోటీలను నిర్వహించారు. అనంతరం కరస్పాండెంట్ షేక్ హుస్సేన్ మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులు మంచి ఫలితాలను సాధించి చైతన్య విద్యాలయానికి మండల స్థాయిలో మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఏడాది పాటు పడిన కష్టానికి ఫలితం దక్కనున్నదని, ప్రతి విద్యార్థి పట్టుదలతో, క్రమశిక్షణతో చదివి మంచి ఫలితాల సాధనే లక్ష్యంగా చదువుకోవాలని సూచించారు. మండల స్థాయిలో చైతన్య విద్యాలయానికి ప్రతి సంవత్సరం మంచి ఫలితాలు వస్తున్నాయని, ఈ సంవత్సరం కూడా అదే విధంగా విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలన్నారు. 10వ తరగతిలో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థి భవిష్యత్తులో ఉన్నత స్థానానికి ఎదుగుతారన్నారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కొండ ప్రేమ్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. మండల పరిధిలోని చిరునోముల ఉన్నత పాఠశాలలో కూడా 10వ తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు నిర్వహించారు ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ కళా సాంస్కృతిక రూపాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సత్తెనపల్లి దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మండల పరిషత్ కార్యాలయంలో తనిఖీ

నవతెలంగాణ-ముదిగొండ

మండల కేంద్రమైన ముదిగొండ మండల పరిషత్ కార్యాలయాన్ని జిల్లా ప్రజా పరిషత్ (జెడ్పి) ముఖ్యకార్యనిర్వహణ అధికారి (సిఈవో) ఎస్.వినోద్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ సిబ్బంది సకాలంలో విధులకు హాజరవుతున్నారా. ..లేదా..అనే విషయంపై ఆయన ఆరా తీసి రికార్డులను తనిఖీ చేశారు. ప్రజాపాలన సేవా కేంద్రం, ఉపాధి హామీ కూలీల వివరాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మండల అధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ యస్.శ్రీధరస్వామి, ఎంపిఓ పి.సూర్యనారాయణ, ఈజిఎస్ ఏపిఓ అడపాల రంగనాయకమ్మ కార్యాలయం పర్యవేక్షకులు పి శ్రీనివాసరావు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులపై కోపతాపాలు, ఈసడింపులు పడకండి

- సనాతన ఆయుర్వేద వైద్యురాలు సుధారాణి
- సుధా ఛారిటబుల్ ట్రస్ట్ దుప్పట్లు పంపిణీ

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లికి చెందిన సుధా హెర్బల్ ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకురాలు, సనాతన ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ కొనకళ్ల సుధారాణి వేంసూరు మండలం కందుకూరు గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన 30 మంది వృద్ధ మహిళలకు మంగళవారం దుప్పట్లు పంచారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ వృద్ధులను చిన్నచూపు చూడరాదని, ఒకప్పటికి మనం కూడా వృద్ధులము కాకపోమన్నారు. వయసులో ఉన్న సమయంలో మన బాగోగులు కోసం పరితపించి జీవిత చరమాంకానికి చేరి తమ వ్యక్తిగత పనులు కూడా చేసుకోలేని స్థితిలో ఉన్న వృద్ధులపై ఈసడింపులు, కోపతాపాలు పడితే వారిలో ఆత్మన్యూనత భావం ఏర్పడి కృంగి పోతారన్నారు. ఈ నేపథ్యంలో వారిని జాగ్రత్తగా చూసుకోవాల్సిన బాధ్యత వారి కుటుంబాలకు తప్పక ఉండాలన్నారు. వృద్ధులయ్యారని వారిని అనేకన్నా వారికి నిలువెత్తు అనుభవముందని తెలుసుకోవాలన్నారు. కుటుంబాల్లో సంకట పరిస్థితులు ఏర్పడిన సందర్భాల్లో వృద్ధులకు ఏం తెలుసులే అని అనుకోకుండా వారినుంచి సలహాలు తీసుకుంటే పరిష్కార మార్గాలు ఇట్టే చెబుతారని సుధారాణి అన్నారు. వృద్ధులకు దుప్పట్లు పంచడం ఎంతో సంతోషంగా ఉందని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.

పేదల సొంతింటికల సాకారం చేస్తా...

- ఇందిరమ్మ ఇండ్ల మంజూరికి కృషి
- ఎమ్మెల్యే కూనంనేని



నవతెలంగాణ-కొత్తగూడెం

పేదకుటుంబాలు కోరుకునే సొంతింటి కలను సాకారం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. పట్టణంలోని పాత కొత్తగూడెంలో 807 మంది పేద కుటుంబాలకు ఒక్కొక్కరికి 75గజాల ఇండ్ల స్థలాలను మంగళవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ పేదలు తమకు సొంతిల్లు కావాలని కోరుకుంటారని దాన్ని నెరవేర్చే భాద్యత ప్రజా ప్రతినిధులుగా తమపై ఉంటుందని అన్నారు. నియోజకవర్గంలో పేదలకు ఇండ్ల స్థలాల కోసం పోరాడి అనేక కాలనీలు నిర్మించిన చరిత్ర సీపీఐ దేనన్నారు. పేదల కోసం పాత కొత్తగూడెంలో కేటాయించిన స్థలంలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ కాపు సీతాలక్ష్మి, తహసీల్దార్ పుల్లయ్య, డిఎస్పి రహమాన్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె.సాబీర్ పాషా, మున్సిపల్ కమిషనర్ శేశాంజనేయ స్వామి, పలువురు వార్డు కౌన్సిలర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



ధరణి సమస్యలను పరిష్కరించాలి

- రైతు సంఘం నాయకులు పుల్లయ్య

నవతెలంగాణ-అశ్వారావుపేట

సమగ్ర భూ సర్వే జరిపి రైతులు ఎదుర్కొంటున్న ధరణి సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కె.పుల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. హైదరాబాద్, సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం పోతినేని సుదర్శన్ రావు అధ్యక్షతన నిర్వహించిన రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల రాష్ట్ర స్థాయి సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. 2011 చట్టం ప్రకారం కార్డులను ఇచ్చినప్పటికీ, పట్టా దారులకు వ్యతిరేకంగా ఎలాంటి సాక్ష్యంగా చెల్లదు అని ఉన్నందున, ఒక సంవత్సరానికి సంబంధించి బ్యాంకు రుణాలు, పంటల బీమా, ప్రభుత్వ పరిహారాలు, పంటల అమ్మకాలు మాత్రమే ఉపయోగపడతాయి కాబట్టి గ్రామ సభలు జరిపి ప్రతియేటా మే చివరి నాటికి కౌలు దారులకు కార్డులు ఇవ్వాలని, ప్రస్తుతం ధరణిలోని లోపాలను సవరించడానికి కొత్తగా సవరణ చట్టాలు చేయాలి కోరారు. ధరణి వెబ్సైట్ అమలులోకి వచ్చిన తర్వాత ప్రభుత్వం చేసిన లోపాలు అన్నీ ఒక్కొక్కటిగా బయటికి వచ్చాయి అన్నారు. ఈ సదస్సులో రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్, వ్యకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట రాములు, జూలకంటి రంగా రెడ్డి, సారం పల్లి మల్లారెడ్డి, బుర్రి ప్రసాద్‌లు పాల్గొన్నారు.

కథ సుఖాంతం...

- అందర్నీ తట్టి లేపిన 'సేవ్ కొత్తగూడెం సేవ్ మున్సిపాలిటీ' పోరాటం
- ఫలించిన 800 మంది లబ్దిదారులకు స్థలాల పంపిణీ
- పోరాటానికి మద్దతు తెలిపిన కాంగ్రెస్, సీపీఐ, సీపీఐ(ఎం)

నవతెలంగాణ-కొత్తగూడెం

కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో 36 వార్డుల్లో 800 మంది నిరుపేద లబ్ధిదారులకు గత ప్రభుత్వం 75 గజాల చొప్పున స్థలానికి పొజిషన్ పట్టాలు మంజూరు చేసింది. పట్టాలు పంపిణీ చేసిన ఆరు నెలల్లో నిర్మాణాలు చేపట్టాల్సిన అవసరం ఉంది. వెంటనే అసెంబ్లీ ఎన్నికలు రావడం జరిగింది. అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం కుప్పకూలడం. నియోజకవర్గంలో వనమా వెంకటేశ్వరరావు ఓడిపోయారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మున్సిపల్ పాలకవర్గం సంబంధిత రెవెన్యూ అధికారులు సైతం, ఆ స్థలాల పంపిణీ చేయకుండా కాలయాపన చేశారు. ఈ తరుణంలో "సేవ్ కొత్తగూడెం సేవ్ మున్సిపాలిటీ" పేరుతో జలాల్ లబ్ధిదారులకు స్థలాలు ఇవ్వాలని పోరాటానికి రూపకల్పన చేయడం మొదలు పెట్టారు. ఆ పోరాటానికి బీఎస్పీ పార్టీ రాష్ట్ర నాయకుడు ఎర్ర కామేష్, ప్రముఖ అడ్వకేట్ ఎస్.కె సాధిక్ పాష మద్దతు ప్రకటించి పోరాటంలో తోడుగా నడిచారు. దిగివచ్చిన మున్సిపల్ పాలకవర్గం 25 రోజుల్లో స్థలాలను పంపిణీ చేస్తామని హామీ ఇచ్చి చేతులు దులుపుకున్నది. పోరాటంలో కలెక్టర్ ప్రియాంక అలా వద్దకు లబ్ధిదారులను తీసుకెళ్లి సమస్యను వివరించగా తక్షణమే పరిష్కరించమని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం స్థలాలు లబ్ధిదారులకు అందజేశారు. దీంతో కథ సుఖాంతం అయినట్లయింది. పోరాటానికి అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలిపి పేదలకు అండగా నిలబడాలని సోషల్ మీడియా వేదికగా కోరాం. కాంగ్రెస్ పార్టీ నాయకుడు నాగ సీతారాములు స్పందించారు. లబ్ధిదారులకు న్యాయం చేయకపోతే ప్రభుత్వం తరపున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. సీపీఐ, సీపీఐ(ఎం) పార్టీలు స్థల పరిశీలన ద్వారా అధికారులను, పాలకవర్గానికి డిమాండ్ చేయడంతో పోరాటం విజయవంతమైందని జలాల్ తెలిపారు. సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో ఇలాంటి ప్రజా పోరాటాలు మరెన్నో చేయాలని విజ్ఞప్తి చేశారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన జారే



నవతెలంగాణ-దమ్మపేట

మండలంలో వివిధ గ్రామాల్లో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు అశ్వారావుపేట శాసనసభ్యులు జారె ఆదినారాయణ మంగళవారం లబ్ధిదారుల ప్రతి ఇంటికి వెళ్లి స్వయంగా చెక్కులు పంపిణీ చేశారు. మీ ఇంటికి మీ ఎమ్మెల్యే కార్యక్రమం 7వ రోజులో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. కాగా ఈ చెక్కులు పంపిణీ కార్యక్రమంలో పలువురు మహిళలు తమకు ఇల్లు లేవని ఇందిరమ్మ సైతం మంజూరు చేయించాలని జారెను కోరగా ఆయన స్పందిస్తూ కార్యక్రమం ప్రారంభమైందని అశ్వారావుపేట నియోజకవర్గానికి 3500 ఇల్లు మంజూరయ్యాయని వాటిని అర్హులకు కేటాయించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దమ్మపేట తహశీల్దార్ నరేష్, ఎంపీపీ సోయం ప్రసాద్, సొసైటీ చైర్మన్ ఎల్లిన రాఘవరావు, ఎర్ర వసంతం, ఆలపాటి రామచంద్రప్రసాద్, రావు గంగాధర్‌రావు, ఎర్రగొర్ల రాదయ్య, సాయిల నర్సి, చిన్నంశెట్టి యుగంధర్, పర్వతనేని ప్రసాద్, నూనె శ్రీను, గోపిశాస్త్రి, కక్కిరాల రమేష్, సునగాని శ్రీధర్, రొయ్యల కుమార్, ముళ్ళపూడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రవేత్తలతో రైతులకు ముఖాముఖీ

నవతెలంగాణ-టేకులపల్లి

మండలంలోని ముత్యాలంపాడు క్రాస్ రోడ్డు సమీపంలో గల రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు రైతులతో ముఖముఖ కార్యక్రమం మంగళవారం నిర్వహించినట్లు తెలిపారు. మామిడి తోటలో వచ్చే తెగుళ్ళు, నివారణ, అధిక ఉష్ణోగ్రత వలన పంటలలో కలిగే మార్పుల గురించి వివరించారన్నారు. ప్రతి మంగళవారం రైతులు తమ పంటలకు సంబందించిన విషయాలను తెలుసుకొనే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఏఓ వి.బాబురావు, ఏడీఏపీపీ వాసవి, ఏఎయు అన్నపూర్ణ, ఈడీఈలు శ్రావణి, రమేష్, రెహనా, ప్రవీణ్, వంశీ రైతులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ టాలెంట్ టెస్టులో హిమశ్రీ ప్రతిభ

నవతెలంగాణ-ములకలపల్లి



కొత్తగూడెం కేంద్రంలో ఎస్ఎఫ్ఎఐ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎస్ఎస్సీ టాలెంట్ టెస్టులో ములకలపల్లి శివాలయం అర్చకులు విసావజ్జుల సురేశ్ శర్మ కుమార్తె హిమశ్రీ అత్యంత ప్రతిభ కనబర్చారు. టాలెంట్ టెస్టు 2 జిల్లాలో ద్వితీయ స్థానంలో నిలిచి రూ.3వేల నగదు బహుమతి, మెమెంటో, ప్రశంసాపత్రాన్ని నిర్వాహకుల నుంచి అందుకున్నారు. హిమశ్రీ ప్రతిభను పలువురు అభినందించారు.

ఎన్నికల బాండ్ల వివరాలు బహిర్గతం చేయాలి

- ఎస్‌బిఐ ఎదుట సీపీఐ(ఎం) ధర్నా



నవతెలంగాణ -బూర్గంపాడు

ఎన్నికల బాండ్ల వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని సారపాకలో గల ఎస్బిఐ బ్యాంకు ఎదుట ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వంను సుప్రీంకోర్టు ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన బ్రాంచ్ ఎన్నికల బాండ్ల వివరాలను తెలపాలని చెప్పినా పట్టించుకోవటం లేదని ఆయన విమర్శించారు. కోట్లాది రూపాయలని బాండ్ల ద్వారా తెచ్చుకొని వచ్చే 2024లో ఎన్నికల్లో మళ్ళీ ప్రజల్ని మోసం చేసి డబ్బులు పంచి గద్దినెక్కాలని చూస్తున్న మోడీ ప్రభుత్వానికి ప్రజలు రానున్న రోజులలో సరైన గుణపాఠం చెబుతారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు రాము, ఎస్.కె ఆబీద, నాగమణి, వెంకటమ్మ పాల్గొన్నారు.

భద్రాద్రి అభివృద్ధికి గ్యారెంటీ ఏది?



- భద్రగిరి ప్రజలకు మరోసారి తప్పని ఎదురుచూపులు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలానికి ముఖ్యమంత్రి పర్యటన ఖరారు అయిన నాటి నుండి ఈ ప్రాంత ప్రజలలో రేకెత్తిన ఆశలు అడియాశ లేనా అన్న ప్రశ్న తెలిత్తుంది. గత ప్రభుత్వం భద్రాద్రి రామయ్యను విస్మరించారని నూతనంగా ఏర్పడ్డ ప్రభుత్వమైన రామయ్యకు మంచి ఘడియలు తీసుకొస్తారని అనుకున్న వారికి ఎదురుచూపులే మిగిలాయి. 6 గ్యారంటీలలో ఐదవ గ్యారెంటీని భద్రాచలంలో ప్రారంభించిన ముఖ్యమంత్రి భద్రాద్రి అభివృద్ధికి మాత్రం ఎటువంటి గ్యారెంటీ చూపించకపోవడంతో ఈ ప్రాంత ప్రజల్లో తీవ్ర నైరాష్యం నెలకొంది. ముఖ్యమంత్రి కంటే ముందు మాట్లాడిన జిల్లా మంత్రులు సైతం ముఖ్యమంత్రి నూట రామాలయ అభివృద్ధి మాట వస్తుందని ప్రకటించినప్పటికీ రేవంత్ రెడ్డి రామాలయ అభివృద్ధిపై ప్రస్తావన తీసుకురాలేదు. ముఖ్యమంత్రి పర్యటన ఉన్న నేపథ్యంలో ఈనెల ఆరో తారీఖునే దేవదాయ శాఖ అధికారులు జిల్లా మంత్రులను కలిసిన సందర్భంలో కూడా రామాలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయమని మంత్రులు అధికారులు ఆదేశించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి పర్యటనలో ఆ ప్రకటన కార్యరూపం దాల్చుందని రామయ్య భక్తులతో పాటు ఈ ప్రాంత ప్రజలు ఆశించారు. గతంలో ప్రకటించిన రిటైనింగ్ వాళ్ల ప్రస్తావన వినాయిస్తే రామాలయ అభివృద్ధి స్పష్టమైన ప్రకటన గాని విభజన సమస్యలు గాని ప్రస్తావించకపోవడం కేవలం గత ప్రభుత్వం చేసిన తప్పులను ఎత్తిచూపుతూ రాష్ట్ర వ్యాప్తంగా అమలవుతున్న సంక్షేమ పథకాలను ప్రస్తావిస్తూ ముఖ్యమంత్రి ప్రసంగం కొనసాగిందే తప్ప ప్రత్యేకించి భద్రాచలంపై ఎటువంటి ప్రకటన చెయ్యలేదు. ముఖ్యమంత్రి పర్యటనపై రాజకీయ పక్షాలలో కూడా భిన్న అభిప్రాయాలు వస్తున్న నేపథ్యంలో జిల్లా మంత్రులైన కల్పించుకొని ఈ ప్రాంత సమస్యలపై నిర్దిష్టమైన ప్రకటన పార్లమెంట్ ఎన్నికలలోపే చేయిస్తేనే కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో ఈ ప్రాంతం నుండి ఆశించిన స్థాయిలో మద్దతు లభిస్తుందని వివిధ పార్టీల రాజకీయ నాయకులు అభిప్రాయపడుతున్నారు.

నివేదిక సిద్ధం చేసిన వెంటనే నిధులు మంజూరు చేయాలి

కాంగ్రెస్ భద్రాచలం పట్టణ అధ్యక్షులు సరళ నరేష్



జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు దేవదాయ శాఖ అధికారులు, ఇరిగేషన్, రెవిన్యూ అధికారులు సమన్వయంతో భద్రాచల అభివృద్ధితో పాటు రామాలయ అభివృద్ధికి నిర్దిష్టమైన నివేదికలు తయారు చేయాలి. అదేవిధంగా రామాలయ అభివృద్ధికి స్థల సేకరణ కూడా చేపట్టాలని ఆలయ పరిసర ప్రాంత అభివృద్ధికి సుమారు 180 కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. నివేదికల సిద్ధమైన వెంటనే నిధులు విడుదల చేస్తానని రేవంత్ రెడ్డి స్పష్టమైన హామీ ఇచ్చారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ గెలిచిన వెంటనే పార్లమెంటులో ఐదు పంచాయతీల కోసం పోరాడి తిరిగి భద్రాచలంలో కలపడానికి కృషి చేస్తారు.

గత ప్రభుత్వాన్ని విమర్శించడం కాదు మీరేం చేస్తారో నిర్దిష్టంగా చెప్పాలి

- బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు రావులపల్లి రాంప్రసాద్



ముఖ్యమంత్రి పర్యటన మొత్తం గత ప్రభుత్వాన్ని విమర్శించడానికి ఉపయోగించుకున్నారే తప్ప భద్రాచలం అభివృద్ధిపై నిర్దిష్టమైన ప్రకటన చేయకపోవడం సరైనది కాదు. భద్రాచలం ముప్పు నుండి కాపాడేందుకు గత ప్రభుత్వంలో అప్పటి మంత్రి కేటీఆర్ కేటాయించిన రూ.33 కోట్లతో కరకట పునర్మాణ పనులు జరుగుతున్నాయి అన్న విషయాన్ని ప్రభుత్వ పెద్దలు గుర్తించాలి. ఇప్పటికైనా జిల్లా మంత్రులు మేలుకొని రామాలయ అభివృద్ధితో పాటు ఐదు పంచాయతీలు భద్రాచలం అభివృద్ధిపై స్పష్టమైన ప్రకటన చేయకపోతే ఈ ప్రాంత ప్రజల ఆగ్రహానికి కాంగ్రెస్ పార్టీ గురికాక తప్పదు.

భద్రాచలం సమస్యపై సీఎం స్పష్టమైన ప్రకటన చేయాలి



ముఖ్యమంత్రి పర్యటన పై ఈ ప్రాంత ప్రజలు పెట్టుకున్న ఆశలు నెరవేరినట్టుగా కనిపించడం లేదు. ఈ ప్రాంత సమస్యలను ముఖ్యమంత్రి ప్రస్తావించారే తప్ప పరిష్కరించేందుకు నిర్దిష్టమైన ప్రకటన చేయకపోవడం శోచనీయం. ప్రత్యేకించి ఐదు పంచాయతీలను భద్రాచలం కలపడం గురించి గానీ ముంపు సమస్య నుండి శాశ్వత పరిష్కారం మార్గాలను గాని రామాలయ అభివృద్ధికి నిర్దిష్టమైన ప్రణాళిక గాని ముఖ్యమంత్రి ప్రకటించకపోవడంతో గత ప్రభుత్వం మాదిరిగానే ఈ ప్రభుత్వం కూడా నిర్లక్ష్య వైఖరి అవలం బిస్తుందేమో అనిపిస్తుంది. జిల్లా మంత్రులు వెంటనే కల్పించుకొని నిర్దిష్టమైన ప్రకటన చేయించకపోతే సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని మరోసారి ఉద్యమాలకు శ్రీకారం చుడతం.

- సీపీఐ(ఎం) నియోజకవర్గ కన్వీనర్ మచ్చ వెంకటేశ్వర్లు

మతాల మధ్య చిచ్చుపెట్టే సీఏఏ బిల్లును వెనక్కి తీసుకోవాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బి.నర్సారెడ్డి



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఎన్నికల ఎత్తుగడలో భాగంగా రెండు మూడు రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని తెలిసి కేవలం ఓట్లు దండుకోవటం కోసం సీఏఏ బిల్లును వెంటనే అమలు జరపాలని నిర్ణయించడం దురదృష్టకర విషయం అని సీపీఐ(ఎం) జిల్లా కార్యవర్గ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బి.నర్సారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 2014 డిసెంబర్ 31 తరువాత వచ్చిన వారికి అంతకుముందు నివాసం ఉన్నవారికి కేవలం ఒక మతం వారిని కాకుండా వేరే మతాల వారికి పౌరసత్వం కొనసాగించమని చెప్పటం చాలా దురదృష్టకరమన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు ఈ బిల్లును వ్యతిరేకిస్తూ బీజేపీకి గట్టిగా గుణపాఠం చెప్పాలన్నారు. ఇది లౌకికవాద దేశమని దానికి అనుగుణంగా రాజ్యాంగానికి కట్టుబడి పరిపాలన కొనసాగించాలని బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకపోతే పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు కొనసాగిస్తామని నర్సారెడ్డి హెచ్చరించారు.

ద్విచక్రవాహనం చోరీ

నవతెలంగాణ-ములకలపల్లి

గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్రవాహనం చోరీ చేసిన సంఘటన మండల పరిధిలోని మాధారంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మాధారం గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబుకు చెందిన ద్విచక్రవాహనం ఇంటి ముందు ఉంచగా రాత్రి సోమవారం రాత్రి 12 గంటలు దాటాక గుర్తుతెలియని దొంగలు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు రాంబాబు తెలిపారు.

రైల్వే స్టేషన్‌లో మౌళిక వసతులు కల్పించాలి

- రైల్వే ప్రాజెక్టు ప్రారంభోత్సవ సభలో ఎమ్మెల్యే



నవతెలంగాణ-మణుగూరు

మణుగూరు రైల్వే స్టేషన్ ప్రయాణికులకు మౌళిక వసతులు, రూమ్స్ ఏర్పాటు చేయాలని పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు రైల్వే ఏరియా అధికారి రజినిష్ కుమార్ మీనాను కోరారు. మంగళవారం మణుగూరు రైల్వే స్టేషన్ బొగ్గు లోడింగ్ ఏరియాలో రైల్వే అధికారులు రైల్వే ప్రాజెక్టుల ప్రారంభోత్సవ వేదిక ఏర్పాటు చేశారు. దేశ వ్యాప్తంగా వర్చువల్‌గా ప్రధానమంత్రి నరేంద్రమోదీ రూ.85 వేల కోట్లకు పైగా విలువైన రైల్వే ప్రాజెక్టులను వీడియో కాన్ఫరెన్సింగ్ మాధ్యమం ద్వారా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పాయం మాట్లాడుతూ మణుగూరు రైల్వే స్టేషన్లలో మిగిలిపోయిన మౌళిక వసతులను కల్పించి ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా రూమ్స్ ఏర్పాటు చేయాలని కోరారు. పాత రూములను ఆధునికరించి ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. భద్రాచలంలో కొలువై ఉన్న శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంను దక్షిణ అయోధ్యగా పిలవబడుతుందన్నారు. పాండురంగాపురం నుండి సారపాక వరకు రైల్వే మార్గం నిర్మించాలని గత అనేక సంవత్సరాలుగా డిమాండ్‌లో ఉందని గుర్తు చేశారు. దీనిపై కేంద్రం కొంత బడ్జెట్ కేటాయించి సర్వేలు చేసి మధ్యలో నిలుపుదల చేశారని ఆయన తెలిపారు. ఆ ఫైల్స్‌ను రైల్వే ఏరియా అధికారులు కేంద్రం దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. సికింద్రాబాద్ రైల్వే మేనేజర్‌కు పాండురంగాపురం నుండి సారపాక వరకు రైల్వే లైన్ నిర్మించాలని మెమోరాండం అందిస్తానని తెలియజేశారు. అనంతరం మణుగూరులో రైల్వే గూడ్స్ షెడ్ నిర్మాణం చేపట్టేందుకు రైల్వే అధికారులతో కలిసి స్విచ్ నొక్కి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చందా సంతోష్ కుమార్, కాటిబోయిన నాగేశ్వరరావు, పిరినాకి నవీన్, రైల్వే ఏరియా అధికారి రజినిష్ కుమార్ మీనా, ఇన్స్పెక్టర్ ఆఫ్ ప్రొటెక్షన్ ఫోర్స్ గిరియా, చీఫ్ కమర్షియల్ ఇన్స్పెక్టర్ జేమ్స్ పాల్, సీనియర్ సెక్షన్ ఇంజనీర్స్ ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ అధికారి ప్రసాద్, టి.వీరన్న, జోక్యం, శిరీష, దండురాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ అభివృద్ధికి ఎస్ఎఫ్ఐ చేస్తున్న కృషి విశేషమైనది

- తెలంగాణ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీ



నవతెలంగాణ-కొత్తగూడెం

కొత్తగూడెం పట్టణ కేంద్రంలోని పాత కొత్తగూడెం తెలంగాణ హైస్కూల్‌లో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ ఫిబ్రవరి 26న నిర్వహించిన జిల్లా స్థాయి టాలెంట్‌లో రాణించిన విద్యార్థులకు మంగళవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభా కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బయ్యా అభిమన్యు అధ్యక్షత వహించారు. జిల్లాలో శ్రీవిద్య, త్రివేణి, సెయింట్ జోసెఫ్ పాఠశాలల విద్యార్థులు వి.నయిషా, వి.హిమశ్రీ, ఎం.సాయి అవినాష్ మొదటి, ద్వితీయ, తృతీయ స్థానం సాధించారు. నగదు బహుమతులు రూ.5 వేలు, మూడు వేలు, పదిహేను వందలు పొందారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీ, పాఠశాల ఉపాధ్యాయురాలు మాధవీలత, ఇల్లందు గౌతమ్ బుద్ధ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ అనిల్ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుల్లో రాణించాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. రానున్న పదవ తరగతి పరీక్షలు విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు తొలిమెట్టు అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.వీరభద్రం మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా ఎస్ఎఫ్ఐ టాలెంట్ నిర్వహిస్తుందని, విద్యార్థులలో దాగిఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు, పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు, విద్యార్థులను మానసికంగా దృఢంగా తయారుచేసేందుకు, వివిధ రకాల టీఎస్ ఆర్జేసీ పాలీసెట్ వంటి అనేక రకాల పోటీ పరీక్షలకు ఉపయోగపడేలా పరీక్ష నిర్వహించామని, జిల్లా వ్యాప్తంగా 167 పాఠశాలల నుండి సుమారు 7000 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. సహకరించిన ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాలకు, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్.రామ్ చరణ్, పాఠశాలల ఉపాధ్యాయులు రూపా, అనోయిషీ, రవి, జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జారె ఆర్థిక సాయం

- నవతెలంగాణ కథనానికి స్పందన



ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు



నవతెలంగాణ-దమ్మపేట

వెన్నుపూసకు గాయమై చలనం కోల్పోయిన యువకుడు పడుతున్న ఇబ్బందులను నవతెలంగాణలో 'ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ స్పందించి యువకునికి ఆర్థిక సహాయం చేశారు. మీ ఇంటికి మీ ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా మండల పర్యటనలో ఉన్న ఆయన మండలంలోని రంగువారిగూడెం గ్రామానికి చెందిన యర్రా రాంబాబు దీన స్థితిని నవతెలంగాణ కథనం ద్వారా తెలుసుకోగా మంగళవారం అతన్ని పరామర్శించారు. కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగించే రాంబాబు స్లాబ్‌కూలి మీద పడిన ప్రమాద సంఘటనలో తీవ్రంగా గాయపడి అచేతనంగా మంచానికే పరిమితమయ్యాడు. ఈ క్రమంలో రాంబాబుతో మాట్లాడిన జారె ఆరోగ్య వివరాలను తెలుసుకున్నారు. వైద్యం నిమిత్తం నగదు ఆర్థిక సహాయం చేశారు. అంతే కాకుండా మెరుగైన వైద్యం కోసం సహకరిస్తానని రాంబాబు కుటుంబానికి ఎమ్మెల్యే జారె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అనుచరుడు మండల కాంగ్రెస్ నాయకుడు పర్వతనేని వరప్రసాద్ ఉన్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా టాలెంట్ టెస్ట్‌లో మెరిసిన బ్రిలియంట్ విద్యార్థులు



నవతెలంగాణ-బూర్గంపాడు

రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ 10వ తరగతి విద్యార్థుల ప్రతిభను వెలికితీసే విధంగా అత్యున్నత వేదికగా ఉండాలని టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. జిల్లాలో ఎస్ఎఫ్ఐ పదవతరగతి విద్యార్థులకు నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో బ్రిలియంట్ విద్యార్థులు తమ ప్రతిభను ఘనంగా చాటారు. జిల్లా వ్యాప్తంగా టాలెంట్ టెస్ట్‌లో జిల్లాలో వివిధ ప్రభుత్వ ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ టాలెంట్ టెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థుల్లో బ్రిలియంట్ విద్యార్థులు కె.సతీష్ గౌడ్, కె.నవనీత్ కుమార్, జిల్లా మెరిట్ ర్యాంకులు సాధించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను బ్రిలియంట్ విద్యా సంస్థల చైర్మెన్ బీఎస్ఆర్ బహుమతులతో సత్కరించి, రాబోయే పబ్లిక్ పరీక్ష పదవతరగతిలో మంచి మార్కులు సంపాదించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకు రావాలని విద్యార్థులను కొనియాడారు.

కొత్త సమస్యలు సృష్టించడం సరికాదు

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏ.జె.రమేష్, అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.పద్మ
- మండుటెండలో కలెక్టరేట్ ఎదుట అంగన్వాడీలు భారీ ప్రదర్శన, ధర్నా
- అధికారులకు మెమోరండం అందజేత




నవతెలంగాణ-పాల్వంచ

కొత్తగా ఏర్పాటైన రాష్ట్ర ప్రభుత్వం ఉన్న సమస్యలను పరిష్కారం చేయకుండా, కొత్త సమస్యలను సృష్టిస్తుందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏ.జె.రమేష్, తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.పద్మ విమర్శించారు. మంగళవారం అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన, కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అంగన్వాడీ టీచర్లకు 5జి టెక్నాలజీ ట్యాబ్ ఇవ్వాలని, మే నెల మొత్తం టీచర్లు, హెల్పర్లకు ఒకేసారి వేసవి సెలవులు ఇవ్వాలని, అంగన్వాడీ కేంద్రాల్లో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ కేంద్రాలకు చీపిరి కట్టలు, వంట పాత్రలు వంటి కనీస సౌకర్యాలు కల్పించాల్సిన పరిస్థితి మర్చిపోయి సీసీ కెమెరాలు బయోమెట్రిక్ విధానాలను ప్రవేశపెట్టడం సరైనది కాదన్నారు. గత ప్రభుత్వ కాలంలో సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు చేసిన సమ్మెలను పోరాటాలను నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రులుగా ఉన్న వారంతా బలపరిచారని గుర్తు చేశారు. తమ అధికారంలోకి వస్తే ఈ సమస్యలన్నీ పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను మర్చిపోయి కొత్త సమస్యలను తీసుకొచ్చి అంగన్వాడీ సిబ్బంది రోడ్డెక్కి ఆందోళన చేయాల్సిన పరిస్థితిని ప్రభుత్వం కల్పిస్తుందని విమర్శించారు. ప్రభుత్వం సమస్యల పరిష్కారం కోసం యూనియన్‌లతోటి చర్చలు జరిపి ఐసీడీఎస్ బలోపేతానికి ఉపయోగపడే నిర్ణయాలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడి కేంద్రాలకు అందిస్తున్న పోషకాహారం నాణ్యత సక్రమంగా ఉండటం లేదని సకాలంలో పౌష్టికాహారం రావటం లేదని ప్రభుత్వం మంచి పోషకాహారాన్ని అందించేందుకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.18000 ఇస్తామని అంగన్వాడీలకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని సమస్యలు పరిష్కారం చేస్తామని పేర్కొన్న కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తుందన్నారు. సమస్యలు పరిష్కారం చేయకపోతే పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కే.బ్రహ్మాచారి, జిల్లా సహాయ కార్యదర్శి డి.వీరన్న, కే.సత్య, జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్, పాయం రాధా కుమారి, అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఎం.విజయశీల జిల్లా నాయకురాలు కళావతి, రాధా, సూరమ్మ, హేమలత, కృష్ణవేణి, లలిత, మరియా, అచ్చమ్మ, రమ్య, శకుంతల, సారమ్మ ఫాతిమా, సావిత్రి, నిర్మల, భవాని, గజలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీఎం టూర్‌తో ప్రజలకు ఒరిగిందేమీ లేదు

- జిల్లాకు నిధులు తేవడంలో మంత్రులు, ఎమ్మెల్యేలు ఫెయిల్
- సోషల్ మీడియా వేదికగా మాజీ ఎమ్మెల్యే రేగా ఫైర్



నవతెలంగాణ-పినపాక

ఎంపీ ఎన్నికలలో కాంగ్రెస్‌ను ఓడిస్తేనే రైతులకు భవిష్యత్తు ఉంటుందని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, పినపాక మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావు అన్నారు. ఆయన మంగళవారం సోషల్ మీడియా వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వం పై మండిపడ్డారు. సీఎం పులుసుబొంత ప్రాజెక్టు ఫైల్ రెడీగా ఉందని మీ హామీలు నిజమైతే క్యాబినెట్‌లో పెట్టించండన్నారు. దమ్ముంటే ఆడబిడ్డలకు కల్యాణ లక్ష్మి డబ్బులతో పాటు తులం బంగారం, 18 సంవత్సరాల నిండిన బంగారు తల్లులకు రూ.2500 అమలు చేయాలన్నారు. అలాగే మిగిలిన భూములకు పోడు పట్టాలు ఇప్పించాలన్నారు. సీఎం మాటలన్నీ మేకపోతు గాంభీర్యంమే తప్ప ఏమీలేదన్నారు. జిల్లాకు నిధులు తేవడంలో స్థానిక మంత్రులు, ఎమ్మెల్యేలు పూర్తిగా విఫలమయ్యారన్నారు. మాటలు చెప్పడంలో కాదు చేతలలో చూపించాలన్నారు.

మొదలైన రంజాన్ ఉపవాస దీక్షలు

నవతెలంగాణ-పినపాక

నెలవంక దర్శనంతో రంజాన్ మాసం మంగళవారం నుండి ప్రారంభమైంది. మంగళవారం నుండి నెలరోజులపాటు ముస్లింలు రంజాన్ ఉపవాస దీక్షలు చేస్తారు. అదేవిదంగా ముస్లిం సోదరులకు, సోదరీమణులకు శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, తహసీల్దార్ సూర్య నారాయణ, ఎంపీవో వెంకటేశ్వరరావు, ఎఫ్ఆర్ఓ తేజస్విని, విద్యుత్ శాఖ ఏఈ కావ్య, మండల స్థాయి అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

సీపీఐ(ఎం) పోరాటాల ఫలితమే భూ పంపిణీ

- ఎమ్మెల్యే కూనంనేనికి అభినందనలు
- కనీస సౌకర్యాలు కల్పించాలి... పేదలను అభివృద్ధి పరచాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కనకయ్య


మాట్లాడుతున్న అన్నవరపు కనకయ్య

నవతెలంగాణ-కొత్తగూడెం

కొత్తగూడెం మున్సిపల్ పరిధి, పాత కొత్తగూడెంలో సీపీఐ(ఎం) పోరాట ఫలితంగా 39 ఎకరాల భూమిలో 87 మంది పేద ప్రజలకు 75 గజాల చొప్పున ఇండ్ల స్థలం ఇవ్వడం చాలా సంతోషకరమైన అంశమని స్థానిక ఎమ్మెల్యే కునంనేని సాంబశివరావుకి, పేదలకు అండగా నిలిచిన ప్రజా ప్రతినిధులకు అభినందనలు తెలియజేస్తున్నామని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ తరపున ఏర్పాటు చేసిన భూ పంపిణీ సభలో కనకయ్య మాట్లాడుతూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో 12 సంవత్సరాల సుదీర్ఘ పోరాట ఫలితంగా పాత కొత్తగూడెంలో పేదలకు ఇల్లు ఇవ్వాలని, డబల్ బెడ్ రూమ్‌లో కట్టించాలని, ఖాళీ స్థలాలు పేదలకు పంచాలని దశల వారి ఉద్యమాలు చేయడం ఫలితంగా నేడు భూ పంపిణీ కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. ప్రస్తుత స్థలంలో ఎటువంటి సౌకర్యాలు లేక లబ్ధిదారులు అనేక ఇబ్బందులు పడే అవకాశం ఉందని, మంచినీళ్ల, కరెంటు, రోడ్లు, కాలువలు, తదితర కనీస అవసరాలు, కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని స్థానిక ఎమ్మెల్యే కూనంనేని, ప్రజాప్రతినిదులని, ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన ఖాళీ స్థలంలో గృహలక్ష్మి పథకాన్ని సత్వరమే అమలు చేసి పేదలకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేదల సంతోషంగా ఉండాలి అంటే అన్ని రకాల సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేయాలని, చేసినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. పేదలకు ఉండడానికి ఇల్లు, కట్టుకోవడానికి బట్ట, తినడానికి తిండి సమపాళ్లల్లో ఏర్పాటు చేసినప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుందని నిజమైన అభివృద్ధి అక్కడ ఆవహించి ఉంటుందన్నారు. పట్టాలు అందిన పేదలతో సీపీఐ(ఎం) పార్టీ ప్రతినిధి బృందం కలిసి భూమి దక్కిన ప్రాంతం మొత్తం సందర్శించారు. పట్టాలు చూపిస్తూ పేదలు చాలా సంతోషకరమైన సమయమని అన్నారు. భవిష్యత్తులో ప్రజలకు అందరికీ అండగా పార్టీ అండగా ఉంటుందని సీపీఐ(ఎం) ప్రతినిధి బృందం ప్రజలకు హామీ ఇచ్చింది. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్, పట్టణ నాయకులు జునుమాల నగేష్, సందకూరి లక్ష్మి, నందిపాటి రమేష్, సుజాత, సుగుణ, రామా, బన్సీలాల్, వేణు, లక్ష్మి, రోజా, రామక్క తదితరులు పాల్గొన్నారు.



బస్సులు లేక వెలవెలపోతున్న ఆర్టీసీ డిపో, బస్టాండ్

- జీరో టికెట్లతో పెరిగిన రద్దీ : ప్రయాణికుల అవస్థలు
- పట్టించుకోని రీజియన్ అధికారులు



నవతెలంగాణ-ఇల్లందు

నియోజకవర్గ ప్రజల కోసం ఏర్పాటు చేసిన శాటిలైట్ బస్సు డిపో ఉండి లేనట్లుగానే ఉంది. సుమారు 600 గ్రామాలు, 8 మండలాలకు ఉపయోగపడాల్సిన శాటిలైట్ బస్ డిపో బస్సులు లేక వెలవెలబోతోంది. డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది, డిపోకు కావాల్సిన వసతులు ఉన్నప్పటికీ ఆర్టీసీ యాజమాన్యం తరాన్ని బస్సులు ఏర్పాటు చేయలేకపోతోంది. గత ఏడాది ఏర్పాటైన బస్ డిపోకు కొత్తగూడెం, ఖమ్మం డిపోల నుండి 28 కేటాయిస్తామని ప్రకటించి కేవలం 18 బస్సులు కేటాయించినట్లు తెలుస్తోంది. ఇవి కూడా ఏ డిపో నుండి వచ్చాయో ఆ డిపో పరిధిలోని బస్టాండ్ మధ్యనే తిరుగుతున్నాయి. దీనివల్ల నియోజకవర్గ ప్రజలకు ఉపయోగ లేకుండా పోయింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రవేశపెట్టడంతో రద్దీ విపరీతంగా పెరిగింది. కొత్తగూడెం, ఖమ్మం, హన్మకొండ బస్సుల కోసం ప్రయాణికులు గంటలకొద్దీ వేసి చూడాల్సిన పరిస్థితి దాపురించింది. సాయంత్రం 6 గంటలు అయితే చాలు మరి పరిస్థితి ఘోరంగా ఉంటుంది. ఒక్క బస్సు వస్తే వందలాది మంది ప్రయాణికులు ఎగబడుతున్నారు. ఈమధ్య హనుమకొండ కోరుట్ల, భద్రాచలం, మంథని డిపోల బస్సులు తగ్గించారు. సుదూరపురాంత ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

కాలం చెల్లిన బస్సులు నడిపిస్తున్న యజమాన్యం

ఖమ్మం-కొత్తగూడెం డిపో నుండి ఇల్లందుకు వచ్చిన బస్సులు కాలం చెల్లిన పాత బస్సులే. ఆదాయం దండిగా ఉన్నప్పటికీ కొత్త బస్సులు ప్రవేశపెట్టడం లేదు. చుట్టుపక్కల ఉన్న డిపోలన్నీ కొత్త బస్సులతో హైదరాబాదు, విజయవాడ, తిరుపతి, శ్రీశైలం, ఆదిలాబాద్, కరీంనగర్ ఇంకా అనేకమైన ప్రదేశాలకు వెళుతూ ఉంటాయి. కానీ ఇల్లందు డిపో మాత్రం లోకల్‌కే పరిమితమవుతుంది. దీనివలన ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. సుదీర్ఘ ప్రాంతాలకు వెళ్లాలంటే ప్రయివేటు వాహనాలు లేక ట్రైన్‌లో వెళ్లాల్సి వస్తుంది. ఆర్టీసీ యాజమాన్యం ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఇక రాబోయేది సమ్మర్ సీజన్ ప్రయాణికులకు ఇబ్బందులు పడకుండా ఇల్లందు డిపో నుంచి దూర ప్రాంతాలకు వెళ్ళటానికి స్పెషల్ బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ యాజమాన్యంతో పాటు, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రయాణికులంతా కోరుకుంటున్నారు.

కొత్త బస్సులు తెప్పించి, రూట్ల సంఖ్య పెంచండి



శాటిలైట్ బస్సు డిపోకు కేవలం 14 బస్సులే కేటాయించటం సరికాదు. కొత్త బస్సులో తెప్పించి మరిన్ని రూట్లలో బస్సు నడపాలి. గాంధీనగర్, కారేపల్లి, మౌబాద్ రైల్వే స్టేషన్లకు చేరుకోవడానికి ఉదయం 5 గంటలకు బస్సులు ఏర్పాటు చేయాలి.

- ప్రయాణికులు నాగేశ్వరరావు

రోడ్డు విస్తరణ 50 అడుగుల వెడల్పుతో ఉండాలి

- లెఫ్ట్ పార్టీ నాయకుల డిమాండ్



నవతెలంగాణ-ములకలపల్లి

రోడ్డు విస్తరణ 50 అడుగుల వెడల్పుతో ఉండాలని లెఫ్ట్ పార్టీ నాయకులు కోరారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మండల కేంద్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు కృషితో మండల అభివృద్ధి దృష్ట్యా డివైడర్ ఏర్పాటు కోసం 50 అడుగుల వెడల్పుతో నిధులు మంజూరయ్యాయన్నారు. నూతన ప్రభుత్వంలో మండల అభివద్ధిలో భాగంగా రోడ్లు, భవనాలశాఖ నిబంధన ప్రకారం రోడ్డు వెడల్పు చేయాలని, అంతేకానీ కొందరు వ్యక్తుల స్వప్రయోజనాల కోసం అభివృద్ధిని అడ్డుకోవడం దురదృష్టమని, ఆ దిశగా చర్యలు చేపట్టడం సరికాదని లెఫ్ట్ పార్టీల (సీపీఐ, సీపీఐ(ఎం), సీపీఐ ఎంఎల్ మాస్లైన్) నాయకులు నరాటి ప్రసాద్, ముదిగొండ రాంబాబు, నూపా భాస్కర్, ఎండి.యూసుఫ్‌లు డిమాండ్ చేశారు. అభివృద్ధిని అడ్డుకోకుండా రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, ప్రజాప్రతినిధులు స్వాగతించాలని కోరుతూ ఈ విస్తరణ విషయంలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ చొరవ చూపి 50 అడుగుల రోడ్ వెడల్పు చేసేలా అధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లాలన్నారు.



పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- ఎంపీపీ కోండ్రు మంజు భార్గవి
- ఉత్తమ ప్రతిభ చూపిన వారికి 10 వేలు నజరానా
- ఆశ్రమంలో ఘనంగా ఫేర్వెల్ వేడుకలు

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

రానున్న పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపి మంచి ఫలితాలు సాధించాలని స్థానిక ఎంపీపీ కోండ్రు మంజు భార్గవి అభిలషించగా, పది ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన వారికి ప్రోత్సాహకంగా 10 వేల నగదును నజరానాగా అందిస్తానని ఏటీడీఓ రూపాదేవి ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం మండల పరిధిలోని అనంతోగు బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఫేర్వెల్ వేడుకలు ప్రధానోపాధ్యాయులు బావుసింగ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏటీడీవో రూపాదేవి, స్థానిక ఎంపీపీ మంజు భార్గవి, ఎంఈఓ పి.కృష్ణయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మంచిగా చదివి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించి, తల్లిదండ్రులు, గురువులకు, పాఠశాలకు, ఊరికి గొప్ప పేరు ప్రఖ్యాతులు తేవాలని ప్రసంగించారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలలో పలువురు విద్యార్థినీలు నృత్య ప్రదర్శనలతో అలరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జోగా రాంబాబు, ఇస్లావత్ హతిరామ్, చాట్ల శ్రీనివాసరావు, బూక్యా రమేష్, కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

పదిలో ఉత్తీర్ణత జీవితానికి గొప్ప మలుపు : జీఎం

నవతెలంగాణ-మణుగూరు

పదవ తరగతిలో ఉత్తీర్ణత జీవితానికి గొప్ప మలుపు అని సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచంద్ర అన్నారు. పివి కాలనీ సింగరేణి పాఠశాలలో మంగళవారం 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం సింగరేణి పాఠశాల కరస్పాండెంట్ డిజిఎం(పర్సనల్) ఎస్.రమేశ్ అధ్యక్షతన జరగగా జీఎం పాల్గొని మాట్లాడారు. సింగరేణి పాఠశాలలు ఉన్నత ప్రామాణాల విద్యకు నిలయాలు ఉన్నాయన్నారు. సింగరేణి పాఠశాల పేరు ప్రతిష్టలు మరింతగా పెంచాలని సూచించారు. సింగరేణి పాఠశాల కరెస్పాండెంట్ డిజిఎం(పర్సనల్) ఎస్ రమేష్, పాఠశాల హెచ్ఎం స్వరూప రాణి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. సింగరేణి పాఠశాల హెచ్ఎం ఈజ్బిఎస్ స్వరూప రాణి మాట్లాడుతూ.. అనుభవజ్ఞులైన అధ్యాపకులు నిరంతరం ప్రత్యేక శ్రద్ధతో పదవ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేందుకు విద్యార్థినీ, విద్యార్థులను సంసిద్ధం చేయడానికి ఎంతో కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం వీసం కృష్ణయ్య, ఎక్సలెంట్ స్కూల్ కరెస్పాండెంట్ ఎండి యూసుఫ్, సింగరేణి పాఠశాల ఉపాధ్యాయులు, ఆర్.కల్యాణి, ఎస్.అనురాధ, ఎం.కృష్ణబాబు, ఉపాధ్యాయులు, ఉపాధ్యేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అడవి [illegible] పోరాటాలు,

- అటవీ ఆవాసాల్లో [illegible] బృందం
- [illegible]



[illegible]

రేషన్ డీలర్ల ఆధ్వర్యంలో జేసీకి సన్మానం



[illegible]

ముందస్తు అరెస్టులు, హౌస్ అరెస్టులు లేవు

- కాంగ్రెస్ మండల అధ్యక్షులు రామనాథం

[illegible]

ప్రారంభమైన కొండరెడ్ల జాతీయ మహాసభ



[illegible]



సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు ఇందిరమ్మ గృహాలు మంజూరు చేయాలి

నవతెలంగాణ-మణుగూరు

సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు ఇందిరమ్మ గృహాలు మంజూరు చేయాలని కాంట్రాక్ట్ కార్మికులు ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ ఏరియా అధ్యక్షులు ఏ.మంగీలాల్ మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో జీవితాలను వెళ్లదీస్తున్న సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు సొంత ఇల్లు అనేది ఒక కలగానే మిగిలిపోయిందని అన్నారు. హై పవర్ కమిటీ వేతనాలు అమలు అయ్యే విధంగా కూడా కృషి చేయాలని వారు పాయంని కోరారు. ఈ కార్యక్రమంలో కే.గురుమూర్తి, జి.నాగేశ్వరరావు, ఉప్పల శివరామకృష్ణ, ఎం.బ్రైసన్, కే.నాగరాజు, ప్రదీప్, డి.వెంకన్న ఎం.వెంకటేశ్వర్లు పెద్ద ఎత్తున కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఆర్టీసీ మెకానిక్ మృతి

- ఎమ్మెల్యే తెల్లం నివాళి

నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండలంలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన ఆర్టీసీ మెకానిక్ బంగారి రవికుమార్ (47) గత రెండు రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు మంగళవారం రామకృష్ణాపురం గ్రామం వెళ్లి రవికుమార్ పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించడంతోపాటు కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. రవికుమార్‌కు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. నివాళులు అర్పించిన వారిలో మండల బీసీ సెల్ అధ్యక్షులు బొల్లి శేఖర్, మండల నాయకులు రామిరెడ్డి తదితరులు ఉన్నారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు పట్ల హర్షం

నవతెలంగాణ-ఇల్లందు

సీఎం రేవంత్ రెడ్డికి ఇల్లందు మండల అధ్యక్షుడు గౌరీశెట్టి కృష్ణ (మాయ) ఆర్యవైశ్యుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో ప్రభుత్వ క్యాబినెట్ మీటింగ్‌లో ఆర్యవైశ్యుల చిరకాల కోరిక ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను ఆమోదిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆమోదించినందకు మండల పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గౌరిశెట్టి కృష్ణ, మణికిరణ్, వాసవి క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు పుల్లూరు సతీష్, యెలుగురి మధుబాబు, తదితరులు కృతజ్ఞతలు వ్యక్తం చేశారు.



జూలూరుపాడు : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మంగళవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ కోసం క్యాబినెట్ ఆమోదం తెలపడం పట్ల రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సభ్యులు పెండ్యాల విజయభాస్కర్ హర్షం వ్యక్తం చేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
9
ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం | మార్చి 13, 2024 | www.navatelangana.com



లెప్రసీ సర్వేకు పారితోషకం ఇవ్వాలి

- ఆశా యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంవి అప్పారావు
- డీఎంహెచ్ఓ శిరీషకు వినతి

నవతెలంగాణ-పాల్వంచ

లెప్రసీ ప్రోగ్రాం సర్వేలు నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చారు కానీ, 2022-23 సంవత్సరాలలో చేసిన లెప్రసీ సర్వేలకు సంబంధించిన పారితోషకాలు ఇప్పటివరకు ఇవ్వలేదు.. పల్స్ పోలియో పారితోషకాలు కూడా బకాయిలు ఉన్నాయి.. వాటిని తక్షణమే విడుదల చేయాలని ఆశ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంవి అప్పారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం డీఎంహెచ్ఓ శిరీషకు వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు ప్రస్తుత సర్వేలు నిర్వహించటం ఆశాలకు సాధ్యం కాదని అన్నారు. లెప్రసీ సర్వే పల్స్ పోలియో పారితోషకాలు ఇవ్వాలి, ఫిబ్రవరి నెల పారితోషకాలు చెల్లింపుకు చర్యలు తీసుకోవాలన్నారు. సర్వేకు సంబంధించిన రిజిస్టర్లు, చాక్ పీసులు, పెన్నులు, ఇవ్వాలన్నారు. సబ్ సెంటర్ ముందు పారిశుధ్య పనులు ఆశాలతో చేయించరాదన్నారు. కమిషనర్ గతంలో ఆశాలకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా జిల్లా కార్యదర్శి ధనలక్ష్మి, జయ రుక్మిణి, రమణ, ఉష, జ్యోతి, మనీలా, విజయ లక్ష్మి, కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చూడాలి

- జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు

నవతెలంగాణ-చండ్రుగొండ



వరి పొట్ట దశలో ఉంది.. కాబట్టి నీటి ఎద్దడి లేకుండా చూడాలని జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని దామరచర్ల రెవెన్యూ గ్రామంలో గల పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాండం తొలుచు పురుగు నివారణకు కార్ టాప్ హైడ్రోక్లోరైడ్ మందును లీటర్ నీటికి గ్రాములు చొప్పున కలిపి పిచికారి చేయాలని సూచించారు. మండలంలో ఆయిల్ ఫామ్ పంట సాగు విస్తీర్ణం పెంచుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జి.వినయ్, క్లస్టర్ అధికారి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు జూపల్లి పరామర్శ

రూ.5 వేలు ఆర్థిక సాయం

నవతెలంగాణ-అశ్వారావుపేట



వంట గ్యాస్ లీకై పూరి గుడిసె దగ్ధమైన బాధితురాలు పొట్టేళ్ల అడివమ్మను మంగళవారం కాంగ్రెస్ నాయకులు, ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడు జూపల్లి రమేష్ మంగళవారం పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును తెలుసుకుని ఓదార్చారు. నిత్యావసరాలు నిమిత్తం రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. ఎమ్మెల్యే ఆదినారాయణతో మాట్లాడి ఇందిరమ్మ గృహం మంజూరికి కృషి చేస్తానని ఆయన బాధితులకు భరోసా ఇచ్చారు. ఆయన వెంట ప్రమోద్, నంద్రు రమేష్,కేదార్ నాథ్ తదితరులు ఉన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

చేసిన ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు భద్రాచలం ఎమ్మెల్యే తెల్ల వెంకట్రావు చేతుల మీదుగా చెక్కులు అందజేశారు. మండల పరిషత్ సమావేశం మందిరంలో జరిగిన కార్యక్రమంలో మొత్తం 27 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు రేసు లక్ష్మి, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గం సభ్యులు తెల్లం సీతమ్మ, తాసిల్దార్ పి.చంద్రశేఖర్, మండల గిర్ధవార్లు ఆదినారాయణ, లక్ష్మయ్య, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్ష కార్యదర్శులు అన్నె సత్యనారాయణ మూర్తి, కనితి రాముడు, కెల్లా శేఖర్ స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్మికుల

వేతనాలు చెల్లించాలని ఎమ్మెల్యేకు వినతి

నవతెలంగాణ-ఇల్లందు


గత ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలను తక్షణమే చెల్లించాలని కోరుతూ మంగళవారం మిట్టపల్లిలో సీసీ రోడ్ల శంకుస్థాపనకు హాజరైన ఎమ్మెల్యే కోరం కనకయ్యకు ఐఎఫ్టియు ప్రతినిధి బృందం వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జటంగి వెంకన్న, ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి కొక్కు సారంగపాణి మాట్లాడుతూ గత ఆరు నెలలుగా గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించకపోవడం వలన కార్మికులు తీవ్ర ఇబ్బందులను పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని, కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, చట్టబద్ధమైన హక్కులు,సౌకర్యాలు కల్పించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సూర్ణపాక నాగేశ్వరరావు, యూనియన్ మండల కార్యదర్శి తొగర సామెల్, నాయకులు తిరుపతి, ప్రదీప్, రమేష్, భూలక్ష్మి తదితరులు పాల్గన్నారు.

కొమరారంను మండలంగా ప్రకటించాలని..

ప్రజల కోరిక సౌకర్యార్థం మేరకు కొమరారంను మండలంగా ప్రకటించాలని న్యూడెమోక్రసీ పార్టీ మండల నాయకులు మోతిలాల్ కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరం కనకయ్యను కలుసుకొని వినతి పత్రం సమర్పించారు. పెండింగ్ లో ఉన్న పోడు భూమికి పట్టాలు ఇవ్వాలని, కొమరారం లో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలనీ తదితర సమస్యలు పరిష్కరించాలని వారి దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో జోగా క్రిష్ణ, మూడు మాలు, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

వలస ఆదివాసీలు ఐక్యంగా పోరాడాలి

నవతెలంగాణ-పాల్వంచ



ఛత్తీస్ గఢ్ రాష్ట్రం నుంచి వలస వచ్చి 30 సంవత్సరాలుగా ఇక్కడే స్థిర నివాసం ఉంటున్న ఆదివాసీలకు ఎస్టీ సర్టిఫికేట్ ఇవ్వాలని, తొమ్మిది తెగల సమన్వయ కర్త సోయం కన్నరాజు కోరారు. ఆదివాసీ జీవన విధానం ఆధ్వర్యంలో స్థానిక కొమరం భీమ్ హాల్లో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వీరిపై ప్రభుత్వం వివక్ష చూపుతుందని, దీనిమూలంగా వారు రెండోవ తరగతి పౌరులుగా అవమానం చవిచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత 30 ఏళ్లగా పోడు సాగుచేస్తుంటే ప్రభుత్వం వీరికి హక్కు పత్రాలు ఇవ్వకుండా వేధింపులకు గురిచేస్తుందన్నారు. వీరి గ్రామాలకు నేటికీ ఎలాంటి గుర్తింపు లేకుండా సమస్యలతో సతమతం అవుతునారని గుర్తుచేశారు. ఆదివాసీలు ఐక్యంగా పోరాడి హక్కులు సాధించు కోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త పి. క్రాంతి, ఆదివాసీ జీవన విధానం నాయకులు సోయం బాబూరావు, హేతువాద సంఘం మూడు జిల్లాల ప్రాంతీయ అధ్యక్షులు నబీ సాహెబ్, తాటి రవి, కట్టం కొసయ్యా మడవి ఇడమ, వెట్టి భీమయ్య, పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్

నవతెలంగాణ-పాల్వంచ

రాబోయే పార్లమెంట్ ఎన్నికలను ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం సజావుగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధం కావాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ సంబంధిత జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా కు అధికారులను ఆదేశించారు. పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ సన్నద్ధత పై స్వీప్ కార్యక్రమాల నిర్వహణ, పెండింగ్ ఓటరు దరఖాస్తులు వంటి పలు అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తో కలిసి సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ మాట్లాడారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలను కట్టుదిట్టంగా నిర్వహించేందుకు ప్రతి జిల్లాలో ఎన్నికల ప్రణాళిక తయారు చేసుకోవాలనానరు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కాశయ్య, కొత్తగూడెం ఆర్డిఓ మధు, భద్రాచలం ఆర్డీవో దామోదర్, జడ్పీ సీఈవో ప్రసూన రాణి, విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర చారి, ఎలక్షన్ సెల్ సూపర్డెంట్ ధారా ప్రసాద్, కొత్తగూడెం తాసిల్దార్ పుల్లయ్య, భద్రాచలం తహసీల్దార్ శ్రీనివాస్, అశ్వరావుపేట తహసీల్దార్ కృష్ణ ప్రసాద్, పినపాక తహసీల్దార్ రాఘవరెడ్డి, ఇల్లందు తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎలక్షన్ సెల్ సిబ్బంది నవీన్ పాల్గొన్నారు.

ఇల్లందు మున్సిపాలిటీ బడ్జెట్ రూ.15.76 కోట్లు

కౌన్సిల్ ఆమోదం

- పన్నులు లేని చారిత్రాత్మక బడ్జెట్ : ఎమ్మెల్యే కోరం కనకయ్య
- ప్రజా శ్రేయస్సే లక్ష్యం : చైర్మెన్ డీవీ
- నాలుగేళ్లుగా ప్రజలపై భారాలు మోపలేదు : ఇన్‌చార్జ్ కమిషనర్ నవీన్

నవతెలంగాణ-ఇల్లందు



2024-25 ఇల్లందు మున్సిపాలిటీ అంచనా బడ్జెట్ రూ.15 కోట్ల 76 లక్షల 15 వేలుగా కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో మంగళవారం మున్సిపాలిటీ ప్రత్యేక బడ్జెట్ సమావేశం చైర్మెన్ డీవీ అధ్యక్షతన నిర్వహించారు. మున్సిపాలిటీలో 24 మంది కౌన్సిలర్ సభ్యులకు గాను 20 మంది హాజరైనట్లు తెలిసింది. అనంతరం మున్సిపల్ బడ్జెట్ను సమావేశంలో ప్రవేశపెట్టారు. రూ.15 కోట్ల 76 లక్షల 15 వేలలో మున్సిపాలిటీ పౌరుగు సేవలలో పనిచేసే నీటి సరఫరా, ఎలక్ట్రిసిటీ, ఆఫీస్ సిబ్బంది జీతభత్యాలు రూ.2 కోట్ల 68 లక్షలు. పారిశుధ్య నిర్వహణ కోసం రూ.84 లక్షల 30 వేలు, విద్యుత్ ఛార్జీలు రూ. 93 లక్షలు, ఈఈఎస్ ఎల్ చెల్లింపులు రూ.15 లక్షలు, 10శాతం హరిత బడ్జెట్ రూ.63 లక్షల 40 వేలు. ఇంజనీరింగ్ వ్యవస్థ నిర్వహణ వ్యయం రూ. 78 లక్షల, 50 వేలు. సాధారణ పరిపాలన వ్యయం రూ. 77లక్షల 30వేలు. పట్టణ ప్రణాళిక విభాగం ఖర్చులు రూ.4 లక్షలు. వివిధ ప్రభుత్వ గ్రాంట్ల ఖర్చులు- 8 కోట్ల 32 లక్షలు. గతేడు రాబడి రూ. 15కోట్ల 76 లక్షలు.

మిగులు బడ్జెట్ : రూ.36 లక్షలు.

గతేడు అంచనా బడ్జెట్ 40 కోట్లు. కాగా గ్రాంట్లు, ప్రభుత్వ సహాయం, ఇతర ఆదాయాలు అన్నీ కలిపి 2023-24 ఆర్థిక సంవత్సరంలో మున్సిపాలిటీ ఆదాయం రూ.15 కోట్ల 76 లక్షలు. ఖర్చు రూ.15 కోట్ల 40 లక్షలు. మిగులు రూ.36 లక్షలు.

పన్నులు లేని చారిత్రాత్మక బడ్జెట్ : ఎమ్మెల్యే కోరం కనకయ్య

నాలుగేళ్లుగా ప్రజలపై భారాలు మోపలేదు. పాలకవర్గం ఏర్పడి నాలుగేళ్లు పూర్తయి 5వ ఏడులో అడుగుపెట్టినప్పటికీ ఈనాటికీ ప్రజలపై ఒక్క పైసా భారం మోపలేదని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. భారాలు లేని బడ్జెట్ గా చరిత్రలో నిలుస్తుందన్నారు. ఇంటి, పంపు, లైసెన్సు, కమర్షియల్ టాక్సు తెలుస్తూ మున్సిపాలిటీకి ఆర్థికంగా తోడ్పాటు అందించాలని ప్రజలను కోరారు.

ప్రజా శ్రేయస్సే లక్ష్యం : ప్రజల ఆశీస్సులతో రాష్ట్రంలో నెంబర్ వన్ స్థానంలో నిలిచాం : చైర్మన్ డీవీ

గత నాలుగేండ్లు మున్సిపల్ పాలనలో ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా పనిచేసినట్లు మున్సిపల్ చైర్మన్ డివి తెలిపారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా నవతెలంగాణతో మాట్లాడారు. మున్సిపల్ పాలకవర్గం 5వ సం.లో అడుగు పెట్టినప్పటికీ ఈనాటికీ ప్రజలపై పనులు వేయలేదన్నారు. అవినీతికి ఆస్కారం లేకుండా పరిపాలన కొనసాగించామన్నారు. మున్సిపాలిటీ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడానికి పాలకవర్గం సహాయంతో ఎంతో కృషి చేసినట్లు పేర్కొన్నారు. దేశంలో 18 రాష్ట్రంలో నెంబర్ వన్ స్థాయికి మున్సిపాలిటీ తీసుకొచ్చామని తెలిపారు. ప్రజల ఆశీస్సులు, ఎమ్మెల్యే కోరం కనకయ్య సహకారం, జిల్లా మంత్రుల తోడ్పాటుతో ట్టణాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. మున్సిపల్ ప్రత్యేక బడ్జెట్ సమావేశంలో ఇన్చార్జి కమిషనర్ నవీన్, 20 వార్డు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు,అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు

- ఆపరేషన్ సర్కిల్ టీఎస్ ఎన్పీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ రమేష్

నవతెలంగాణ-పాల్వంచ

రాబోయే వేసవికాలం దృష్ట్యా అన్ని కేటగిరీల విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ కే.రమేష్ తెలిపారు. ఈ మేరకు ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అదనపు పవర్ కోసం ట్రాన్స్ఫార్మర్లు 33/11 కెవి సబ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మణుగూరు మండలంలోని గుట్ట మల్లారం సబ్ స్టేషన్ లో 30 లక్షల వ్యయంతో త్రీ పాయింట్ వన్ ఫైవ్ ఎంవిఏ అదనపు పవర్ ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అలాగే చంద్రుగొండ మండలంలోని పోకల గూడెం సబ్‌స్టేషన్ 40 లక్షలు వ్యయంతో 5.0 ఎంవీఏ అదరపు పవర్ ట్రాన్స్ఫార్మర్లు



మణుగూరు సబ్ స్టేషన్ లో రూమ్ 45 లక్షల వ్యయంతో పవర్ ట్రాన్స్ఫార్మర్ కెపాసిటీని 3.15 ఎంవీఏ నుండి 5.0 ఎంవీఏకు పెంచుతున్నామన్నారు. అలాగే దమ్మపేట మండలంలోని నాగుపల్లి సబ్‌స్టేషన్లో రూ.60 లక్షల వ్యయంతో పవర్ ట్రాన్స్ఫార్మర్ కెపాసిటీ 5.0 ఎంవీఏ నుండి 8.0 ఎంవీఏకు పెంచడం జరుగుతుందన్నారు. భద్రాచలంలో సబ్‌స్టేషన్లో రూ. 40 లక్షల వ్యయంతో 5.0 ఎంవిఏ అదనపు పవర్ ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేయుటకు పై అధికారుల అనుమతులు పొందడం జరిగిందని చెప్పారు. కొత్తగూడెం మండలంలోని ప్రగతి నగర్ సబ్ స్టేషన్‌లో రూ.40 లక్షల వ్యయంతో 5.0 ఎంవిఏ అదనపు ట్రాన్స్ఫార్మర్లు పాల్వంచ మండలంలోని ఇందిరానగర్ సబ్‌స్టేషన్‌లో రూ.40 లక్షల వ్యయంతో 5.0 ఎంవీఏ అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

శీనన్న నేతృత్వంలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

కాంగ్రెస్ జిల్లా నాయకులు పొంగులేటి ప్రసాద్

నవతెలంగాణ-తిరుమలాయపాలెం



కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, మంత్రి పొంగులేటి శీనన్న చొరవతో మరింత లబ్ధి చేకూరుతుందని కాంగ్రెస్ జిల్లా నాయకులు పొంగులేటి ప్రసాద్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మండలంలో ముమ్మరంగా పర్యటించారు. తొలుత తిరుమలాయపాలెంలో కాంగ్రెస్ నాయకులు ఎడ్లపల్లి గోపాలకృష్ణ నివాసానికి వెళ్లి ఆత్మీయంగా పలకరించారు. తాటికొండ కిరణ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి అక్కడే మధ్యాహ్న భోజనం చేశారు. ఆ తర్వాత పాతర్లపాడులో నేలమర్రి రామచంద్రు ఇంట నూతన వధూవరులను ఆశీర్వదించారు. జిల్లా నగేష్ గౌడ్ ఇంటికి వెళ్లి..యోగక్షేమాలు తెలుసుకున్నారు. హస్నాబాద్ గ్రామంలో తిరుపతమ్మ గుడిలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పైనంపల్లిలో కాంగ్రెస్ నేత గండ్ర గోపాలరావు నివాసంలో, జూపెడలో వనవాసం నరేందర్‌రెడ్డి, కాకరవాయిలో గూడూరు ఉపేందర్ నివాసాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా పొంగులేటి ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను వందశాతం అమలు చేసేలా పాలన సాగుతోందని తెలిపారు. మహిళలు, రైతులు, వ్యవసాయ కూలీలు, విద్యార్థులు, యువతీ యువకులకు అర్హత మేరకు లబ్ధి జరిగేలా విజయవంతంగా అడుగులు పడుతున్నాయని అన్నారు. మన మంత్రి పొంగులేటి శీనన్న ఏ సమస్య వచ్చినా..అందరికీ అండగా నిలుస్తారని అభయమిచ్చారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీటిసి బెల్లం శ్రీను, కాంగ్రెస్ నాయకులు రామసహాయం నరేష్ రెడ్డి, చావా శివరామకృష్ణ, కొప్పుల అశోక్, తిరుమలాయపాలెం సోషల్ మీడియా కోఆర్డినేటర్ దూదిమెట్ల వెంకట్, తాటికొండ కిరణ్, ఎల్. శ్రీను, గుగ్గిళ్ళ అంబేద్కర్, పోలేపొంగు సంజీవులు, బత్తుల రవికుమార్, పోట్ల ప్రవీణ్, సైఫుద్దీన్, ఊర వెంకటేశ్వర్లు, గుండెబోయిన ముత్తయ్య, ఉప్పునూతల నాగేశ్వరరావు, పార్వతిని, నాగులు, నేలమర్రి ఏసు బాబు, తురక సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మంత్రుల అండతోనే అభివృద్ధి

ఎమ్మెల్యే మట్టా రాగమాయి దయానంద్

నవతెలంగాణ-వేంసూరు



జిల్లా మంత్రుల అండతోనే గ్రామాల అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే మట్ట రాగమాయి దయానంద్ అన్నారు మంగళవారం మండల పరిధిలోని చోడవరం, చోడవరం తండా, కందుకూరు, భరిణిపాడు గ్రామాలలో 63.50 లక్షలతో నిర్మించిన సిసి రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా మంత్రులు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహాయ సహకారాలతో గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని, ఇందిరమ్మ రాజ్యంలో పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు ముఖ్యంగా అభయ హస్తం ఆరు గ్యారంటీలు అందుతాయని అన్నారు. గృహజ్యోతి ఉచిత కరెంటు వర్తించని లబ్ధిదారులు ఎవరైనా ఉన్నట్లయితే స్థానిక ఎంపీడీవో కార్యాలయం నందు ధ్రువపత్రాలను అందజేసి పథకాలు లబ్ధిపొందాలని సూచించారు. ఆయా గ్రామాలలో సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగేశ్వరరావు, తాసిల్దార్ రాజు, ఎంపీటీసీ రాఘవరెడ్డి, వెంకటరెడ్డి, కూరపాటి నాని, భూక్య నాగులు, భాష, పంచాయితీ కార్యదర్శులు రాజగోపాల్, సతీష్, మోహన్ తదితరులు పాల్గొన్నారు,

మోడల్ స్కూల్‌లో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

నవతెలంగాణ-కారేపల్లి

పొదుపు, ఆర్థిక క్రమశిక్షణ చిన్నతనంలో అలవర్చుకోవాలని కారేపల్లి ఎస్బీఐ మేనేజర్ గౌరవ్ సుక్లా అన్నారు. మంగళవారం కారేపల్లిలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో బాలికా సాధికారిత సంఘం ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్బీఐ మేనేజర్ మాట్లాడుతూ మహిళలు పొదుపు సంఘాలతో ఎంతో అభివృద్ధి సాధిస్తున్నారన్నారు.కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ప్రభాకర్, బాలిక సాధికారిత సంఘం అధ్యక్షులు ప్రిన్సిపాల్ మహమ్మద్ అక్తర్, కన్వీనర్ కే.అర్చన, వైస్ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, సభ్యులు రాంప్రసాద్, సంధ్యారాణి పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

నవతెలంగాణ-కొణిజర్ల

విద్యార్థులు క్రమశిక్షణతో చదివి మంచి ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు చైర్మన్ పరిశ పుల్లయ్య విద్యార్థులకు సూచించారు. మండల పరిధిలోని తుమ్మలపల్లి గ్రామంలోని ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పరీక్షా సామాగ్రిని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయిని సూర్యదేవర అజిత మాట్లాడుతూ పరిశ సీతారత్నం ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, విశ్రాంత ఉపాధ్యాయులు పరిశ పుల్లయ్య చేస్తున్నసేవలను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రాజశేఖర్, మంజుల, రమాదేవి, నిర్మల, వీరకుమారి, శివరాణి, భద్రయ్య, శశికుమార్, విజయ్, మైలవరపు పుల్లారావు పాల్గొన్నారు.

పది క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-తల్లాడ

మల్లవరం గ్రామంలో రేషన్ డీలర్ 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని వ్యాన్‌లో తరలించడానికి సిద్ధంగా ఉంచగా విశ్వసనీయ సమాచారంతో పోలీసులు మంగళవారం తెల్లవారుజామున స్వాధీనం పట్టుకున్నారు.

పరీక్ష ప్యాడ్లు పంపిణీ

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి మండలం గేటుకారేపల్లి హైస్కూల్ పదోతరగతి విద్యార్థులకు చంద్రు పౌండేషన్ పరీక్ష సామాగ్రిని పంపిణీ చేశారు. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో చంద్రు ఫౌండేషన్ చైర్మన్ భూక్యా వీరన్న చేతుల మీదగా పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, స్కేళ్లు అందజేశారు. పదోతరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులు ప్రోత్సహక బహుమతులు అందజేయనున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ వీరన్న తెలిపారు. విద్యార్థులకు పౌండేషన్ సాయం చేయటాన్ని గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో పౌండేషన్ సభ్యులు భూక్యా మంగిత్యా, భూక్యా గణేష్, రమేష్, వినోద్, రవి, హెచ్ఎం ఆదినారాయణ, ఉపాధ్యాయులు శంకర్, శ్రీనివాస్, అనంద్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

5వ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్

- ప్రతిభ వెలికి తీసేందుకే : ఎంఈఓ

నవతెలంగాణ-ఇల్లందు

మండల స్థాయిలో 5 వతరగతి చదువుతున్న విద్యార్థులకు స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో మంగళవారం టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఇటీవల కాంప్లెక్స్ స్థాయిలో 1, 2, 3 స్థానాలు సాధించిన 7 కాంప్లెక్సులకు సంబంధించిన 21 మంది విద్యార్థులు టెస్ట్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి పి. శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థిలోని ప్రతిభను వెలికి తీసేందుకే టెస్టులు ప్రభుత్వం నిర్వహిస్తుందని తెలిపారు. పాల్గొన్న ప్రతీ విద్యార్థికి ఇంగ్లీషు తెలుగు నిఘంటువు ప్రోత్సాహక బహుమతిగా అంద జేసారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి టివిఆర్ యస్ స్వామి, కార్యాలయ సిబ్బంది ఆనంద్, సురేష్, రవి, రాజకుమారి పాల్గొన్నారు.

నీతి నిజాయితీతో ఓటు హక్కు వినియోగించుకోవాలి

నవతెలంగాణ-పాల్వంచ రూరల్

ప్రతి ఒక్కరూ స్వేచ్ఛ వాతావరణంలో, ఎటువంటి ప్రలోభాలకు లోను కాకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎంపీడీవో విజయభాస్కర రెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని జగన్నాథపురంలో ఓటర్లతో ముగ్గులు వేయించి అవగాహన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ అర్హులు ఓటుకు నమోదు చేసుకోవాలని, ఓటు హక్కు అనేది ప్రజాస్వామ్యంలో ఆయుధం అని దానిని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ కనకదుర్గ, ఏపీవో పోరండ్ల రంగా, గ్రామపంచాయతీ కార్యదర్శి సాయిరాం, సిసి మురళి, సూపర్వైజర్ అనసూయ, ఎఫ్ఏ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

60 లక్షల మున్నూరు కాపుల కలలు సాకారం

మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

- సంఘం మండల అధ్యక్షులు పూదోట సూరిబాబు

నవతెలంగాణ-దుమ్ముగూడెం



రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం జరిగిన రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం పట్ల రాష్ట్రంలో ఉన్న 60 లక్షల మున్నూరు కాపుల కల సాకారం అయిందని మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షులు పూదోట సూరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్రంలో 24 శాతం జనాభా ఉన్న మున్నూరు కాపు కుల బంధువులు వివక్షకు గురవుతున్నారని, కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని గత తెలంగాణ ప్రభుత్వానికి అనేకమార్లు విన్నవించుకోవడం జరిగిందన్నారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం తన ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఇచ్చిన మాట ప్రకారం మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేసి మున్నూరు కాపుల్లో ఆత్మస్థైర్యం పెంచిందన్నారు. కాపు కార్పొరేషన్ ఏర్పాటు కోసం కృషి చేసిన వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్య పటేల్‌తో పాటు ఇతర కుల బంధువులకు దుమ్ముగూడెం మండలం మున్నూరు కాపు సంఘం కుల బంధువుల పక్షాన ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నట్లు సూరిబాబు తెలిపారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం

నవతెలంగాణ- ఖమ్మం

మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు బుధవారం స్థానిక భక్త రామదాసు కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. తొలుత ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పునుకొల్లు నీరజ, ట్రైనీ ఐపీఎస్ మౌనిక, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహార్, జిల్లా బాలల పరిరక్షణ సమితి అధ్యక్షురాలు భారతీయ రాణి, జిల్లా సంక్షేమ అధికారి కె.రాంగోపాల్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ మహిళలకు ఉన్నటువంటి చట్టాలు, హక్కులు గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని ఆశించి శుభాకాంక్షలు తెలిపారు. ట్రైనీ ఐపీఎస్ మౌనిక మాట్లాడుతూ ఆడపిల్లలపై ఎలాంటి వివక్ష చూపించవద్దని, ఇంట్లో పిల్లల ప్రవర్తన పట్ల తల్లితండ్రులు అవగాహన కలిగి, పూర్తి జాగ్రత్తగా ఆడ పిల్లలను గమనిస్తూ వాళ్లను సక్రమమైన మార్గంలో పయనించేటట్టు చూడాలని తెలిపారు. 40 మంది ఉత్తమ మహిళా ఉద్యోగులకు సన్మానించారు. డ్రాయింగ్, రంగోలి, ఎస్సే రైటింగ్ కాంపిటీషన్స్ లో ఫస్ట్ వచ్చిన కేజీబీవీ, ఎస్సీ వెల్ఫేర్, ప్రియదర్శిని డిగ్రీ కళాశాల విద్యార్థులకు, బాలాసదన్ పిల్లలకు మెరిట్ సర్టిఫికెట్స్ మెమొంటోలు అందజేశారు.

కమలాపురం హైస్కూల్లో ఓటు హక్కుపై అవగాహన

నవతెలంగాణ-ముదిగొండ

ఖమ్మం నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువజన అధికారి చింతల అన్వేష్ ఆదేశాల మేరకు అకౌంట్స్ ప్రోగ్రాం అధికారి కమర్తపు భానుచందర్ సూచన మేరకు ప్రజ్వల యువజన సంఘం ఆధ్వర్యంలో మండల పరిధిలో జిల్లా పరిషత్ హైస్కూల్ కమలాపురం గ్రౌండ్‌లో,బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్‌ను హైస్కూల్ హెచ్ఎం వి.ఖాదర్ శ్రీను, ప్రజ్వల యువజన సంఘం అధ్యక్షులు చింతమాల పాపయ్య కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్లాక్ స్పోర్ట్స్ మీట్‌లో నాలుగు రకాల క్రీడలు కబడ్డీ, వాలీబాల్, షటిల్, క్రికెట్ పోటీలు నిర్వహించారు. పోటీలో గెలుపొందిన విజేతలకు సర్టిఫికెట్లు షీల్డు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజ్వల యువజన సంఘం అధ్యక్షులు చింతమాల పాపయ్య, హైస్కూల్ హెచ్ఎం వి.ఖాదర్ శ్రీను, గ్రామ పెద్దలు కూరపాటి కిషోర్ రెడ్డి, క్రీడాకారులు, యువజనలు గోపి, సాయి, నవీన్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

మహిళలు మరింత చైతన్యవంతం కావాలి

ప్రముఖ న్యాయవాది వనం కృష్ణవేణి

నవతెలంగాణ-నేలకొండపల్లి

సమాజంలో మహిళలు పురుషులకు దీటుగా అన్ని రంగాలలో రాణిస్తున్న మరింత చైతన్యవంతం కావాలని ప్రముఖ న్యాయవాది వనం కృష్ణవేని అన్నారు. మంగళవారం నేలకొండపల్లి మండల కేంద్రంలో భక్త రామదాసు సర్వీస్ సొసైటీ, నేలకొండపల్లి సేవ మండలి సంయుక్త ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీలలో గెలుపొందిన విజేతలకు ఆమె బహుమతులను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళలంతా భారత రాజ్యాంగం కల్పించిన చట్టాలకు లోబడి పనిచేస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో స్థానిక మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆలేటి పరంజ్యోతి, సిద్ధార్థ యోగాశ్రమం ప్రకృతి వైద్యులు డాక్టర్ కే వై రామచంద్రరావు, భక్త రామదాసు సర్వీస్ సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు పాలడుగు పూర్ణచంద్రప్రసాద్, ఎలమద్ది లెనిన్, కోశాధికారి తెలగొర్ల చిన్న లింగస్వామి, క్యాంపు చైర్మన్ మచ్చ రేణుక, సర్వీ సొసైటీ సభ్యులు వల్లంచెట్ల భాస్కరరావు, తిరుపతయ్య, రఘుపతిరావు, భాస్కర్‌రెడ్డి జగన్మోహన్‌రావు, వెంకటరామారావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ అంగన్‌వాడీ ఆయాకు సన్మానం

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి మండలంలో కారేపల్లి-1 అంగన్‌వాడి సెంటర్ ఆయాగా పని చేస్తున్న ఎల్.ప్రమీల ఉత్తమ ఆయాగా సన్మానం అందుకున్నారు. మంగళవారం ఖమ్మంలోని భక్తరామదాస కళాక్షేత్రంలో జరిగిన మహిళ దినోత్సవంలో ఖమ్మం మేయర్ పునకొల్లు శైలజా చేతుల మీదిగా సన్మానం అందుకున్నారు.



న్యూఢిల్లీ: పవిత్ర రంజాన్ మాసం తొలి రోజు జామా మసీదులో ఉపవాసాన్ని విరమిస్తున్న ముస్లిం సోదరులు

ఆర్టీసీ సంరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిదీ..

- సంస్థ నష్టాల్లో నుంచి లాభాల్లోకి రావడం గర్వకారణం
- మహాలక్ష్మి పథకంతో వందశాతం పెరిగిన ఆక్యూపెన్సీ : డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- ఆర్టీసీ బలోపేతం, అభ్యున్నతికి సహకారమందిస్తాం : మంత్రులు పొన్నం, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- 22 ఎలక్ట్రిక్ నాన్ ఏసీ బస్సులను ప్రారంభించిన మంత్రులు



నవతెలంగాణ-సిటీబ్యూరో/బంజారాహిల్స్

తెలంగాణకు తలమానికమైన ఆర్టీసీని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ప్రభుత్వం ప్రజా రవాణా వ్యవస్థ ప్రాముఖ్యతను గుర్తించి.. 90 రోజుల్లో అనేక కార్యక్రమాలు తీసుకొచ్చిందని వివరించారు. హైదరాబాద్ ఎన్టీఆర్ మార్గ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద తెలంగాణ ఆర్టీసీకి చెందిన గ్రీన్ మెట్రో ఎక్స్‌ప్రెస్ నాన్ ఏసీ బస్సుల ప్రారంభోత్సవానికి మంగళవారం ఉప ముఖ్యమంత్రితోపాటు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరయ్యారు. పర్యావరణహితమైన 22 ఎలక్ట్రిక్ నాన్ ఏసీ బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం అక్కడి నుంచి మంత్రులు ఎలక్ట్రిక్ బస్సులో సచివాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. గతంలో నష్టాల్లో ఉన్న టీఎస్ఆర్టీసీ మహాలక్ష్మి పథకం ద్వారా లాభాల్లోకి వెళ్లడమనేది తెలంగాణకే గర్వకారణమని తెలిపారు.

మహిళల టికెట్ డబ్బును టీఎస్ఆర్టీసీకి ప్రభుత్వం ఎప్పటికప్పుడూ చెల్లిస్తోందన్నారు. ఆర్టీసీ సిబ్బంది కష్టాన్ని, శ్రమను గుర్తించే వేతన సవరణ చేసి.. 21 శాతం ఫిట్‌మెంట్‌ను ఇటీవల ప్రకటించామని గుర్తు చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. మహాలక్ష్మి పథకం వల్ల టీఎస్ఆర్టీసీ కళకళలాడుతోందని, ప్రతి బస్సు 100 శాతం ఆక్యూపెన్సీ రేషియో(ఓఆర్) తగ్గకుండా తిరుగుతోందని చెప్పారు. ఆర్టీసీ పరిరక్షణ, సిబ్బంది సంక్షేమానికి ప్రభుత్వం ప్రాముఖ్యత ఇస్తోందన్నారు. తొలిసారిగా ఎలక్ట్రిక్ నాన్ ఏసీ బస్సులను సంస్థ అందుబాటులోకి తీసుకొచ్చిందని తెలిపారు. మహాలక్ష్మి పథకాన్ని ఈ బస్సుల్లో కూడా అమలు చేస్తామని చెప్పారు. పెరిగిన రద్దీకి అనుగుణంగా భవిష్యత్‌లో మరిన్ని కొత్త బస్సులు వాడకంలోకి వస్తాయని, వాటి కొనుగోలుకు సంస్థకు ప్రభుత్వం సహాయసహకారాలు అందిస్తుందని వివరించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీఎస్ఆర్టీసీ అభ్యున్నతికి పాటుపడుతోందన్నారు. టీఎస్ఆర్టీసీ సిబ్బంది నిబద్ధత, అంకితభావం క్రమశిక్షణతో పనిచేస్తూ ప్రతి రోజూ లక్షలాది మందిని క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చుతున్నారని కొనియాడారు. భవిష్యత్‌లోనూ ఇలాగే పనిచేస్తూ దేశంలోనే టీఎస్ఆర్టీసీకి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ మాట్లాడుతూ.. ఇటీవల తమ ఉద్యోగులకు 21 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించిన ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. రానున్న ఐదారు నెలల్లో ప్రభుత్వ సహకారంతో 2515 బస్సులను వినియోగంలోకి తెచ్చేలా సంస్థ ప్రణాళిక చేసిందని తెలిపారు. ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన బాండ్లకు సంబంధించిన చెక్కులను టీఎస్ ఆర్టీసీ ఉద్యోగులు సరిత, సంజీవ్‌కు మంత్రుల చేతులమీదుగా అందజేశారు. ఈ ప్రారంభోత్సవంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, రవాణా శాఖ కమిషనర్ జ్యోతి బుద్దా ప్రకాశ్, ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి, టీఎస్ ఆర్టీసీ సీవోవో డాక్టర్ రవీందర్, జాయింట్ డైరెక్టర్ అపూర్వరావు, ఈడీలు మునిశేఖర్, కృష్ణకాంత్, వెంకటేశ్వర్లు, సీఎంఈ రఘునాథరావు పాల్గొన్నారు.

టెట్ నిర్వహించి డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలి

- సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే టి హరీశ్‌రావు లేఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

టెట్ నిర్వహించి డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి టి హరీశ్‌రావు మంగళవారం లేఖ రాశారు. 'రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామకం కోసం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే ఇటీవల కాలంలో టెట్ పరీక్ష నిర్వహించకపోవటం వల్ల దాదాపు 7 లక్షల మంది డీఎడ్, బీఎడ్ విద్యార్థులు డీఎస్సీకి దరఖాస్తు చేసుకోలేక పోతున్నారు. అంతేకాకుండా గత డిసెంబర్ నెలలో డీఎడ్ , బీఎడ్ కోర్సులు పూర్తి చేసుకున్న వారు దాదాపుగా 50వేల పైచిలుకు మంది ఉంటారు.

టెట్‌లో ఉత్తీర్ణత సాధించిన వారు మాత్రమే డిఎస్సీకి దరఖాస్తు చేయడానికి అర్హులవుతారనే విషయం మీకు తెలిసిందే. గతేడాది సెప్టెంబర్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వం టెట్ నిర్వహించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ పరీక్షను నిర్వహించలేదు. టెట్‌లో ఉత్తీర్ణత సాధించి, డీఎస్సీకి దరఖాస్తు చేసుకోవాలని ఆశతో అభ్యర్థులు ఉన్నారు. కాబట్టి, డీఎస్సీ నోటిఫికేషన్‌తో పాటు, టెట్ నిర్వహించి విద్యార్థులు, నిరుద్యోగుల అవకాశాలు దెబ్బతినకుండా చూడాలి' అని సీఎంకు రాసిన ఆ లేఖలో హరీశ్‌రావు పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో 'ప్రపంచ వరి సదస్సు'

- ప్రభుత్వ భాగస్వామ్యంతో జూన్ 4 నుంచి ప్రారంభం : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో జూన్ 4 నుంచి 6 వరకు హైదరాబాద్‌లో ప్రపంచ వరి సదస్సును నిర్వహించబోతున్నదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. అంతర్జాతీయ కామోడీటీస్ సంస్థ, కాలిఫోర్నియా, అంతర్జాతీయ వరి పరిశోధనాసంస్థ (ఫిలిప్పైన్స్) సంయుక్తంగా ప్రపంచ వరి సదస్సును నిర్వహిస్తున్నాయని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

22 ఏండ్లుగా వివిధ దేశాల్లో ప్రపంచ వరి సదస్సులు జరుగుతున్నాయనీ, తొలిసారిగా హైదరాబాద్‌లో జరగడం గర్వకారణమని తెలిపారు. సదస్సులో 28 దేశాల నుంచి దాదాపు 500 మంది విదేశీ ప్రతినిధులు, శాస్త్రవేత్తలు, వ్యాపారసంస్థల ప్రతినిధులు, ఎగుమతి దిగుమతిదారులు, విద్యావేత్తలు, ప్రభుత్వం రంగంలోని వ్యవసాయ పారిశ్రామిక వేత్తలు, వరి అనుబంధ ఉత్పత్తుల రంగాలకు చెందిన పారిశ్రామిక వేత్తలు, స్టార్టప్ కంపెనీల ప్రతినిధులు కూడా పాల్గొంటారని ఈ సందర్భంగా మంత్రి వెల్లడించారు.

బీజేపీ, జేజేపీ దోస్తీ కటీఫ్

ఖట్టర్ రాజీనామా... నాయబ్ సైనీ ప్రమాణస్వీకారం

హర్యానాలో నాటకీయ పరిణామాలు



చండీఘడ్ : లోక్‌సభ ఎన్నికల వేళ ఎన్డీఏకు మరో మిత్రపక్షం దూరమైంది. హర్యానాలో బీజేపీతో కలిసి అధికారాన్ని పంచుకుంటున్న జననాయక్ జనతా పార్టీ (జేజేపీ) ఆ పార్టీకి గుడ్‌బై చెప్పింది. హర్యానా రాజకీయాలలో మంగళవారం అనూహ్య నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. అధికార కూటమి భాగస్వామ్య పక్షాలైన బీజేపీ, జేజేపీ మధ్య తలెత్తిన విభేదాల కారణంగా మనోహర్ లాల్ ఖట్టర్ ప్రభుత్వం రాజీనామా చేసింది. కురుక్షేత్ర ఎంపీ, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు నాయబ్‌సైనీని బీజేపీ శాసన సభాపక్ష నేతగా ఎన్నుకుంది.

ఆయన వెంటనే రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయను కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం ఇవ్వాలని కోరారు. సాయంత్రం సైనీ నేతృత్వంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో సైనీ చేత గవర్నర్ దత్తాత్రేయ ప్రమాణస్వీకారం చేయించారు. ఆయనతో పాటు మరో ఐదుగురు ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. వీరిలో ఓ స్వతంత్ర ఎమ్మెల్యే కూడా ఉన్నారు. మొత్తంమీద స్వతంత్ర ఎమ్మెల్యేల మద్దతుతో కమలదళం తన ప్రభుత్వాన్ని కాపాడుకుంది.

బీజేపీ, జేజేపీకి చెందిన ఉప ముఖ్యమంత్రి దుష్యంత్ చౌతాలా మధ్య సంబంధాలు బెడిసికొట్టడంతో సంకీర్ణ ప్రభుత్వ మనుగడ ప్రమాదంలో పడింది. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈ రెండు పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు కుదరకపోవడమే ఈ పరిణామాలకు కారణమని తెలుస్తోంది. స్వతంత్రుల మద్దతుతో మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ఖట్టర్ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. బీజేపీ అధిష్టానం ఆదేశాలతో పార్టీ నేతలు అర్జున్ ముండా, తరుణ్ చుగ్ హుటాహుటిన హర్యానా వెళ్లారు. ఆ తర్వాత బీజేపీ శాసనసభాపక్షం సమావేశమై సైనీని నేతగా ఎన్నుకుంది. అంతకుముందు ఈ రెండు పార్టీలు వేర్వేరుగా తమ తమ ఎమ్మెల్యేలతో సమావేశాలు నిర్వహించాయి. ఖట్టర్ తన నివాసంలో మంత్రులతో సమావేశమయ్యారు. ఆ తర్వాత వారితో సహా రాజ్‌భవన్‌కు వెళ్లి రాజీనామా సమర్పించారు.

90 మంది ఎమ్మెల్యేలు ఉన్న హర్యానా శాసనసభలో బీజేపీకి 41 మంది సభ్యులు ఉన్నారు. జేజేపీకి 10 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. శాసనసభకు ఎన్నికైన ఏడుగురు స్వతంత్రుల్లో ఆరుగురు బీజేపీకి మద్దతు ఇస్తున్నారు. దీంతో జేజేపీ మద్దతు లేకపోయినా స్వతంత్రుల సాయంతో బీజేపీ తన ప్రభుత్వాన్ని కాపాడుకోగలిగింది. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్‌కు 30 మంది, ఇండియన్ నేషనల్ లోక్‌దళ్, హర్యానా లోక్‌హిత్ పార్టీలకు ఒక్కో సభ్యుడు ఉన్నారు. బీజేపీ శాసనసభాపక్ష నేతగా ఎన్నికైన తర్వాత సైనీ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో స్పందించారు. ప్రధాని మోడీ, హోం మంత్రి అమిత్ షా, బీజేపీ అధ్యక్షుడు నడ్డా, మాజీ ముఖ్యమంత్రి ఖట్టర్, పార్టీ ఎమ్మెల్యేలు, మద్దతు ఇచ్చిన స్వతంత్రులకు ధన్యవాదాలు తెలిపారు.

మరోవైపు భవిష్యత్ కార్యాచరణను నిర్ణయించేందుకు జేజేపీ బుధవారం హిస్సార్‌లో ర్యాలీ నిర్వహిస్తోంది. తద్వారా తన బలాన్ని ప్రదర్శించేందుకు సిద్ధమైంది. బీజేపీ తన నైతిక పరాజయాన్ని అంగీకరించిందని, ప్రజలు కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్నారని మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నేత భూపేందర్ సింగ్ హూడా వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని ఆయన డిమాండ్ చేశారు.

సీట్ల సర్దుబాటులో ప్రతిష్టంభన

లోక్‌సభ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటుకు సంబంధించి బీజేపీ, జేజేపీ మధ్య జరిగిన చర్చల్లో ప్రతిష్టంభన ఏర్పడింది. రాష్ట్రంలో పది లోక్‌సభ స్థానాలు ఉండగా జేజేపీ రెండు సీట్లను కోరింది. ఇందుకు బీజేపీ ససేమిరా అంది. హిస్సార్, భివానీ-మహేంద్రఘర్ లోక్‌సభ స్థానాల కోసం జేజేపీ పట్టుబట్టింది. అయితే మొత్తం 10 సీట్లలోనూ తానే పోటీ చేస్తానని బీజేపీ తెగేసి చెప్పింది. 2019లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో బీజేపీ, జేజేపీ కలిపి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీతో పొత్తు పెట్టుకునే ప్రశ్నే లేదని జేజేపీ నేత దుష్యంత్ చౌతాలా స్పష్టం చేశారు. ఆయన సోమవారం ఢిల్లీ వెళ్లి బీజేపీ అధ్యక్షుడు నడ్డాతో సమావేశమయ్యారు. తన పార్టీ వైఖరిని తెలియజేశారు. దానికి కొద్ది గంటల ముందే దుష్యంత్, మోడీ ఓ కార్యక్రమంలో వేదికను పంచుకోవడం గమనార్హం. దుష్యంత్, అమిత్ షా మధ్య మంగళవారం ఉదయం సమావేశం జరగాల్సి ఉన్నప్పటికీ జరగలేదు.

రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న మోడీ

ప్రజల దృష్టి మళ్లించటానికే సీఏఏ : సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్

సీఏఏ చట్టాన్ని వ్యతిరేకిస్తూ మోడీ దిష్టి బొమ్మ దహనం



నవతెలంగాణ-ఖమ్మం

వివాదస్పద పౌరసత్వ సవరణ చట్టం సీఏఏ అమలుకు కేంద్ర ప్రభుత్వం నిబంధనలను నోటిఫై చేయడంపై సీపీఐ(ఎం) వ్యతిరేకిస్తోంది. సీఏఏ అమలుపై కేంద్ర నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలోని నిర్మల్ హృదయ్ స్కూల్ సెంటర్‌లో ప్రధాని మోడీ దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రం అధ్యక్షతన జరిగిన సభలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పౌరసత్వ సవరణ చట్టం అమలుకు పూనుకోవటం సిగ్గు చేటన్నారు. ఇది దేశంలో ప్రజల మధ్య మతపరమైన విభజనను తీసుకువచ్చే చట్టమని అభివర్ణించారు. సీఏఏ అమలు రాజ్యాంగ విరుద్ధమని తెలిపారు. ఎలక్టోరల్ బాండ్లకు సంబంధించి సుప్రీంకోర్టు ఆదేశాలతో తీవ్ర ఇబ్బందుల్లో పడిన బీజేపీ, ఏ దారి కనపడని కారణంగా సమస్య నుంచి ప్రజల దృష్టిని మళ్ళించడం కోసం సీఏఏ చట్ట నోటిఫికేషన్ విడుదల చేసిందని ఆరోపించారు. దేశంలో ఆకలి, నిరుద్యోగం, అధిక ధరలు, అభివృద్ధి, దళితులు, మైనార్టీలు, మహిళలపై దాడులు, మణిపూర్ హింస వంటి అంశాలను పట్టించుకో కుండా కేవలం రాజకీయ దురుద్దేశంతో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. అధికార బీజేపీ ప్రతి అంశాన్ని హిందూ, ముస్లిం సమస్యగా ముందుకు తీసుకొచ్చి ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. నాలుగేండ్ల క్రితమే ఆమోదించిన చట్టాన్ని ఇన్నేండ్లు నోటిఫై చేయకుండా కేవలం ఎన్నికల నేపథ్యంలో నోటిఫై చేయడం ద్వారా మెజారిటీ హిందూ ఓటర్లను ప్రభావితం చేసే కుట్ర దాగున్నదని తెలిపారు. ఈ నేపథ్యంలో సీఏఏకు నిరసనగా కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశామన్నారు. కేరళ సీఎం పినరయి విజయన్ ఈ చట్టాన్ని మత పరంగా ప్రజలను విభజించే చట్టంగా అభివర్ణించి, అక్కడ ఈ చట్టాన్ని తమ రాష్ట్రంలో అమలు చేయబోమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎంఏ జబ్బార్, ఆర్.ప్రకాష్, ఖమ్మం టూ టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, జిల్లా నాయకులు జిల్లా ఉపేందర్, ప్రతాపనేని వెంకటేశ్వర్లు, ఎం.గోపాల్, శివన్నారాయణ, సాగర్, గుమ్మడి బిక్షం, పడిగల నాగేశ్వరరావు, ఎం. గణపతి, యం. సైదులు, బిబి, పుల్లారావు పాల్గొన్నారు.

కాలువ నీరు విడుదల చేయాలని రైతుల రాస్తారోకో

చివరి దశలో పంటలు ఎండుతున్నాయని ఆవేదన



నవతెలంగాణ - చొప్పదండి

ఎస్సారెస్పీ డి-87 ఉపకాలువ నుంచి పంటలకు నీరు విడుదల చేయాలని కరీంనగర్ జిల్లా చొప్పదండి మండల కేంద్రంలో మంగళవారం రైతులు ఆందోళన చేశారు. మండల కేంద్రంలోని హైవే రోడ్డుపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ఎస్సారెస్పీ డి-87 కాలువ కింద కరీంనగర్ మండలం చామనపల్లి గ్రామంలో 400 ఎకరాలలో సాగు చేస్తున్న వరి, ఇతర పంటలు పూర్తిగా ఎండిపోయే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దీని పరిధిలో చొప్పదండి, కొలిమికుంట, చాకుంట, వెదురుగట్ట గ్రామాల రైతులకు సైతం నీరందక పంట పొలాలు బీడుగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సారెస్పీ అధికారులు నీటిని వారాబందీగా విడుదల చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీరు విడుదల చేశాక రెండు మూడు రోజులకే.. ఎస్సారెస్పీ మెయిన్ కెనాల్ నుంచి మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాలతో డి-86 కాలువతో పెద్దపల్లికి మళ్లించారని ఆరోపించారు. ఇక్కడి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ రైతులను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చొప్పదండి సీఐ ప్రకాష్‌గౌడ్, ఎస్ఐ ఉపేంద్రచారి రైతుల వద్దకొచ్చి మాట్లాడారు. గత సంవత్సరం ఇదే నెలలో వడగండ్ల వర్షంతో పెద్దఎత్తున నష్టపోయామని, ఇప్పుడు పంటలు చేతికందే సమయంలో ఎస్సారెస్పీ నుంచి నీటిని విడుదల చేయడంలో అధికారులు ఆలస్యం చేయడంతో పొలాలు ఎండుతున్నాయని రైతులు వివరించారు. ఎస్ఐ రైతులను సముదాయించి రాస్తారోకోను విరమింపజేశారు. ఎస్సారెస్పీ డీఈతో ఫోన్లో మాట్లాడి.. రైతుల సమస్యను వివరించారు. ఎస్సారెస్పీ మెయిన్ కెనాల్ నుంచి 750పైన క్యూసెక్కుల నీళ్లు వస్తేనే డి-87కు నీటిని పూర్తిస్థాయిలో మళ్లించొచ్చని డీఈ తెలిపారు. ఉన్నత అధికారులతో మాట్లాడి నీరు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం రైతులు చొప్పదండి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్ నరేందర్‌కు, ఫోన్లో డీఈకి వినతిపత్రాన్ని అందజేశారు. రాస్తారోకోలో కరీంనగర్ మండలం చామన్‌పల్లి, చొప్పదండి, కొలిమికుంట, చాకుంట, వెదురుగట్ట రైతులు పాల్గొన్నారు.

'డబుల్' ఇండ్ల వద్ద సదుపాయాలు కల్పించాలి

- సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్
- మంత్రి పొంగులేటికి వినతిపత్రం



నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రేటర్ హైదరాబాద్‌లో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు మంచి నీరు, కరెంటు, రోడ్ల సదుపాయాలు కల్పించి, లబ్దిదారులకు ఇండ్లను స్వాధీనం చేయాలని సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం గృహ నిర్మాణ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి మెమోరాండం అందజేశారు. గ్రేటర్ హైదరాబాద్ పరిసరాల్లో గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లల్లో కనీస సౌకర్యాలు లేకపోవడం వల్ల లబ్దిదారులు అక్కడ నివాసం ఉండే పరిస్థితి లేకుండా పోయిందని చెప్పారు. గతేడాది ఎన్నికల ముందు 42 ప్రాంతాల్లో 60 వేల మందికి ఇండ్లు కేటాయించినప్పటికీ మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతోపాటు లిఫ్టు కూడా పనిచేయడం లేదని వివరించారు. దాంతో లబ్దిదారులు ఆ ఇండ్లలో ప్రవేశించే పరిస్థితి లేక ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. తమకు సదుపాయాలు కల్పించి ఇండ్లు స్వాధీనం చేయాలని జీహెచ్ఎంసీలో ప్రతి సోమవారం ప్రజావాణిలో వందలాది మంది పేదలు ఫిర్యాదు చేస్తున్నారని చెప్పారు. సదుపాయాలు కల్పించడానికి కనీసం రూ.600 కోట్లు కావాలని జీహెచ్ఎంసీ అధికారులే లెక్కలు చెపుతున్నారన్నారు. సదుపాయాలు కల్పించడానికి అవసరమైన బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించాలని, త్వరగా లబ్దిదారులకు ఇండ్లందజేయాలని కోరారు.

ప్రజల ఆకాంక్షలు ప్రతిబింబించేలా రాష్ట్ర చిహ్నాం

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రజల ఆకాంక్షలతోపాటు రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా రాష్ట్ర చిహ్నాం ఉండాలని మంత్రివర్గ ఉపసంఘం చైర్మెన్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధికారులకు సూచించారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రివర్గ ఉప సంఘం సమావేశమైంది. 'రాష్ట్ర చిహ్నాం, రాష్ట్ర విగ్రహం, రాష్ట్ర గీతం ఖరారు తదితరాంశాలపై చర్చించింది. సమావేశానికి మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క, కొండా సురేఖ తదితరులు హాజరయ్యారు. ప్రజాస్వామ్య ఆనవాళ్లను ప్రస్ఫుటించేలా రాష్ట్ర చిహ్నాం ఉండాలని వారు తెలిపారు. తెలంగాణ విగ్రహం రాష్ట్రంలోని సామాన్య మహిళను గౌరవించేలా ఉండాలని సూచించారు. రాష్ట్ర గేయానికి సంబంధించి ప్రముఖ కవి అందెశ్రీతో చర్చించి నేటి కాలానికి అనుగుణంగా 'జయజయ హే' పాటకు కొన్ని మార్పులు చేర్పులు చేయాలని సూచించారు. ప్రముఖ కళాకారులు, మేధావులతో రాష్ట్ర చిహ్నాం, విగ్రహానికి సంబంధించిన డిజైన్‌లను రూపొందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.రాష్ట్ర చిహ్నాం, రాష్ట్ర గీతం, రాష్ట్ర విగ్రహం చిహ్నాల్లో రాష్ట్రానికి సంబంధించిన అంశాలు ఉండాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. చిహ్నాంపై నాగార్జునసాగర్ డ్యామ్, ఇతర ముఖ్యమైన ఐకానిక్ చిత్రాలు ఉండాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కోరారు. మెజార్టీ ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా ఏ ఒక్క వర్గం మనోభావాలు దెబ్బతినకుండా రాష్ట్ర చిహ్నాన్ని రీడిజైన్ చేయాల్సిన అవసరం ఉందని మంత్రి కొండా సురేఖ అభిప్రాయపడ్డారు. రాష్ట్ర గీతంలో అన్ని జిల్లాలకు చోటు కల్పించాలన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయ విలువలను ప్రతిబింబించేలా తెలంగాణ మహిళ విగ్రహాన్ని రీడిజైన్ చేయాలని మంత్రి సీతక్క కోరారు. సమావేశంలో సీఎం రాజకీయ కార్యదర్శి రఘునందన్ రావు, పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి శైలజా రామయ్యర్, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ హనుమంతరావు, ప్రొటోకాల్ డైరెక్టర్ అరవిందర్ సింగ్ తదితర అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

సీసీ కెమెరాల నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో..కలెక్టరేట్ల ఎదుట అంగన్‌వాడీల ధర్నా



సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద..

నవతెలంగాణ-విలేకరులు

అంగన్‌వాడీ ఉద్యోగులను దొంగలుగా చిత్రీకరిస్తూ అంగన్వాడీ కేంద్రాల్లో సీసీ కెమెరాలు బయోమెట్రిక్ పెట్టాలనే నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కలెక్టరేట్ల ఎదుట ధర్నా నిర్వహించారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో సంఘం ఆధ్వర్యంలో సీఐటీయూ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు అనేకమంది అంగన్‌వాడీలు ర్యాలీ తీశారు. ఎర్రటి ఎండను సైతం లెక్కచేయకుండా తమ డిమాండ్లను పరిష్కరించాలని నినదించారు. పని చేయని సెల్‌ఫోన్లు మాకొద్దు అంటూ రోడ్డుపైనే నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షులు సునీత మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రాలకు ఒకపూట బడితో పాటు మే నెలంతా టీచర్స్, హెల్పర్స్‌కు సెలవులివ్వాలని డిమాండ్ చేశారు. తమకిచ్చిన పనిచేయని సెల్‌ఫోన్లను తిరిగి అప్పగిస్తున్నామని అన్నారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ఐసీడీఎస్ శాఖపై నిర్వహించిన సమీక్షలో శాఖకు బడ్జెట్ పెంచి, ఎలా బలోపేతం చేయాలనే అంశాలు చర్చించలేదని ఆరోపించారు. 48 ఏండ్లుగా పనిచేస్తున్న అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ ఎదుర్కొంటున్న సమస్యలు వాటి పరిష్కారం కోసం తీసుకునే చర్యలపై చర్చించకుండా .. పేద ప్రజల కోసం నిరంతరం సేవలందిస్తున్న అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ అవినీతిపరులని ఆరోపించడం అన్యాయమన్నారు. ఈ నిర్ణయాన్ని ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆన్‌లైన్‌లో కుటుంబ సర్వే చేయాలని అధికారులు చెప్తున్నారని, ఈ పనికి ఆటంకంగా ఉన్న అంశాలు పరిశీలించాలన్నారు. 24 రోజుల సమ్మె హామీలను వెంటనే అమలు చేయాలని, హెల్పర్స్‌కు పాత పద్ధతిలోనే ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో అంగన్వాడీలు ధర్నా నిర్వహించి అనంతరం డీడబ్ల్యూవోకు వినతిపత్రం అందజేశారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో అంగన్‌వాడీలు భారీ ర్యాలీగా కలెక్టరేట్‌కు వచ్చి మహా ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. నిర్మల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని యూనియన్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఎర్రటి ఎండను సైతం లెక్కచేయకుండా తమ డిమాండ్లు పరిష్కరించాలని నినాదాలు చేశారు. అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఖమ్మం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి .. కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. అనంతరం కలెక్టరేట్ పీవోకు వినతిపత్రం అందజేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ ఎదుట అంగన్వాడీ కార్యకర్తలు ధర్నా చేశారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి పవన్ కుమార్‌కి వినతిపత్రం అందజేశారు. సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయం ఎదుట భారీ ఎత్తున ధర్నా నిర్వహించారు. అనంతరం ఐసీడీఎస్ పీడీకి వినతిపత్రం అందజేశారు. మెదక్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు.

హామీ ఇవ్వని ఐసీడీఎస్ అధికారులు

హైదరాబాద్‌లో అంగన్‌వాడీల భారీ ర్యాలీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ సమస్యల పరిష్కారానికి సంబంధిత ప్రభుత్వ అధికారులు స్పష్టమైన హామీ ఇవ్వలేద ని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూని యన్ ప్రధాన కార్యదర్శి పి జయలక్ష్మి మంగళవారం ఒక ప్రకటన లో తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ మంగ ళవారం ఐసీడీఎస్ డైరెక్టర్ కాంతి వెస్లీతో చర్చలు జరిపా మని తెలిపారు.ఈ చర్చల్లో ఎలాంటి స్పష్టమైన హామీ రాలే దని తెలిపారు. దీంతో హైదరాబాద్‌లోని కమిషనర్ కార్యా లయం నుంచి మైత్రివనం సిగ్నల్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించామని వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జీ కవిత, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు రాజ్యలక్ష్మి, మేడ్చల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సునీత, శోభ హైదరాబాద్ సీఐటీయూ నాయకులు మహేందర్ రంగారెడ్డి జిల్లా సీఐటీయూ నాయకులు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతి ఒక్కరూ సొంతింటి కోసం కలలు కంటుంటారు. ఆ కల నెరవేరాక ఇల్లు ఎంతో అందంగా తీర్చిద్దుకోవాలనుకోవడం సహజం. దానికోసం ఇంటీరియర్ డిజైనర్స్‌ని సంప్రదిస్తుంటాం. ఈ ప్రొఫెషనల్ కోర్స్‌ని నేడు ఎంతో మంది మహిళలు తమ వృత్తిగా స్వీకరిస్తున్నారు. అటువంటి వారిలో **నిఖిత పటేల్** ఒకరు. మహారాష్ట్రలోని నాగపూర్‌కు చెందిన నిఖిత ఇంటీరియర్ డిజైనింగ్‌లో బ్యాచలర్ కోర్స్ చేశారు. అది పూర్తి చేసిన తర్వాత 'వైట్ రోజ్ ఇంటీరియర్స్' అనే సంస్థను స్థాపించారు. గత పదేండ్లుగా ఈ రంగంలో తనదైన ముద్ర వేసుకున్న ఆమె పరిచయం నేటి మానవిలో...

మనలోని ఊహాశక్తిని వెలికితీస్తుంది



ఈ ఫీల్డ్‌లో మీరు ఎదుర్కొంటున్న సమస్యలు ఏమైనా ఉన్నాయా?

సాధారణంగా మాకూ, కస్టమర్స్‌కి ఎక్కువగా మేము చేసిన సర్వీస్ ఫీజు విషయంలో తేడా వస్తుంటుంది. ఇంటీరియర్ సర్వీస్ ఛార్జీలకు సంబంధించి సమస్య ఎప్పుడూ ఉంటూనే ఉంటుంది. మేము అంటే డిజైనర్లు ఉచితంగా సామాజిక సేవ చేయడం లేదని, ఇదీ మాకు జాబ్ లాంటిదే అనీ, ఈ రంగంలో మాకు కూడా చాలా పని ఒత్తిడి వుంటుందని చెబుతూనే ఉంటాము. మా ఇంటీరియర్స్ అనేది కూడా ఒక ఇండస్ట్రీ లాంటిదే. వేరే వాటికి వున్నట్లే మేము చేసే పనికి కూడా చార్జెస్ వుంటాయని మెల్లగా నచ్చజెప్తాము. అయినా బేరాలు ఆడుతూనే ఉంటారు.

మహిళలకి ఈ రంగంలో నిలదొక్కుకునే అవకాశాలు వున్నాయంటారా?

అసలు ఏ వ్యాపారమైనా నిలబెట్టుకోవడం అనుకున్నత సులభం ఏమీ కాదు. అందునా మహిళలకూ మరీ కష్టం. నిలకడగా వుంటూ స్థిరత్వం సంపాదించాలి అనే దాన్ని నేను నమ్ముతున్నాను. ప్రతిరోజూ ఏ లక్ష్యంతో వ్యాపారం మొదలు పెట్టారో అదే శక్తితో పోరాడుతూ మన లక్ష్యం చేరుకోవాలి. ప్రతిరోజూ మన ఆలోచనలను ఎంచుకున్న లక్ష్యం వైపే దృష్టి పెడుతూ పని చేస్తూ ఉండాలి. ఇంట్లో ఏ వస్తువు ఎక్కడ వుండాలో, ఎలా వుంటే ఇల్లు అందంగా కనబడుతుందో మహిళలకే బాగా తెలుస్తుంది. కాబట్టి పట్టుదల ఉంటే ఈ రంగంలో మహిళలకు మంచి అవకాశాలు ఉన్నాయి.

ఇంటీరియర్ డిజైనింగ్ ఎంచుకునే నేటి మహిళలకు మీరిచ్చే సలహా..?

నా ఉద్దేశంలో నిస్సందేహంగా ఇది మహిళల నేతృత్వంలో నడిచే ఒక ఇండస్ట్రీ. ఇది పూర్తిగా మహిళల ఆసక్తిపైనే ఆధారపడి ఉంటుంది. ఇంటీరియర్స్ డిజైనర్ వృత్తిని సరియైన పంథాలో అనుసరిస్తూ, స్పష్టమైన ఉద్దేశాలతో ఈ వృత్తిని ఎంచుకునే మహిళలను నేను కచ్చితంగా ప్రోత్సహిస్తాను. ఎంచుకున్న ఏ రంగమైనా కష్టపడి పని చేస్తేనే మంచి ఫలితాలుంటాయి. అప్పుడు విజయం కచ్చితంగా సాధించవచ్చు. ఇంటీరియర్ డిజైనింగ్ మహిళలోని ఊహా శక్తిని వెలికి తీస్తుంది. ఈ రంగంలో కూడా స్త్రీలకి ఎన్నో అవకాశాలు ఉన్నాయి. ఇది ఎప్పుడూ 'క్యాట్ వాక్' కాదు, చాలా కష్ట పడాలి. ఈ రంగం ఎంచుకునే వారికి మూడువందల అరవై రోజులూ పనే. వారాంతాలు, సెలవులు అంటూ వుండవు. మన ఫోకస్ ఎప్పుడూ పని మీదే ఉండాలి. అప్పుడు తప్పక సక్సెస్ అవుతారు. ఇది నా అనుభవం నుండి చెబుతున్న మాట.

అంటే 24 గంటలు పని చేయాల్సిందే అంటారు?

అంతే.... ఒక ఇల్లు, ఫ్లాట్, ఆఫీస్ ఇలా ఏదైనా ఇంటీరియర్ వర్క్‌ని ఒప్పుకున్నాము అంటే నా అప్రోచ్ ఎల్లప్పుడూ పర్ఫెక్ట్‌గా కస్టమర్స్ కోరిన విధంగా ఫైనల్ రిజల్ట్ వచ్చేలా చూడటంపైనే వుంటుంది. ఫోకస్ ఎల్లప్పుడూ నా కస్టమర్స్ సంతృప్తి పైనే వుంటుంది. నా పయనం ఎప్పుడూ ఒప్పుకున్న వాటిని సరిగ్గా అమలు చేసి అనుకున్న టాస్క్‌ని పూర్తి చేయటం పైనే వుంటుంది.

ఓ మహిళా వ్యాపారవేత్తగా ఈ రంగంలో మీ అనుభవాలు..?

ఈ రంగంలో అడుగు పెట్టిన తర్వాత సుమారు నూటయాభైకి పైగా ప్రాజెక్ట్‌లు చేశాను. వీటిపై నాకు కొంత అవగాహన ఉంది. ప్రాజెక్ట్ పెద్దదా చిన్నదా, సులభమైందా లేదా కష్టమైనదా అని ఆలోచించను. మా డిజైనింగ్ పట్ల కస్టమర్ హ్యాపీగా ఉండాలి. ఒక ప్రాజెక్ట్ మా దగ్గరికి వచ్చిందంటే ఒక ప్రత్యేకమైన సవాలుతో వస్తుంది. ఒక్కో ప్రాజెక్ట్ ఒక్కో అనుభవాన్ని నేర్పుతుంది. మరింత కొత్త డిజైనింగ్స్‌తో ముందుకు వెళ్ళేందుకు మాకు సహాయం చేస్తుంది. ఎన్నో కొత్త అనుభవాలను ఇస్తుంది.

ఇంటీరియర్ డిజైనింగ్‌లో మీ సంస్థ ప్రత్యేకతలు..?

నేను ఇంటీరియర్ డిజైన్ ఫ్రీలాన్సర్‌ని. మా సంస్థ రెసిడెన్షియల్, కమర్షియల్, రిటైల్ సెక్టార్‌లో ఎండ్ టు ఎండ్ ఇంటీరియర్ సొల్యూషన్స్‌లో ప్రత్యేక మైంది. భారతదేశంలో అన్నీ చోట్లా సేవలు అందిస్తాం. మా ప్రస్తుత ప్రాజెక్ట్‌లు హైదరాబాద్, నాగ్‌పూర్, పూణేలో నడుస్తున్నాయి. మేము ఒప్పుకున్న ప్రాజెక్ట్స్ అన్నీ పూర్తయి కస్టమర్స్‌కి హాండోవర్ చేసే సమయంలో వారు అనుకున్నరీతిలో పూర్తయిందని భావించి తృప్తిగా ఉంటే అవే మాకూ సంతోషకరమైన సంఘటనలు. వారి కండ్లలోని సంతృప్తికరమైన మెరుపులు చూసి నేను విజయం సాధించినట్లుగా ఫీల్ అవుతుంటాను.

అయితే ఆసక్తి ఉన్న వారు ఎవరైనా ఈ రంగంలో రావొచ్చంటారు..?

కచ్చితంగా రావొచ్చు. అయితే ఈ ఇంటీరియర్ రంగాన్ని ఎంచుకునే ముందు అన్నీ క్షుణ్ణంగా తెలుసుకోవాలి. ఏ మార్గాన్ని ఎంచుకోవాలనుకుంటున్నారో ముందే ఓ నిర్ధారణకు రావాలి. అంటే స్టూడియో లేదా కార్పొరేట్‌లో ఉద్యోగమా లేదా సొంత కంపెనీని ప్రారంభించడం ఇలా దేన్ని ఎంచుకోవాలో ముందే ఓ ప్లాన్ ఉండాలి. ఇది చాలా క్లిష్టమైన నిర్ణయం.. అలాగే ఏ రంగంలో స్థిరపడ దలుచుకున్నారు అనేది ఎంత త్వరగా నిర్ణయం తీసుకుంటే అంత మంచిది. తాత్సారం చేయకూడదు. కాలం గడిచి పోతూ వుంటుంది. అయితే నిర్ణయం తీసుకునే ముందు మాత్రం బాగా ఆలోచించాలి.

ఈ రంగంలోనూ కాంపిటీషన్ ఉంటుందా?

ఈ రంగంలో ఉన్న ప్రతి డిజైనర్ గొప్పవాళ్లే అని నేను నమ్ముతాను. ప్రతి డిజైన్ ప్లాన్ (దృక్పథం) డిజైనర్ నుండి డిజైనర్‌కు, క్లయింట్ నుండి క్లయింట్‌కు మారుతూ ఉంటుంది. ఇందులో చేసే పనిలో మీకు మీరే పోటీగా మారాలి. అప్పుడే కొత్తదనం కనిపిస్తుంది. ఈ రంగంలో ఎంత కొత్తదనం చూపిస్తే అంత గొప్పగా ఎదగొచ్చు.

- మణి నాథ్ కోపల్లె, 9703044410



కాంగ్రెస్, బీఆర్ఎస్ అవినీతి పార్టీలు



(మొదటిపేజీ తరువాయి)

ఆయన పాల్గొన్నారు. అనంతరం భాగ్యలక్ష్మి ఆలయంలో హైదరాబాద్ బీజేపీ అభ్యర్థి మాధవిలతతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎల్బీ స్టేడియంలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో కనీసం డజన్ స్థానాల్లోనైనా ఎంపీ అభ్యర్థులను గెలిపించాలనీ, ప్రతి ఒక్కరూ తమ బూత్ లెవల్‌లో కష్టపడి ఎక్కువ ఓట్లు సాధించేలా చూడాలని పిలుపునిచ్చారు.కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లీస్ నుంచి ప్రజలకు విముక్తి కలిగిస్తారా? లేదా? అని శ్రేణులను ప్రశ్నించారు. మజ్లిస్ పార్టీ ఎవరు అధికారంలో ఉంటే వారికి వత్తాసు పలుకుతుందని విమర్శించారు. ఈ సారి హైదరాబాద్ స్థానంలో మజ్లిస్ పని ఖతమేనని చెప్పారు. ఇండియా కూటమిలోని పార్టీల్లో ఎక్కువగా కుటుంబ పార్టీలే ఉన్నాయనీ, వాటి అధినేతలు తమ కొడుకునో, కూతుర్నో సీఎంను చేయాలని చూస్తాయని చెబుతూ పలువురు నేతల పేర్లను ప్రస్తావించారు. అలాంటి నేతలు ప్రజల క్షేమాన్ని పట్టించుకుంటారా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలో టూజీ, భోఫోర్స్, ఇలా నింగి నుంచి నేల వరకు అన్నింటినీ దోచుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో అవినీతి జరగలేదని రేవంత్‌రెడ్డి చెప్పగలరా? అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు మంచి చేస్తామంటే ఎవ్వరూ నమ్మరని చెప్పారు. మోడీ పదేండ్ల పాలలో 25 పైసల అవినీతి కూడా జరగలేదన్నారు. కేసీఆర్ నీళ్ళు, నిధులు, నియామకాలు ఇస్తామని చెప్పి తెలంగాణ ప్రజలను మోసం చేశారని విమర్శించారు. మోడీ పాలనలో లాల్‌చౌక్‌లో జాతీయ జెండా ఎగురవేశామనీ, ఇప్పుడు పోలీసు పహారా మధ్య వెళ్లాల్సిన పరిస్థితి లేదని అన్నారు. 500 ఏండ్ల అయోధ్య మందిరం ఏర్పాటు కలను నెరవేర్చామన్నారు. మన దేశంలోకి ఉగ్రవాదులు జొరబడాలని చూస్తే తరితరిమి కొట్టామన్నారు. సీఏఏ నాగరికత ఇచ్చేదనీ, హరించేది కాదని చెప్పారు. రైతులకు, యువతకు, మహిళలకు, దళితులకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు అండగా ఉండబోవన్నారు. వారి అభివృద్ధి కోసం పాటుపడేది బీజేపీనేనని నొక్కి చెప్పారు. దేశంలో 400 సీట్లలో గెలిపించి మూడోసారి మోడీని ప్రధానిని చేయాలని కోరారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ..ఎన్నికల ప్రచారానికి శ్రేణులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రియల్టర్లు, బిల్డర్లు, పెద్దపెద్ద వ్యాపారుల నుంచి రాహుల్‌గాంధీ ట్యాక్స్‌ను వసూలు చేస్తున్నదని ఆరోపించారు. కేసీఆర్ నియంతృత్వ పాలనలో తెలంగాణ అభివృద్ధి చెందలేదన్నారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ మాట్లాడుతూ..రాముడి పేరుతో బరాబర్ ఓట్లు అడుగుతామన్నారు. తమ వెనుక రాముడు, ఆయన వారసుడు మోడీ ఉన్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేయాలంటే రూ.5 లక్షల కోట్ల బడ్జెట్ కావాలనీ, ప్రస్తుత బడ్జెట్‌లో వాటి కోసం కేవలం రూ.53 వేల కోట్లు చూపారని విమర్శించారు. బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు లక్ష్మణ్ మాట్లాడుతూ.. 40 రోజులు గ్రామాల్లోనే ఉండి బీజేపీ గెలుపు కోసం కృషి చేయాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సభలో బీజేపీ ఎంపీ అభ్యర్థులు ఈటల రాజేందర్, బూర నర్సయ్యగౌడ్, భరత్, బీబీ పాటిల్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, డి.అర్వింద్‌కుమార్, మాధవీలత, బీజేపీ ఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, వెంకటరమణారెడ్డి, హరీశ్‌బాబు, నేతలు ప్రకాశ్‌రెడ్డి, ప్రేమేందర్‌రెడ్డి, బి.శృతి తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా వచ్చింది దోచుకోవడానికే..



(మొదటిపేజీ తరువాయి)

ఇచ్చిన హామీని మోడీ నెరవేర్చలేదని తెలిపారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల హామీ మేరకు పదేండ్లలో 22 కోట్ల మందికి ఉద్యోగాలివ్వాల్సిందనీ, అలా ఇచ్చి ఉంటే తెలంగాణలో 70 లక్షల మందికి ఉద్యోగాలు వచ్చేవన్నారు. పార్లమెంటు తలుపులను మూసి తెలంగాణ ఇచ్చారంటూ రాష్ట్ర ప్రజలను మోడీ అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ లది ఎప్పుడూ చీకటి ఒప్పందమేనని రేవంత్ రెడ్డి విమర్శించారు. ఒక పార్టీ తొమ్మిది స్థానాల్లో అభ్యర్థులను ప్రకటిస్తే, వాటిని కాదని మరో పార్టీ నాలుగు స్థానాల్లో ప్రకటిస్తున్నాయని గుర్తుచేశారు. ఎవరైనా కాంగ్రెస్ వైపు చూస్తే అలాంటి వారి గుడ్లు పీకీ గోలీలు ఆడుకోవాలని మహిళలకు పిలుపునిచ్చారు.

మహిళా నాయకత్వంలో కాంగ్రెస్

కాంగ్రెస్ పార్టీ ఒక మహిళా నాయకత్వంలో పని చేస్తున్నదని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మాట తప్పకుండా మడమ తిప్పకుండా తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ, ఆరు గ్యారంటీలను ఇచ్చి అమలు చేస్తున్నారని చెప్పారు. కట్టెలపొయ్యిపై వంటలతో మహిళలు పడే బాధను చూడలేక యూపీఏ హయాంలోనే రూ.400కే గ్యాస్‌ను అందించారని తెలిపారు. ఇందిరాగాంధీ, సోనియాగాంధీ, ప్రియాంకగాంధీ...ఇలా కాంగ్రెస్ అంటేనే మహిళాశక్తితో నిండి ఉందని తెలిపారు.

బీఆర్ఎస్‌కు ఆడబిడ్డల ఉసురు

బీఆర్ఎస్ పార్టీకి మహిళల ఉసురుతాకిందని రేవంత్ రెడ్డి అన్నారు. ఆడబిడ్డల కంట కన్నీరు మంచిది కాదనీ పెద్దలు చెబుతారనీ, వారిని ఏడిపించిన కేసీఆర్‌ను బండకేసి కొట్టారని తెలిపారు. మళ్లీ ఓట్ల కోసం వస్తే చేతులకు రొట్టెలు చేసే కర్రతో వాతలు పెట్టాలని సూచించారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో మహిళా సంఘాలను దివాళా తీయించారనీ, వారి ఆశీర్వాదంతో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని చెప్పారు. అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే తమ పార్టీ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ కవరేజీ రూ.10 లక్షల పెంపుతో పాటు ఒక్కో హామీని అమలు చేసుకుంటూ ముందుకు పోతున్నదని వివరించారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇండ్ల పథకాలను కూడా ప్రారంభించుకున్నామని గుర్తుచేశారు.

కాంగ్రెస్ ప్రజలకు నచ్చేలా పాలన చేస్తుంటే తమ ప్రభుత్వాన్ని పడగొడతామని కేసీఆర్ కుటుంబం ఫామ్ హౌస్‌లో చిందులు వేస్తోందని రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి కుర్చీలో దొరలే కూర్చోవాలా? రైతు బిడ్డ కూర్చో కూడదా? కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు కేసీఆర్, మోడీ కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. మీరు ఓట్లేసి తెచ్చుకున్న ప్రభుత్వాన్ని పడగొడతామంటే ఊరుకుంటారా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో 93 లక్షల మంది ఓట్లతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందనీ, తాను ముఖ్యమంత్రి అయ్యానని రేవంత్ గుర్తుచేశారు. అయ్య పేరు మీదనో, మరొకరి పేరు మీదనో కాలేదని స్పష్టం చేశారు.

ఐదేండ్లలో కోటీశ్వరులుగా కోటి మంది మహిళలు

రాబోయే ఐదేండ్లలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే బాధ్యత తనదని రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం స్వయం సహాయక మహిళా సంఘాల్లో 63 లక్షల మంది సభ్యులుగా ఉన్న వారి సంఖ్యను కోటికి పెంచాలని సూచించారు. నెల రోజుల్లో హైదరాబాద్ మాదాపూర్‌లోని శిల్పారామం పక్కన మహిళా సంఘాలకు స్టాల్స్ ఏర్పాటు చేస్తామన్నారు. ఆయా సంఘాల ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తామని హామీ ఇచ్చారు. రాబోయే కొద్ది రోజుల్లో 10 లక్షల మంది మహిళలతో కవాతు చేస్తామనీ, తమ సైన్యం, బలగం మహిళలేనని ఆయన నొక్కి చెప్పారు.

ఇబ్బందులున్నా ...కోటి రుణం ఇస్తాం : మల్లు భట్టి విక్రమార్క

ఆర్థిక ఇబ్బందులు ఎన్ని ఉన్నా సరే... ప్రతి సంఘానికి రూ.ఒక కోటి రుణం ఇస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఐదేండ్లలో సంఘాలకు రూ.ఒక లక్ష కోట్ల రుణాలిస్తామనీ, దాని వడ్డీని ప్రభుత్వమే చెల్లిస్తుందని స్పష్టం చేశారు. రుణబీమా సౌకర్యం కల్పిస్తుండటంతో ఎవరైనా దురదృష్టవశాత్తు మరణిస్తే వారి కుటుంబ సభ్యులు చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. మంత్రులు సీతక్క, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు మాట్లాడుతూ, మహిళల కోసం తమ ప్రభుత్వం తీసుకున్న కార్యక్రమాలను వివరించారు.

త్వరలో అర్హులందరికీ తెల్లరేషన్ కార్డు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని అర్హులందరికీ త్వరలో తెల్ల రేషన్ కార్డులందించాలని మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశం నిర్ణయించింది. క్యాబినెట్ నిర్ణయాలను సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మీడియాకు వివరించారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 చొప్పున రాష్ట్రవ్యాప్తంగా నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇండ్లను రూ.22,500 కోట్లతో నిర్మించేందుకు క్యాబినేట్ ఆమోద ముద్ర వేసింది. లబ్దిదారులను గ్రామసభల్లో ఎంపిక చేయనున్నట్టు మంత్రి తెలిపారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, విద్యుత్ కొనుగోలు ఒప్పందాల్లో జరిగిన అక్రమాలను నిగ్గుతేల్చేందుకు

విశ్రాంత న్యాయమూర్తులతో రెండు కమిటీలను నియమించింది. ప్రాజెక్టుల అవకతవకలపై విచారణ కమిటీకి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పినాకి చంద్రఘోష్ నేతృత్వం వహిస్తారు. విద్యుత్ కొనుగోలు టెండర్ల అవకతవకలపై హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి అధ్యక్షతన ప్రభుత్వం విచారణ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలు ఆయా అంశాలపై సమగ్రంగా విచారణ జరిపి వంద రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నాయి. ముదిరాజ్, యాదవ, కురుమ, మున్నారుకాపు, పద్మశాలి, పెరిక, లింగాయత్, మేర, గంగపుత్ర, ఆర్యవైశ్య, రెడ్డి, మాదిగ, మాల, కొమురం భీం ఆదివాసీ, సంత్ సేవాలాల్ లంబాడి, ఏకలవ్య మొదలగు 16 కులాలకు కార్పొరేషన్ల ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలను మంత్రివర్గం ఆమోదించిందని పొంగులేటి తెలిపారు. ఔటర్ రింగ్‌రోడ్ చుట్టూ మహిళా రైతు బజార్ల ఏర్పాటు, స్వయం సహాయక సంఘాలు తయారుచేసిన ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకునేందుకు వీలుగా ఓఆర్ఆర్ పరిధిలో 25ఎకరాల్లో కాంప్లెక్స్ నిర్మాణాన్ని చేపట్టనున్నారు. వచ్చే మూడు రోజుల్లో 92శాతం రైతుల ఖాతాల్లో రైతుభరోసా డబ్బులు జమ చేయనున్నట్టు మంత్రి చెప్పారు.

డ్వాక్రా మహిళలను కోటీశ్వరులుగా చేసేందుకు 15 అంశాలతో మహిళా శక్తి ప్రత్యేక పథకం తీసుకురావాలన్న ప్రభుత్వ ప్రతిపాదనకు మంత్రివర్గం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 2008 డీఎస్సీ అభ్యర్థులకు మినిమం పే స్కేలు ఇచ్చి ఉద్యోగాల్లోకి తీసుకోవాలని నిర్ణయించింది. వేసవికాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖలను రాష్ట్ర మంత్రివర్గం ఆదేశించినట్టు పొంగులేటి వివరించారు. మీడియా సమావేశంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు.

ఎట్టకేలకు...

న్యూఢిల్లీ : 2019 నుంచి తన వద్ద కొనుగోలు చేసిన, నగదుగా మార్చుకున్న ఎన్నికల బాండ్ల సమాచారాన్ని ఎస్‌బీఐ మంగళవారం కేంద్ర ఎన్నికల సంఘానికి అందజేసింది. ఎస్‌బీఐ నుంచి సమాచారం అందిందని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఎన్నికల కమిషన్ ధ్రువీకరించింది. ఎన్నికల బాండ్ల వివరాలు అందించేందుకు జూన్ 30వ తేదీ వరకూ గడువు ఇవ్వాలంటూ ఎస్‌బీఐ చేసిన అభ్యర్థనను సుప్రీంకోర్టు సోమవారం తోసిపుచ్చిన విషయం తెలిసిందే. ఆ సమాచారాన్ని మంగళవారం సాయంత్రానికి ఎన్నికల కమిషన్‌కు అందజేయాల్సిందేనని న్యాయస్థానం ఆదేశించింది. ఎస్‌బీఐ నుంచి అందిన వివరాలను ఈ నెల 15వ తేదీన వెబ్‌సైట్‌లో ప్రజలకు బహిర్గతం చేయాలని ఎన్నికల కమిషన్‌కు కూడా ఆదేశాలు జారీ చేసింది. కాగా తమకు అందిన సమాచారం 'ముడి' ఫార్మట్‌లో ఉన్నదని, దానిని గడువు లోగా అప్‌లోడ్ చేయడం సవాలుతో కూడుకున్న పనేనని ఎన్నికల కమిషన్ వర్గాలు తెలిపాయి. ఎన్నికల బాండ్ల పథకం రాజ్యాంగ విరుద్ధమని గత నెల 15వ తేదీన సుప్రీంకోర్టు తీర్పు చెప్పిన విషయం తెలిసిందే. ఎన్నికల బాండ్లకు సంబంధించిన వివరాలను ఈ నెల 6వ తేదీ లోగా ఈసీకి అందజేయాలని ఎస్‌బీఐని ఆదేశించింది.

గుట్టలో నన్నెవరూ అవమానించలేదు..

నవతెలంగాణ-హైదరాబాద్ బ్యూరో

యాదగిరి గుట్ట దేవాలయంలో తనకేదో అవమానం జరిగినట్టు సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్నారనీ, అది అవాస్తవమని ఉపముఖ్యమంత్రి అన్నారు. తాను పాదయాత్ర సమయంలోనూ యాదగిరిగుట్టలో లక్ష్మీనరసింహస్వామి దర్శనం చేసుకున్నాననీ, తిరిగి అధికారంలోకి వచ్చి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొక్కు తీర్చుకోవడంలో భాగంగా తానే ఓ చిన్న పీట మీద కూర్చుని, అర్చకుల ఆశీర్వాదం తీసుకున్నానని తెలిపారు. దాన్ని సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేశారనీ, తనను ఎవరూ అవమానించలేదని స్పష్టం చేశారు. "ఉప ముఖ్యమంత్రిగా, విద్యుత్, ఆర్థిక, ప్రణాళికా శాఖల మంత్రిగా ఈ రాష్ట్ర నిర్ణయాలను శాసిస్తున్నాను. ఎవరికో తలవంచేవాడిని కాదు. ఆత్మగౌరవం లేని వాడిని అసలే కాదు" అని అన్నారు. బహుశా ఆ ఫోటో చూసి ఎవరైనా మానసికంగా బాధపడితే మనస్ఫూర్తిగా అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లు

పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే ఉద్యోగార్థుల కోసం రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్స్‌ను త్వరలో ఏర్పాటు చేస్తామని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. తన పాదయాత్ర సందర్భంగా అనేకమంది పేదలు తమ పిల్లలకు చదువులు చెప్పించి, లక్షల రూపాయలు ఖర్చు పెట్టి హైదరాబాద్ వంటి చోట్ల పోటీ పరీక్షలకు శిక్షణ ఇప్పించడం తలకు మించిన ఆర్థికభారంగా మారుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారని చెప్పారు. దానికోసమే ప్రసిద్ధి చెందిన అధ్యాపకులతో ఆన్‌లైన్ ద్వారా బోధన ఇప్పించాలని, ఉద్యోగార్థులు హైదరాబాద్ రాకుండా ఎక్కడిక్కడే నాలెడ్జ్ సెంటర్లలో శిక్షణ తీసుకొనేలా ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, గ్రేటర్ హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్యేలు జీ వినోద్, జీ వివేక్, రాజ్‌ఠాకూర్, ఐఎన్‌టీయూసీ నాయకులు జనక్ ప్రసాద్, మాజీ ఎంపీ అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. సీఎమ్‌డీ ఎన్ బలరాం కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.

43 మందితో రెండో జాబితా

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిచే 43 మంది అభ్యర్థులతో కాంగ్రెస్ రెండో జాబితా విడుదల చేసింది. ఇందులో అసోం (12), గుజరాత్ (7), మధ్యప్రదేశ్ (10), రాజస్థాన్(10), ఉత్తరాఖండ్ (3), డమన్ అండ్ డయ్యూ (1) రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. ఈ జాబితాలో 10 జనరల్, 13 ఓబీసీ, 10 ఎస్సీ, 9 ఎస్టీ, 1 మైనార్టీ అభ్యర్థికి అవకాశం కల్పించారు. మంగళవారం ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కేసీ వేణుగోపాల్ రెండో జాబితాను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సోమవారం జరిగిన కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ(సిఈసి)లో మహారాష్ట్ర, గుజరాత్, అసోం, మధ్రప్రదేశ్, రాజస్థాన్‌కు సంబంధించిన రాష్ట్రాల అభ్యర్థుల ఎంపికపై చర్చించి నిర్ణయం చేసినట్టు తెలిపారు. కాంగ్రెస్ పార్టీది ప్రజల అజెండా అన్నారు. పేదల కోసం కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తుందని వివరించారు.



ఏడాదిన్నరకు పైగా విరామానికి తెర పడనుంది. రోడ్డు ప్రమాదంలో ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడిన భారత స్టార్ క్రికెటర్ రిషబ్ పంత్ మళ్లీ మైదానంలో అడుగుపెట్టనున్నాడు. 14 నెలల కఠోర రిహాబిలిటేషన్ అనంతరం రిషబ్ పంత్ మ్యాచ్ ఫిట్‌నెస్ సాధించినట్టు బీసీసీఐ వెల్లడించింది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2024లో వికెట్ కీపర్, బ్యాటర్‌గా ఆడేందుకు ఫిట్‌నెస్ క్లియరెన్స్ ఇచ్చింది. మార్చి 23న ఢిల్లీ క్యాపిటల్స్, పంజాబ్ కింగ్స్ మ్యాచ్‌తో రిషబ్ పంత్ పునరాగమనం చేయనున్నాడు.



పంత్ వస్తున్నాడు

• మహ్మద్ షమి, ప్రసిద్ కృష్ణ అవుట్ • ఫిట్‌నెస్‌పై బీసీసీఐ ప్రకటన

నవతెలంగాణ-బెంగళూర్ :

భారత క్రికెట్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న రిషబ్ పంత్ రీ ఎంట్రీకి ముహూర్తం కుదిరింది. 2022, డిసెంబర్ 30న రూర్కీ సమీపంలో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రిషబ్ పంత్.. ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడిన సంగతి తెలిసిందే. ప్రమాదంలో రిషబ్ పంత్ తీవ్రంగా గాయాల పాలవగా.. అతడికి అంతర్జాతీయ వైద్య నిపుణులు పలు శస్త్రచికిత్సలు చేశారు. అనంతరం బెంగళూర్‌లోని జాతీయ క్రికెట్ అకాడమీలో 14 నెలలు కఠోర రిహాబిలిటేషన్ పూర్తి చేసుకున్నాడు. రీ ఎంట్రీపై కన్నేసిన రిషబ్ పంత్ బెంగళూర్ శివారులోని అలూరు గ్రౌండ్స్‌లో ఎన్‌సీఏ ఫిజియోల సమక్షంలో మ్యాచ్ ప్రాక్టీస్ చేసిన సంగతి తెలిసిందే. రిషబ్ పంత్ ఫిట్‌నెస్ పురోగతి, మ్యాచ్ ప్రాక్టీస్ అనంతరం రానున్న ఐపీఎల్ 2024లో అతడు ఆడేందుకు సిద్ధంగా ఉన్నాడని ఎన్‌సీఏ నివేదిక ఇచ్చింది. దీంతో రిషబ్ పంత్ 2024 ఐపీఎల్‌కు అందుబాటులో ఉన్నాడని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) మంగళవారం మెడికల్ అప్‌డేట్ ఇచ్చింది.

ఫిట్‌నెస్ సాధించాడు :

'2022 డిసెంబర్ 30న జరిగిన రోడ్డు ప్రమాదం నుంచి రిషబ్ పంత్ కోలుకున్నాడు. ఐపీఎల్ 2024లో ఆడేందుకు పంత్ మ్యాచ్ ఫిట్‌నెస్ సాధించాడు. వికెట్ కీపర్, బ్యాటర్‌గా రిషబ్ పంత్ రానున్న ఐపీఎల్‌లో ఆడవచ్చు' అని బీసీసీఐ ఓ ప్రకటనలో తెలిపింది. బీసీసీఐ ప్రకటనకు ముందే, బోర్డు కార్యదర్శి జై షా కీలక వ్యాఖ్యలు చేశారు. రిషబ్ పంత్ 2024 టీ20 ప్రపంచకప్‌లో ఆడితే భారత్‌కు బోనస్‌గా ఉంటుందని తెలిపాడు. 'రిషబ్ పంత్ ప్రాక్టీస్‌లో వికెట్ కీపింగ్‌తో పాటు బ్యాటింగ్ బాగా చేస్తున్నాడు. రానున్న టీ20 ప్రపంచకప్‌లో రిషబ్ పంత్ ఆడితే అది భారత్‌కు పెద్ద అనుకూలత అవుతుంది. భారత క్రికెట్‌కు రిషబ్ పంత్ విలువైన ఆటగాడు. వికెట్ కీపింగ్ చేయగలిగితే ప్రపంచకప్‌లో ఆడేందుకు మార్గం సుగమం అవుతుంది. ఐపీఎల్‌లో పంత్ ఏం చేస్తాడో చూద్దాం' అని జై షా అన్నాడు. ఇక రిషబ్ పంత్ బెంగళూర్‌లో కఠోర సాధన చేస్తున్నాడు. అలూరు గ్రౌండ్స్‌లో రిషబ్ పంత్ ఫిబ్రవరి నుంచి సుమారు 20 మ్యాచ్ అనుకరణ కసరత్తులు చేశాడు. ఎన్‌సీఏ నిపుణుల ఆధ్వర్యంలో 20 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేశాడు. ఈ సమయంలో పంత్ ఎటువంటి అసౌకర్యానికి గురి కాలేదని ఎన్‌సీఏ ఫిజియోలు నివేదికలో పేర్కొన్నారు. అయితే, రిషబ్ పంత్ వికెట్ కీపింగ్ సాధన మార్చిలోనే



మొదలైంది. ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు రిషబ్ పంత్ సారథ్యం వహిస్తాడని ఆ ఫ్రాంచైజీ యజమాని పార్థ్ జిందాల్ ప్రకటించాడు. అయితే, ఐపీఎల్ ప్రథమార్థం మ్యాచుల్లో పంత్ స్పెషలిస్ట్ బ్యాటర్‌గా ఆడనున్నాడు. మ్యాచ్ సందర్భంగా రిషబ్ పంత్ ఫిట్‌నెస్‌పై ఓ అంచనాకు వచ్చిన తర్వాతే వికెట్ కీపింగ్ బాధ్యతలు తీసుకుంటాడని ఫ్రాంచైజీ స్పష్టం చేసింది.

ఆ ఇద్దరు అవుట్ :

భారత సీనియర్ పేసర్, 2023 ఐసీసీ ప్రపంచకప్ హీరో మహ్మద్ షమి, యువ పేసర్ ప్రసిద్ కృష్ణలు 2024 ఐపీఎల్‌కు దూరమయ్యారు. ఐపీఎల్ 2023లో మహ్మద్ షమి గుజరాత్ టైటాన్స్ తరఫున 23 వికెట్లు పడగొట్టాడు. టైటాన్స్ రన్నరప్‌గా నిలువగా షమి పర్పుల్ క్యాప్ అందుకున్నాడు. హార్దిక్ పాండ్య సేవలు ముంబయికి కోల్పోయిన టైటాన్స్‌కు మహ్మద్ షమి లేకపోవటం పెద్ద లోటు. రంజీ ట్రోఫీలో కర్ణాటక తరఫున ఆడుతూ గాయపడిన ప్రసిద్ కృష్ణ వరుసగా రెండో సీజన్‌కు రాజస్థాన్ రాయల్స్‌కు ఆడటం లేదు. ఈ ఇద్దరూ ఎప్పుడు అందుబాటులోకి వస్తారు, మ్యాచ్ ఫిట్‌నెస్ సాధిస్తారనే అంశాలపై బోర్డు స్పష్టత ఇవ్వలేదు.

ముంబయి రంజీ ట్రోఫీలో 42వ టైటిల్ లాంఛనం చేసుకుంది!. యువ బ్యాటర్ ముషీర్ ఖాన్ (136) సెంచరీతో చెలరేగగా.. కెప్టెన్ అజింక్య రహానె (73), శ్రేయస్ అయ్యర్ (95) అర్థ సెంచరీలు బాదారు. రెండో ఇన్నింగ్స్‌లో 418 పరుగుల భారీ స్కోరు సాధించిన ముంబయి.. విదర్భకు 538 పరుగుల రికార్డు లక్ష్యాన్ని నిర్దేశించింది. అద్భుతం ఏదైనా జరిగితే తప్ప ముంబయి 42వ సారి రంజీ విజేతగా నిలువటం ఖాయమే!.

ముషీర్ ఖాన్ సెంచరీ

- ముంబయి రెండో ఇన్నింగ్స్ 48/10
- విదర్భ లక్ష్యం 538, ప్రస్తుతం 10/0

రాణించిన శ్రేయస్, రహానె

నవతెలంగాణ-ముంబయి :



యువ ఆటగాడు, సర్ఫరాజ్ ఖాన్ సోదరుడు ముషీర్ ఖాన్ (136, 326 బంతుల్లో 10 ఫోర్లు) రంజీ ట్రోఫీ ఫైనల్లో సూపర్ సెంచరీ నమోదు చేశాడు. సీనియర్ ఆటగాళ్లు విఫలమైన తరుణంలో వరుస ఇన్నింగ్స్‌ల్లో నిలకడగా పరుగులు సాధించిన ముషీర్ ఖాన్.. టైటిల్ పోరులోనూ తడఖా చూపించాడు. విదర్భ బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొని 326 బంతుల్లో 10 బౌండరీలతో బాధ్యతాయుత శతకం సాధించాడు. కెప్టెన్ అజింక్య రహానె (73, 143 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) వరుస వైఫల్యాల నుంచి బయటపడ్డాడు. అర్థ సెంచరీతో రాణించాడు. ముషీర్ ఖాన్‌తో కలిసి మూడో వికెట్‌కు 130 పరుగులు జోడించిన రహానె ముంబయిని భారీ స్కోరు దిశగా నడిపించాడు. రహానె నిష్క్రమించినా.. మరో సీనియర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ (95, 111 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్స్‌లు)తో కలిసి ముషీర్ ఖాన్ కీలక భాగస్వామ్యం నమోదు చేశాడు. అయ్యర్, ముషీర్ జోడీ నాల్గో వికెట్‌కు 168 పరుగులు జత చేసింది. ఈ జోడీ మెరుపులతో ముంబయి దాదాపుగా మ్యాచ్‌ను విదర్భ నుంచి లాగేసుకుంది. సెంచరీ ముంగిట అయ్యర్ నిష్క్రమించినా.. టెయిలెండర్లు విలువైన జరుగులు చేశారు. శామ్స్ ములాని (50, 85 బంతుల్లో 6 ఫోర్లు) అర్థ సెంచరీతో ధనాధన్ మోత మోగించాడు. 130.2 ఓవర్లలో 418 పరుగులకు ముంబయి రెండో ఇన్నింగ్స్‌లో ఆలౌటైంది. విదర్భకు 538 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. ఛేదనలో విదర్భ 10/0తో పోరాడుతుంది. ఓపెనర్లు అతర్వ (3), ధ్రువ్ (7) అజేయంగా ఆడుతున్నారు. మరో రెండు రోజుల ఆట మిగిలి ఉండగా విదర్భ విజయానికి 528 పరుగులు పరుగులు అవసరం కాగా.. ముంబయికి 10 వికెట్లు అవసరం. విదర్భ బౌలర్లలో హర్ష్ దూబె (5/144), యశ్ ఠాకూర్ (3/79) రాణించారు.

మెరిసిన మాస్టర్ బ్లాస్టర్ :

ముంబయి, విదర్భ రంజీ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌కు మాస్టర్ బాస్టర్ సచిన్ టెండూల్కర్ హాజరయ్యారు. దేశవాళీ క్రికెట్‌లో ప్రతిష్టాత్మక టైటిల్ పోరు మూడో రోజు ఆటకు చూసేందుకు సచిన్ టెండూల్కర్ వాంఖడే



స్టేడియానికి వచ్చారు. మాజీ క్రికెటర్లు, ముంబయి క్రికెట్ అసోసియేషన్ ఆఫీస్ బేరర్లతో కలిసి ఆటను వీక్షించారు. 'ఫైనల్లో ముంబయి రెండో ఇన్నింగ్స్‌లో ఎంతో క్రమశిక్షణ, సహనం, పట్టుదలతో కూడిన ఆటతీరు కనబరిచింది. రహానె, ముషీర్ భాగస్వామ్యం ముంబయిని ముందజంలో నిలుపగా.. శ్రేయస్, ముషీర్ భాగస్వామ్యం మ్యాచ్‌ను ప్రత్యర్థి నుంచి లాగేసుకుంది. ముంబయి క్రికెట్ సంఘం స్నేహితులు, సహచర క్రికెటర్లతో కలిసి మ్యాచ్‌ను వీక్షించటం బాగుంది' అని సచిన్ టెండూల్కర్ 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు.

సంక్షిప్త స్కోరు వివరాలు :

ముంబయి తొలి ఇన్నింగ్స్ : 224/10
విదర్భ తొలి ఇన్నింగ్స్ : 105/10
ముంబయి రెండో ఇన్నింగ్స్ : 418/10
విదర్భ రెండో ఇన్నింగ్స్ : 10/0

జైస్వాల్‌కు ఐసీసీ అవార్డు

ప్లేయర్ ఆఫ్ ది మంత్ సొంతం



దుబాయ్ : భారత బ్యాటింగ్ యువ సంచలనం యశస్వి జైస్వాల్ ఐసీసీ అవార్డును సొంతం చేసుకున్నాడు. ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌లో రెండు ద్వి శతకాలు సహా 712 పరుగులు సాధించిన యశస్వి ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్ (ఫిబ్రవరి)గా నిలిచాడు. ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన భారత బ్యాటర్‌గా నిలిచిన యశస్వి.. విశాఖపట్నం, రాజ్‌కోట్ టెస్టుల్లో ద్వి శతకాలు బాదాడు. 'ఐసీసీ అవార్డు దక్కటం ఆనందంగా ఉంది. భవిష్యత్‌లో మరిన్ని సాధిస్తానని ఆశిస్తున్నాను. ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌ను ఆస్వాదించాను. రాజ్‌కోట్‌లో ద్వి శతక సంబురాలు చేసుకున్నప్పుడు జీవితంలో ఉత్తమ క్షణాలను అనుభవించాను' అని యశస్వి జైస్వాల్ అన్నాడు. 22 ఏండ్ల వయసులోనే రెండు డబుల్ సెంచరీలు సాధించిన జాబితాలో సర్ డొనాల్డ్ బ్రాడ్‌మన్, వినోద్ కాంబ్లి సరసన నిలిపింది. న్యూజిలాండ్ ఆటగాడు కేన్ విలియమ్సన్, పథుమ్ నిశాంక (శ్రీలంక)లను వెనక్కి నెట్టి ఈ అవార్డును జైస్వాల్ గెల్చుకున్నాడు.

సింధు ముందంజ

• ఆల్ ఇంగ్లాండ్ చాంపియన్‌షిప్స్



బర్మింగ్‌హామ్ : భారత అగ్ర షట్లర్ పి.వి సింధు ఆల్ ఇంగ్లాండ్ చాంపియన్‌షిప్స్‌లో ముందంజ వేసింది. మహిళల సింగిల్స్‌లో రెండో రౌండ్లోకి ప్రవేశించింది. మంగళవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో సింధుకు వాకోవర్ లభించింది. వరల్డ్ నం.26 లి యెవని (జర్మనీ) తొలి గేమ్‌ను 21-10తో నెగ్గిన తర్వాత లీ రేసు నుంచి తప్పుకుంది. రెండో రౌండ్లో దక్షిణ కొరియా స్టార్ అన్ సె యంగ్‌తో సింధు తలపడనుంది. ఆకర్షి కశ్యప్ 16-21, 11-21తో, హెచ్.ఎస్ ప్రణయ్ 21-14, 13-2, 13-21తో పరాజయం పాలయ్యారు.

జకోవిచ్‌కు చుక్కెదురు

• ఇండియన్ వెల్స్ మూడో రౌండ్లో ఓటమి



ఇండియన్ వెల్స్ : ఐదుసార్లు చాంపియన్, వరల్డ్ నం.1 నొవాక్ జకోవిచ్‌కు ఇండియన్ వెల్స్‌లో ఊహించని ఓటమి ఎదురైంది. 20 ఏండ్ల ఇటలీ కుర్రాడు, వరల్డ్ నం.123 లూకా నార్డి 2-1తో సెర్బియా యోధుడిపై అద్భుత విజయం సాధించాడు. రెండున్నర గంటల పాటు సాగిన మూడో రౌండ్ మ్యాచ్‌లో 6-4, 3-6, 6-3తో జకోవిచ్‌పై లూకా గెలుపొందాడు. 'ఈ రోజు వరకు నేను ఎవరో ప్రపంచానికి తెలియదు. అభిమానులు మ్యాచ్‌ను ఆస్వాదించారని అనుకుంటున్నాను. జకోవిచ్‌పై విజయంతో చెప్పలేనంత సంతోషంగా ఉన్నాను. వరల్డ్ నం.1 జకోవిచ్‌ను ఓడించటం నిజంగా ఓ అద్భుతం. నేను ఏమాత్రం ఊహించని విజయం' అని లూకా నార్డి అన్నాడు.



స్ఫూర్తి నింపే తురుమై వచ్చేయ్ పాట

చైతన్య రావు, భూమి శెట్టి జంటగా నటించిన చిత్రం 'షరతులు వర్తిస్తాయి'. కుమారస్వామి(అక్షర) దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని స్టార్ లైట్ స్టూడియోస్ బ్యానర్‌పై నాగార్జున సామల, శ్రీష్ కుమార్ గుండా, డాక్టర్ కృష్ణకాంత్ చిత్తజల్లు నిర్మించారు.
ఈ సినిమా ఈ నెల 15న థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. తాజాగా ఈ సినిమా నుంచి 'తురుమై వచ్చేయ్..' లిరికల్ సాంగ్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతుల మీదుగా రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,'ఈ సినిమా పోస్టర్స్, సాంగ్స్ చూపించారు. కంటెంట్ చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంది. కరీంనగర్ నేపథ్యంగా సినిమా చేయడం సంతోషకరం. తెలంగాణ నేపథ్యంగా మరిన్ని సినిమాలు రావాలని ఆశిస్తున్నా. 'తురమై వచ్చేయ్..' పాట రిలీజ్ చేశాను. ఈ పాట వినగానే నచ్చేలా ఉంది. ఈ సినిమా హిట్ కావాలని కోరుకుంటున్నా' అని తెలిపారు.
'ఈ పాటకు సినిమాలో మంచి ఇంపార్టెన్స్ ఉంటుంది. సమస్యను ఎదిరించే క్రమంలో హీరో ఎలాంటి తెగువ చూపించాడు అనేది ఈ పాటలో ఇన్‌స్పైరింగ్‌గా తెరకెక్కించారు' అని హీరో చైతన్య రావ్ చెప్పారు.
దర్శకుడు కుమార స్వామి మాట్లాడుతూ, 'సమస్యలకు భయపడకుండా ఎదిరించి నిలవాలనే స్ఫూర్తిని అందించేలా ఈ పాటను రూపొందించాం. మా సినిమాలో ఈ సాంగ్ ప్రత్యేక ఆకర్షణ అవుతుంది' అని తెలిపారు.
'తురుమై వచ్చేయ్..' పాటకు పసునూరి రవీందర్ లిరిక్స్ అందించగా..అరుణ్ చిలువేరు మ్యూజిక్ కంపోజ్ చేశారు. ఎంఎల్ఆర్ కార్తికేయన్ పాడారు. 'తురుమై వచ్చేయ్, మెరుపే తెచ్చెయ్, తొడగొట్టి దమ్ము చూపి దుమ్ములేపెసేయ్, పదునే పెట్టేయ్, కథరే చూపెయ్, బరిదూకి ధూమ్ తడాఖా ఆట కట్టించెయ్, జనమంతా ఆదరిస్తే, ఏలేటి ఆ గద్దె నీ విద్దె కాదా, పవరుంటె ఎవ్వరైనా తలొంచి నీ చెంత గులాము కారా..'అంటూ నిరాశ నిండిన వారిలో స్ఫూర్తినింపేలా సాగుతుందీ పాట అని చిత్ర బృందం తెలిపింది.

నవచిత్రం

సరికొత్త పాయింట్‌తో శివం భజే



అశ్విన్ బాబు, దిగంగనా సూర్యవంశీ

అశ్విన్ బాబు హీరోగా మహేశ్వర్ రెడ్డి మూలి నిర్మాణంలో తెరకెక్కుతున్న చిత్ర టైటిల్‌ను మేకర్స్ సోమవారం ప్రకటించారు. గంగా ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రొడక్షన్ నెం.1 గా అప్సర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి 'శివం భజే' అని టైటిల్ పెట్టడం ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షించింది. బాలీవుడ్ నటుడు అర్బాజ్ ఖాన్ ముఖ్య పాత్ర పోషిస్తున్న ఈ చిత్రంలో దిగంగనా సూర్యవంశీ కథానాయికగా నటిస్తున్నారు.
ఈ సందర్భంగా చిత్ర నిర్మాత మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, 'కొత్త కథ, కథనాలతో రూపొందుతున్న న్యూ ఏజ్ సినిమా ఇది. కామెడీ, డ్రామా, యాక్షన్ థ్రిల్స్ తో ఆద్యంతం ఉత్కంఠ భరితంగా ఉంటుంది. బాలివుడ్ నటుడు అర్బాజ్ ఖాన్, తమిళ విలన్ సాయి ధీనా, హైపర్ ఆది ఈ చిత్రంలో ప్రధాన పాత్రలు పోషించారు. ఇప్పటికే 80% చిత్రీకరణ పూర్తి చేసుకుని భారీ రిలీజ్‌కి సిద్ధమవుతున్నాం' అని తెలిపారు. 'మా కథకి సరిగ్గా సరిపోయే టైటిల్ 'శివం భజే' దొరకడం చాలా సంతోషంగా ఉంది' అని దర్శకుడు అప్సర్ అన్నారు.

ఆ జయంలా పెద్ద హిట్ ఖాయం



సత్య మేరుగు, దీపిక

స్రవంతి సినిమా పతాకంపై కంటూరు రవికుమార్ చౌదరి నిర్మాతగా, జి. కిరణ్‌కుమార్ దర్శకత్వంలో సత్య మేరుగు, దీపిక జంటగా రూపొందిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'జయం'.
ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ పోస్టర్‌లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఫిల్మ్ ఛాంబర్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి నిర్మాతల మండలి సెక్రటరీ ప్రసన్నకుమార్, పీపుల్స్ మీడియా ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ శ్రీధర్, నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణలు ముఖ్య అతిథిలుగా హాజరై ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత రవికుమార్ చౌదరి మాట్లాడుతూ,'ఈ కార్యక్రమానికి వచ్చిన అతిథులకు థ్యాంక్స్. దర్శకుడు ఈ కథ చెప్పినప్పుడు ఆ 'జయం'లాగే ఈ 'జయం' కూడా అంతే సక్సెస్ అవుతుందనిపించింది. మంచి విజన్ ఉన్న దర్శకుడు కిరణ్‌కుమార్. నేను ఇప్పటికే 4 సినిమాలను నిర్మించాను. వాటి ద్వారా 10 మంది హీరోలను పరిచయం చేశాను. ఈ సినిమా అందరికీ పేరు తెచ్చిపెడుతుందనే నమ్మకం ఉంది' అని అన్నారు.
'మంచి కథకు మంచి నటులు, టెక్నీషియన్స్ దొరికారు. టైటిల్ ఎంత బాగుంటుందో.. సినిమా కూడా అంతే బాగుంటుంది. మంచి లవ్, యాక్షన్‌ని వినోదంతో మిక్స్ చేశాం. అందరికీ నచ్చే సినిమా అవుతుంది' అని దర్శకుడు కిరణ్‌కుమార్ చెప్పారు. 'నిర్మాత రవికుమార్ చౌదరి ఇంతకు ముందే 4 సినిమాలు తీసి ఉండటంతో ఆయనకు మంచి అనుభవం ఉందని భావిస్తున్నాను. 'జయం' అనే టైటిల్ ఈ సినిమాకు మంచి ప్లస్ పాయింట్ అవుతుంది. తప్పకుండా ప్రేక్షకుల మన్ననలు పొందుతుంది' అని తుమ్మలపల్లి రామసత్యనారాయణ చెప్పారు.
పీపుల్స్‌మీడియా ఎగ్జిక్యూటివ్ నిర్మాత శ్రీధర్ మాట్లాడుతూ,'నిర్మాత చౌదరితో నాకు ముందు నుంచీ పరిచయం ఉంది. మంచి అభిరుచిగల నిర్మాత. ఈ సినిమాకు మంచి కాస్టింగ్, టెక్నీషియన్స్‌ను ఎంచుకున్నారు. తేజ జయం చిత్రం లాగే ఈ జయం కూడా అద్భుత విజయం సాధించాలని కోరుకుంటున్నా. నాకు చేతనైన సాయం చేస్తాను' అని తెలిపారు.
'స్రవంతి బ్యానర్ ద్వారా రవికిషోర్ చాలాపెద్ద ప్రొడ్యూసర్‌గా ఎదిగారు. ఇప్పుడు ఈ స్రవంతి సినిమా ద్వారా ఈ చిత్ర నిర్మాత రవికుమార్ చౌదరి కూడా పెద్ద నిర్మాతగా ఎదగాలని కోరుకుంటున్నా. ౧ గతంలో తేజ చేసిన జయం ద్వారా ఎంతోమందికి లైఫ్ వచ్చింది. ఈ సినిమాతో కూడా కొందరు కొత్త వారికి లైఫ్ వస్తుందని ఆశిస్తున్నా. చిన్న సినిమాలకు మా ప్రోత్సాహం ఎప్పుడూ ఉంటుంది' అని నిర్మాతల మండలి సెక్రటరీ ప్రసన్నకుమార్ చెప్పారు.

గామికి సర్వత్రా అద్భుతమైన ప్రశంసలు



కార్తీక్ శబరీష్

విశ్వక్ సేన్ నటించిన చిత్రం 'గామి'. విద్యాధర్ కాగిత దర్శకత్వంలో కార్తీక్ కుల్ట్ క్రియేషన్స్‌పై కార్తీక్ శబరీష్ నిర్మించిన ఈ చిత్రంలో చాందినీ చౌదరి కథానాయిక. ఈ సినిమాకు క్రౌడ్ ఫండ్ చేశారు. వి సెల్యులాయిడ్ సమర్పణలో ఈనెల 8న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులని అద్భుతంగా అలరించి, విమర్శకుల ప్రశంసలని అందులోని ఘన విజయాన్ని సాధించింది. 'గామి' ప్రస్తుతం అద్భుతమైన కలెక్షన్స్‌తో అన్ని చోట్లా సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతున్న నేపథ్యంలో నిర్మాత కార్తీక్ శబరీష్ మీడియాతో ముచ్చటించారు.

■ మా లాంటి కొత్త వారికి సినిమా చేసిన తర్వాత అది విడుదల చేయడమే పెద్ద విజయం లాంటింది. 'గామి'కి అన్ని చోట్ల నుంచి అద్భుతమైన ప్రశంసలు దక్కడం చాలా బలాన్ని ఇచ్చింది. సినిమా విజయం సాధించడంతో ప్రశంసలు దక్కడం మరిన్ని మంచి చిత్రాలు చేయగలమనే నమ్మకాన్ని ఇచ్చింది. ఈ సందర్భంగా ప్రేక్షకులందరికీ ధన్యవాదాలు.

■ నేను తమాడ మీడియంలో షో ప్రొడ్యూసర్‌గా షార్ట్ ఫిలిమ్స్‌కి పని చేసేవాడిని. అక్కడ చాలా మంది ఎన్ఆర్ఐ లు తమ పేరు చూసుకోవాలనే ఇష్టంతో షార్ట్ ఫిల్మ్‌ని నిర్మించేవారు. ఇలాంటి వారందరిని ఒక్క చోటికి చేర్చి ఒక సినిమా తీస్తే బావుటుందనే ఆలోచన వచ్చింది. 'మను' అలా చేసిన చిత్రమే. గామి చిత్రానికి కూడ అదే స్ఫూర్తి. అంతకుముందు దర్శకుడు విద్యాధర్‌తో షార్ట్ ఫిలిమ్స్ చేశా. తనతో మంచి అనుబంధం ఉంది. అందుకే ఈ సినిమా తీశాం.

■ గేమ్ ఆఫ్ థ్రోన్స్‌కి పని చేసిన వీఎఫ్ఎక్స్ టీంతో గామికి వర్క్ చేశారు. దర్శకుడు విద్యాధర్ ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాడు. గామిలో చాలా వీఎఫ్ఎక్స్ వర్క్ ఉంది. దాన్ని వీలైనంత వరకూ మన పరిధిలో ఎలా చేయగలమని ఆలోచించాం. ప్రత్యేకంగా సింహం సీక్వెన్స్‌ని వారితో చేయించుకొని దానికి అదనంగా వాడాల్సిన హంగులని మన టీంతో చేయించుకునేలా ప్లాన్ చేసుకున్నాం. దాని కారణంగా దాదాపు వారి ఇచ్చిన కొటేషన్ కి 40శాతం తగ్గించగలిగాం.

■ ప్రస్తుతం చిరంజీవి 'విశ్వంభర' చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా పని చేస్తున్నాను. అది పూర్తి అయిన తర్వాత కొత్త సినిమా గురించి ఆలోచిస్తాను.

ఇది శంకర్ జైకిషన్‌కి ఘన నివాళి



ఇటీవలే ఫిలిం నగర్‌లోని ఎఫ్ఎన్‌సిసి క్లబ్‌లో ఆల్ ఇండియన్ బ్రిడ్జి 12వ టోర్నమెంట్ సందర్భంగా శంకర్ జైకిషన్ మధుర గీతాలను తలచుకుంటూ ఓ కార్యక్రమం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎఫ్ ఎన్ సి సి ప్రెసిడెంట్ జి. ఆదిశేషగిరిరావు, వైస్ ప్రెసిడెంట్ తుమ్మల రంగారావు, సెక్రటరీ ముళ్ళపూడి మోహన్, జాయింట్ సెక్రెటరీ వి.వి.ఎస్. ఎస్. పెద్దిరాజు, ట్రెజరర్ బి.రాజశేఖర్ రెడ్డి, మెంబర్స్ కాజా సూర్యనారాయణ, బాలరాజు, ఏడిద సతీష్ (రాజా), వరప్రసాద రావు, సామా ఇంద్రపాల్ రెడ్డి, ఫార్మర్ ప్రెసిడెంట్ డాక్టర్ కే. ఎల్.నారాయణ, డైరెక్టర్ బి. గోపాల్, కల్చరల్ కమిటీ చైర్మన్ తమ్మిరెడ్డి భరద్వాజ్, శంకర్ జైకిషన్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఇంటర్నేషనల్ ఆర్గనైజర్ లక్ష్మి , లక్ష్మి నారాయణ, గురువారెడ్డి తదితరులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా తమ్మిరెడ్డి భరద్వాజ్ మాట్లాడుతూ, 'ఈ ఫంక్షన్ ఏర్పాటు చేసిన లక్ష్మికి, గురువా రెడ్డికి, మురళికి ధన్యవాదాలు. ఈ చల్లని సాయంత్రం మంచి మ్యూజిక్‌తో ఆహ్లాదకరంగా జరిగింది' అని అన్నారు.
శంకర్ జైకిషన్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఇంటర్నేషనల్ ఆర్గనైజర్ లక్ష్మి మాట్లాడుతూ, 'శంకర్ జైకిషన్ అభిమాన సంఘం 2014లో స్థాపించడం జరిగింది. కారణం నేటి సినిమా పాటలలో మెలోడీ పాటలు తగ్గిపోయాయి. పాత రోజుల్లో పాటలు ఎంత మధురంగా ఉండేవో నేటి యువతకి తెలిసేలా చేయాలి. గోల్డెన్ ఎరాలో అన్ని పాటలు బావుండేవి, అందరూ బాగా చేసే వారు. వారిలో ఒకరైన శంకర్ జైకిషన్ పేరు పెట్టుకున్నాము. ఈ ఆర్గనైజేషన్ ద్వారా ప్రజలకు వైద్య సాయం చేయడం లాంటి ఎన్నో సేవ కార్యక్రమాలు చేస్తున్నాం. భారత దేశంలో ఓ యుద్ధ సమయంలో ఇందిరా గాంధీ ఫండ్స్ అడిగినప్పుడు మొదటిగా శంకర్ జైకిషన్ ముందుకు వచ్చారు. అందుకే ఆయన అంటే మాకు అభిమానం. అదేవిధంగా ఎంతోమందికి ఆపరేషన్ల కోసం సహాయం చేశారు. అదే బాటలో మేము గతంలో కొంతమందికి సహాయం చేశాం. ఈ సంవత్సరం ఈశ్వర్ చంద్ర హాస్పిటల్స్ ద్వారా ప్లాస్టిక్ సర్జరీస్ ఆపరేషన్‌కి సహాయం చేయాలనుకుంటున్నాం. ఒకపక్క మంచి మెలోడీ సాంగ్స్ అందిస్తూనే శంకర్ జై కిషన్ కష్టాల్లో ఉన్నవారికి పేదలకు చేసిన సహాయాన్ని కొనియాడారు' అని అన్నారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886